www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 213 | మంగళవారం | 23 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

నేడు దావోస్ సదస్సులో ప్రధాని మోడీ ప్రసంగం 10

అసమ భారత విషమ దృశ్యం



- పై ఒక్క శాతం సంపన్నుల గుప్పెట్లో 73 శాతం దేశ సంపద
- 2017లో 20.9 లక్షల కోట్లు పెరిగిన వీరి ఆదాయం
- ఒక్క శాతమే పెరిగిన 67 కోట్ల మంది నిరుపేదల రాబడి
- పనిని గౌరవించండి, సంపదను కాదు అనే శీర్షికతో ప్రభుత్వాలకు బుద్ధి చెబుతూ దావోస్‌లో ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదల

దావోస్ : భారత జనాభాలో ఒక శాతం అత్యంత ధనవంతులు గత ఏడాది ఉత్పత్తి అయిన దేశ సంపదలో 73 శాతాన్ని సొంతం చేసుకున్నారని ఆక్స్‌ఫామ్ వార్షిక సర్వే వెల్లడించింది. దేశం లో నిరుపేదలైన 67 కోట మందికి ఆదాయం కేవలం ఒక్క శాతం మాత్రమే పెరిగిందని కూడా అంతర్జాతీయ హక్కుల బృందం తెలిపింది. దావోస్‌లో ప్రపంచవ్యాప్త సంపన్నులు, దేశాధిపతులు హాజరయ్యే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) శిఖరాగ్ర సభ ప్రారంభానికి కొన్ని గంటల ముందు ఆక్స్‌ఫామ్ ఈ నివేదిక విడుదల చేసింది. ప్రపంచ వాప్తంగా చూస్తే ఈ దృశ్యం మరింత ఆందోళనకరంగా ఉంది. గత ఏడాది ప్రపంచంలో ఉత్పత్తి అయిన సంపదలో 82 శాతం ఒకటి శాతం మందిని చేరింది. ఇది భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఆదాయ వ్యత్యాసాలకు నిదర్శనం. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశంలో ఏటా కూలంకషంగా చర్చించే నివేదిక ఇది. ఆదాయంలో వ్యత్యాసాలు, తరువాయి 6లో



మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు తరలి వస్తున్న భక్తులు. గద్దె ముందు ప్రసాదంతో ప్రణామాలర్పిస్తున్న దృశ్యం

గోదావరిపై 3 వంతెనలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్ణశాల, ఆదిలాబాద్‌లో అర్జున గుట్ట, భూపాలపల్లిలో పలుగుల వద్ద రోడ్డు బ్రిడ్జిలను మంజూరు చేసిన కేంద్రం

అటవీ ప్రాంతంలో రెండు లైన్ల రోడ్లకు అంగీకారం : మంత్రి తుమ్మల వెల్లడి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రానికి గోదావరి నదిపై మూడు వంతెనలను కేంద్రం మంజూరు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్ణశాల, ఆదిలాబాద్ జిల్లా అర్జునగుట్ట, భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం పలుగుల వద్ద ఈ రోడ్డు వంతెనలు నిర్మాణం కానున్నాయి. వీటితో వివిధ మార్గాల మధ్య దూరం తగ్గడమే కాకుండా రవాణాపరమైన ఇబ్బందులు తొలగనున్నాయి. ఆర్ అండ్ బి ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఇఎన్‌సిలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, ఇతర చీఫ్ ఇంజినీర్లలో మంత్రి తుమ్మల సోమవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల తరువాయి 6లో



7 ప్రజావాణిలో ఇద్దరు ఆత్మహత్య

- మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో టిడిపి నాయకుడు, జగిత్యాలలో మరో రైతు ప్రాణ త్యాగం

2024లోపు జమిలి అసాధ్యం 6

- ఆదర్శమే అయినా అమలు సాధ్యం కాదు - మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టిఎస్ కృష్ణమూర్తి

ఎన్నికలకు సిద్ధంకండి

డిసెంబర్‌లోనే అసెంబ్లీ ఎన్నికలంటూ కార్యకర్తలను అప్రమత్తం చేసిన ఉత్తమ్

మన తెలంగాణ/ హైదరాబాద్ : శాసనసభకు గడువు కన్నా ముందే డిసెంబర్‌లో ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అందకు అందరూ సిద్ధంగా ఉండాలని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే కొద్ది వారాల్లో ఇతర పార్టీల నుండి ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరుతారని వెల్లడించారు. గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు క్యామ మల్లేశ్ నేతృత్వంలో ఇబ్రహీం పట్నం మండలం మంగల్‌పల్లి నుంచి గ్రామ సర్పంచ్ అశోక్ గౌడ్, పలువురు వార్డు సభ్యులు, టిడిపి కార్యకర్తలు పెద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తరువాయి 6లో



మా దారి సుదీర్ఘం

మాది నిర్మాణాత్మక రాజకీయం

- రెండు రాష్ట్రాల్లోనూ బలమున్న చోట పోటీ చేస్తాం
- సమస్యలు అర్థం చేసుకొని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం
- అధికార పక్షాలు నన్ను వాడుకోవడం లేదు
- బిజెపి ఆహ్వానాన్ని తిరస్కరించాను
- కొండగట్టులో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటన



మన తెలంగాణ/ కరీంనగర్: రానున్న శాసనసభ ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో తమకు బలమున్నచోట్ల పోటీ చేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. సోమవారం ఉదయం జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయ స్వామిని దర్శించుకొని సుదీర్ఘ రాజకీయ యాత్రకు శ్రీకారం చుట్టిన పవన్ సాయంత్రం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినీరంగంపై ఇక ప్రత్యేక దృష్టి సారించబోనని తేల్చి చెప్పారు. పార్టీ నిర్మాణానికే తన సమయాన్ని వెచ్చిస్తానన్నారు. ఒక రాజకీయ పార్టీ బలమైన సంస్థగా ఎదగాలంటే ఒకరోజుతో సాధ్యం కాదని, అది క్రమేణా జరగాల్సి ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తనపై అభిమానం ఉందని, అభిమానులు ఉన్నారని చెప్పారు. తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి వంటి పార్టీల నిర్మాణానికి దశాబ్దాలు పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. విభజన అనంతరం రెండు రాష్ట్రాలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళడం ఆ ప్రభుత్వాలకు సవాల్‌లాంటిదన్నారు. ఇటీవల తాను తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావును కలిసిన అనంతరం వస్తున్న వార్తలపై ఆయన స్పష్టత ఇచ్చారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని తరువాయి 6లో

కుంచెపోటు



ఆ సిద్ధాంతం కరెక్టయితే కోతులక్కూడా ఆధార్‌కార్డులు ఇవ్వాలి మరి!

భవనం పైనుంచి దూకిన

తల్లి, కూతురు మృతి

హైదరాబాద్ చందానగర్‌లో విషాదం



స్వాతి, శాన్వి (ఫైల్ ఫొటో)

మన తెలంగాణ/ హైదరాబాద్/ శేరిలింగంపల్లి: పిల్లలు ఆరోగ్యంగా లేరని కలత చెందిన ఓ తల్లి తన 9 నెలల పసిపాపతో ఐదంతస్తుల మేడపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శేరిలింగంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించింది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన ప్రదీప్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ చందానగర్ పిజెఆర్ ఎన్‌క్లేవ్‌లోని సాయి పెరల్ రెసిడెన్సీలో ఉంటున్నారు. వీరికి ఐదు సంవత్సరాల బాబు ఆరుశ్రమ్, 9నెలల పాప శాన్వి ఉన్నారు. బాబు వయస్సు పెరిగినా శారీరక ఎదుగుదల లేకపోవడంతో పాటు చిన్న పిల్లవాడిలా ప్రవర్తిస్తున్నాడు. దాంతో పాటు కూతురు శాన్వి సైతం తరచూ అనారోగ్యానికి తరువాయి 6లో

సిఐతో మహిళా ఎఎస్‌పి వివాహేతరం

ప్రత్యక్షంగా పట్టుకొని మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

ఇన్‌స్పెక్టర్‌ను అర్ధరాత్రి చెప్పలతో కొట్టి తరిమివేసిన ఎఎస్‌పి తల్లి, అత్త



మన తెలంగాణ/ హైదరాబాద్: పోలీసు శాఖలో అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న ఆమె, కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన మధ్య వివాహేతర సంబంధం బట్టబయలైంది. ఆమె భర్త రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకొని బయట పెట్టాడు. ఎఎస్‌పి ఇంట్లో అర్ధరాత్రి సమయంలో పట్టుబడిన ఇన్‌స్పెక్టర్‌పై ఆమె తల్లి, అత్త చెప్పులతో దాడి చేసి తరమికొట్టారు. తన భార్యతో ఇన్‌స్పెక్టర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడంటూ ఎఎస్‌పి భర్త మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్‌పై ఐపిసి 447, 497, 506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటన రాష్ట్ర పోలీసు శాఖను ఒక కుదుపు కుదిపింది. ఒకపక్క డిజిపి మహేందర్‌రెడ్డి పోలీసు శాఖను బలోపేతం చేసే ప్రక్రియలో జిల్లాల యాత్ర చేస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకోవడం పోలీసు శాఖలో చర్చానీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్‌లో నివాసముంటున్న సురేందర్‌రెడ్డి, సునితారెడ్డిలు దంపతులు. ఎసిబిలో ఎఎస్‌పిగా సునితారెడ్డి విధులు నిర్వహిస్తుండగా ఆమె భర్త ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.మల్లిఖార్జున్‌రెడ్డితో రెండేళ్ల క్రితం సునితారెడ్డితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరా చేసుకున్న మల్లిఖార్జున్, సునితారెడ్డిని లొంగదీసుకున్నాడు. నాటి నుంచి వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుంది. అనుమానించిన భర్త పలుమార్లు మల్లిఖార్జున్‌రెడ్డితో పాటు భార్యను మందలించాడు. అయినప్పటికీ మల్లిఖార్జున్‌తో తన భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని గ్రహించాడు. అయితే ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత మాదాపూర్‌లోని సునితారెడ్డి ఇంట్లోకి మల్లిఖార్జున్‌రెడ్డి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న సురేందర్‌రెడ్డి మీడియాతో రంగ ప్రవేశం చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. అదే సమయంలో సునితారెడ్డి తల్లి, అత్త చెప్పులతో మల్లిఖార్జున్‌రెడ్డిపై దాడి చేసి తరిమికొట్టారు. ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి తనకు తెలియకుండానే తమ ఇంట్లోకి ప్రవేశించాడని, తన భార్య సునితారెడ్డితో వివాహేతర సంబంధం తరువాయి 6లో

మన తెలంగాణ
2 హైదరాబాద్ మంగళవారం 23, జనవరి 2018
www.manatelangana.news

రాహుల్ సందర్శించినా... పొగడకుండా ఉండలేరు : కర్నె



మన తెలంగాణ/ హైదరాబాద్ :కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రదేశాలను కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ సందర్శించినా ప్రభుత్వాన్ని పొగడకుండా ఉండలేరని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అన్నారు. గవర్నర్ నరసింహన్ పోలవరం అవకతవకలపై కేంద్రానికి నివేదిక ఇచ్చినందుకు ఎపి కాంగ్రెస్ పొగుడుతుంటే, తెలంగాణ కాంగ్రెస్ విమర్శించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమన్నారు. టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గవర్నర్ కాళేశ్వరం పర్యటనలో ప్రభుత్వాన్ని పొగడడం పై కాంగ్రెస్ దివాళా కోరు రాజకీయాలు చేస్తోందని, తక్షణమే గవర్నర్‌కు కాంగ్రెస్ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నరసింహన్‌ను గవర్నర్‌గా నియమించింది కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. పథుత్వం చేపట్టే ప్రతి పథకాన్ని క్షేత్ర స్థాయిలో గవర్నర్ పరిశీలిస్తున్నారని అన్నారు.గవర్నర్ మంచి చెబితే కాంగ్రెస్ కు ఎందుకు కడుపు మంట ? అని ప్రశ్నించారు.పవన్ కళ్యాణ్ తో టిఆర్ఎస్‌కు రహస్య అవగాహన వుందని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కర్నె అన్నారు. పవన్ పూర్తి స్థాయి రాజకీయ నేతగా మారి యాత్ర కొనసాగిస్తే ఆల్ ది బెస్ట్ అని చెప్పారు.సిఎం కెసిఆర్ తో భేటీ లో పవన్ రాజకీయాలు చర్చించలేదని,ఆయనకు ప్రభుత్వ విధానాలు నచ్చితే ఆహ్వానించదగ్గ పరిణామమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కాంగ్రెస్ 'ముందస్తు' ప్రణాళిక

- తొమ్మిది మాసాల ముందే అభ్యర్థులపై స్పష్టత
- ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాల గుర్తింపు



మన తెలంగాణ/ హైదరాబాద్ : శాసనసభకు ఈ ఏడాదిలోనే ముందస్తు ఎన్నికలు జరుగుతాయని అంచనా వేస్తున్న కాంగ్రెస్ అందుకు అనుగుణంగా వేగంగా పావులు కదుపుతోంది. త్వరలో అన్ని శాసనసభ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో వారే ఆ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కాబోతున్నారు. దీంతో ఎన్నికలకు సుమారు తొమ్మిది నెలల ముందే అభ్యర్థుల ఎవరో స్పష్టం కానుంది. ఇప్పటికే సుమారు 65 నియోజకవర్గాలల్లో అలాంటి నాయకులను పిసిసి గుర్తించింది. వారిలో సిట్టింగ్ ఎంఎల్‌ఏలు, మాజీ మంత్రులతోపాటు, నియోజకవర్గంలో టిఆర్ఎస్‌ను అన్ని రకాలుగా ఢీకొనే బలమైన నాయకులనే పేరున్న వారే ఉన్నారు. ఇక మిగతా నియోజకవర్గాల్లో కూడా ధీటైన నేతలనే ఇన్‌ఛార్జ్‌లను నియమించేందుకు జోరుగా అన్వేషణ సాగుతోంది. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు నాయకులు సిద్ధంగా ఉన్నారని, అందులో ప్రస్తుత ఎంఎల్‌ఏలతో పాటు మాజీ మంత్రులు, మాజీ ఎంఎల్‌ఏలు కూడా ఉన్నారని కాంగ్రెస్ ముఖ్య నాయకులొకరు చెప్పారు. అలాంటి వారిని కూడా పరిగణలోకి తీసుకోవడంతో పాటు, ఆయా నియోజకవర్గాల వారీగా సర్వేలు నిర్వహించి ఇన్‌ఛార్జ్‌గా సరిపడే నాయకుడిని గుర్తించనున్నారు. మార్చి నెలలో ఉగాది నాటికి ఈ ప్రక్రియ అంతా కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. దీని వల్ల అకస్మాత్తుగా నియోజకవర్గ పునర్విభజన జరిగినా కూడా ఇబ్బంది పడకుండా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.

టిక్కెట్ కోసం పాట్లు లేనట్లే: కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్ సాధించడమే పెద్ద ఘనతగా భావిస్తారు. చివరి నిమిషం వరకు ఎవరికి టిక్కెట్ వస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి. అలాంటి పద్ధతికి ఫుల్‌స్టాప్ పెడుతూ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లకే టిక్కెట్లు ఇస్తామని అధిష్టానం భరోసా ఇవ్వనుంది. దీంతో టిక్కెట్ల కోసం గాంధీ భవన్ చుట్టూ, ఢిల్లీ చుట్టూ తిరగాల్సిన పని లేకుండా చేయాలని కాంగ్రెస్ ఆలోచన. ఎన్నికలకు చాలా నెలల ముందే ఇన్‌ఛార్జ్ ఎవరో చెప్పడం ద్వారా ఆ నియోజకవర్గ అభ్యర్థి ఎవరనేది దాదాపుగా స్పష్టమవుతుంది. కాబట్టి వారే ఎన్నికల వరకు ఆ నియోజకవర్గాల కార్యకర్తల సాధక బాధకాలు, ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు, పార్టీ కార్యక్రమాలను భుజాన వేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి సమయం నియోజకవర్గాల్లోనే కేటాయించాల్సి ఉంటుంది.

ఫిబ్రవరి మూడో వారంలో బస్సుయాత్ర : ఫిబ్రవరి మూడో వారం నుండి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిచేందుకు కాంగ్రెస్ సిద్ధ మవుతోంది. నాయ కులందరినీ ఒక్కతాటిపైకి చేర్చి మొత్తం 119 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర రెండు విడతలుగా సాగేలా ప్లాన్ చేస్తున్నారు. తొలుత మార్చిలో బడ్జెట్ సమా వేశాల మొదలయ్యే వరకు నెల రోజుల పాటు మొదటి విడత బస్సు యాత్ర సాగుతుంది. తిరిగి బడ్జెట్ సమా వేశాలు ముగిసాక ఏప్రిల్, మే నెలలో రెండో విడత నిర్వహిస్తారు. మధ్యలో ఏదో ఒక చోట రాహుల్‌గాంధీని ఆహ్వానించి బహిరంగ సభ నిర్వహించాలని అనుకుంటున్నారు. యాత్ర ముగింపుగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న భారీ బహిరంగ సభకు ఏర్పాటు చేయనున్నారు. 2004లో ఎవరికి వారుగా విడిపోయి ఉన్న కాంగ్రెస్ నాయకులను ఏకతాటిపై తెచ్చేందుకు నాటి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గులాం నబీ ఆజాద్ వ్యూహాత్మకంగా నిర్వహించిన బస్సు యాత్ర విజయవంతమైంది. అదే ఫార్ములాను ఉపయోగించుకొని నాయకుల మధ్య ఐకత్య తీసుకురావాలని అధిష్టానం భావిస్తుంది.

48 ఓటర్లకో ఇంఛార్జి

నియోజకవర్గంలో ప్రతి ఒక్క ఓటరుకు చేరువయ్యేందుకు కాంగ్రెస్ ప్రణాళిక రూపొందించుకుంటుంది. ఓటరు జాబితాలో ఒక్కో పేజీకి ఒక్కో ఇంఛార్జ్‌ను నియమించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. సాధారణంగా ఒక పేజీలో 48 మంది ఓటర్ల వివరాలు ఉంటాయి. అంటే ప్రతి 48 మందికి ఒక బూత్ కమిటీ సభ్యున్ని ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తారు. ఇందులో భాగంగా 30,600 పోలింగ్ బూత్‌ల వారీ గా కమిటీలు వేసే ప్రక్రియను వేగిరం చేసింది. బూత్ కమిటీల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల మంది యంత్రాంగాన్ని తయారు చేసుకుంటుంది. ఇప్పటికే ఒక లక్ష మందిని కమిటీల్లో నియమితులయ్యారు. మిగిలిన మూడు నెలల్లో మొత్తం లక్ష్యాన్ని చేరుకోవాలని భావి స్తున్నారు. వీరి వివరాలన్నిటినీ శక్తి యాప్ పేరుతో ఒక దగ్గర క్రోడీకరించడంతో పాటు కింది స్థాయి బూత్ కమిటీ సభ్యుడు కూడా పిసిసి అధ్యక్షునితో నేరుగా సంప్రదించే అవకాశాన్ని వీలు కల్పించనున్నారు. అంతే కాకుం డా నియోజవర్గానికో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌ను నియమించి, ప్రతి ఒక్క ఓటర్‌ను చేరేలా చూస్తున్నారు.

రాష్ట్రానికి కొరియా పరిశ్రమలు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్, కొరియాలోని పరిశ్రమలు ఆసక్తి చూపుతున్నాయని ప్రభుత్వ సలహాదారులు జి.వివేకానంద్ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల పరిస్థితులను, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, రాయితీలను, సులభతర విధానాలను మంత్రి కెటిఆర్ ఆ దేశ పరిశ్రమల ప్రతినిధులకు వివరించారన్నారు. సచివాలయంలో సోమవారం మీడియా సమావేశంలో కొరియా కాన్సూల్ జనరల్ చుక్కపల్లి సురేష్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్.వి.ఎస్.రెడ్డితో కలిసి వివేక్ మాట్లాడుతూ ఎంగ్‌మెన్ సంస్థ హైదరాబాద్‌లో 'ఫ్యాషన్ సిటీ' ఏర్పాటు చేసి, ఈ వేదిక ద్వారా వరంగల్‌లోని టెక్స్‌టైల్ పార్కులోని ఉత్పత్తులను విక్రయించే అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణ వారికి కొరియా భాష వస్తే మంచి అవకాశాలు వస్తాయని భావించిన కెటిఆర్ హైదరాబాద్‌లో కొరియా లాంగ్వేజ్ సెంటర్ ఏర్పాటుకు అంగీకారం తెలిపారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కొరియా కన్సూలేట్‌ను ఏర్పాటు చేయనున్నామని, త్వరలోనే అక్కడి రాయబారి వస్తారన్నారు. కన్సూలేట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలను స్థాపించేందుకు మంచి అవకాశం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమల రాకతో తెలంగాణ టెక్స్‌టైల్ మార్కెట్ విస్తరిస్తుందన్నారు. జపాన్‌కు చెందిన వేస్ట్ క్లీన్‌తో ఎనర్జీ ఉత్పత్తి చేసే సంస్థతో కూడా ఒప్పందం జరిగిందన్నారు.

పది మందికి ఐఎఎస్‌లుగా పదోన్నతి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర సర్వీసు కేడర్‌కు చెందిన పదిమందికి ఐఎఎస్ పదోన్నతి కల్పిస్తూ కేంద్రం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2014, 2015, 2016 సంవత్సరాలకు రాష్ట్రంలో ఖాళీ అయిన 16 పోస్టులకుగాను తొలి జాబితాగా అర్హత కలిగిన పది మంది అధికారుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో యుపిఎస్సీకి పంపించగా పరిశీలన అనంతరం వారికి ఐఎఎస్ పదోన్నతి కలిస్తూ కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని డివోపిటి (శిక్షణ సిబ్బంది వ్యవహారాల విభాగం) ఉత్తర్వులు జారీ చేసింది. 2014 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాలో ఏ ఒక్కరికీ తగిన అర్హతలు లేనందువల్ల ఆ సంవత్సరానికి సంబంధించి ఐఎఎస్‌గా పదోన్నతి ఇవ్వలేమని, అందువల్ల ఆ ఏడాదికి సంబంధించిన జాబితాను వెలువరించలేమని డివోపిటి తాజా ఉత్తర్వుల్లో పేర్కొనింది. కానీ 2015 సంవత్సరానికి సంబంధించి మొత్తం మూడు పోస్టులకు పదోన్నతి కల్పించాల్సి ఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాకు అనుగుణంగా కొర్ర లక్ష్మి, కె. ధర్మారెడ్డి అనే ఇద్దరికి ఐఎఎస్ పదోన్నతి కల్పిస్తున్నట్లు పేర్కొనింది. ఇక 2016 సంవత్సరానికి సంబంధించి మొత్తం 14 పోస్టులకు పదోన్నతి ఇవ్వాల్సి ఉందని, కానీ ప్రభుత్వం పంపిన పది మంది జాబితాలో మిగిలిన ఎనిమిది మందిని నిర్దిష్టంగా ఆ సంవత్సరానికి ఖరారు చేసినట్లు డివోపిటి స్పష్టం చేసింది. చిట్టెం లక్ష్మి, టి. వినయ్ కృష్ణా రెడ్డి, సిహెచ్ శివలింగయ్య, వి. వెంకటేశ్వర్లు, ఎం. హనుమంతరావు, డి. అమోయ్‌కుమార్, కె. హైమవతి, ఎం.హరిత అనే ఆరుగురిని ఖరారు చేసింది. ప్రస్తుతానికి వీరిని ప్రొబేషన్ జాబితాలో ఉంచామని, తెలంగాణ రాష్ట్ర కేడర్‌గా నిర్ణయం తీసుకునేంతవరకు అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న ఏ.వాణీప్రసాద్, వాకాటి కరుణ, ఎం.ప్రశాంతిలు గతంలో హైదరాబాద్‌లోని 'క్యాట్' (సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్)లో పిటిషన్లు దాఖలు చేశారని, అక్కడ వెలువడిన తీర్పును సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం రిట్ పిటిషన్లను దాఖలు చేసిందని, దానికి అనుగుణంగానే పై పది మందికి ఐఎఎస్ పదోన్నతులుంటాయని డివోపిటి స్పష్టం చేసింది.

త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు?

వరుసగా మూడు సంవత్సరాలకు పది మంది రాష్ట్ర సర్వీసు అధికారులకు ఐఏఎస్ పదోన్నతి లభించినందువల్ల త్వరలో ఇందులో కనీసంగా ఏడుగురిని రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాలకు కలెక్టర్లుగా నియమించే అవకాశం ఉంది. ఇప్పటికే అక్కడ కలెక్టర్లుగా పనిచేస్తున్నవారు ఇతర విభాగాలకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. తాజా ఐఏఎస్ పదో న్నతుల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో మరో మారు ఐఏఎస్‌ల బదిలీలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ నెలాఖరుకు బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు సచివాలయ వర్గాల సమాచారం.

సబ్సిడీ ట్రాక్టర్లపై అసంతృప్తి

- మంజూరులో అసమానతలపై అధికార, ప్రజాప్రతినిధులు అసహనం



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ కింద పంపిణీ చేసే సబ్సిడీ ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధుల్లో అసంతృప్తి మొదలైంది. ఒక్కొక్కరికి ఒక్కో తరహాలో మంజూరవుతున్నాయని ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌సి,ఎస్‌టి, బిసి వర్గాలవారిని అసలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో వ్యవసాయసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి స్టేట్ రిజర్వ్ కోటా (ఎస్ఆర్‌క్యూ) పేరుతో ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌ఏసిలు, మంత్రులు పంపిన జాబితా ఆధారంగా ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు మంజూరు చేస్తున్నారని, దరఖాస్తు చేసుకున్న పేద రైతులకు నిధులూ లేవు, ట్రాక్టర్లూ రావడం లేదని,అధికార పార్టీ కార్యకర్తలైన రైతులకు మాత్రమే సబ్సిడీ యంత్రాలు దక్కుతున్నాయనే విమర్శలు బలంగానే వినిపిస్తున్నాయి. మరో వైపు ఒక్కో ప్రజాప్రతినిధికి ఒక్కొ రకంగా ట్రాక్టర్లను మంజూరు చేస్తున్నారని, అధికార పార్టీకి చెందినవారే మంత్రిపైన ఆరోపణలు చేస్తున్నారు. ఒక్క నియోజకవర్గానికి మంజూరై మరొక నియోజకవర్గానికి రాకపోతే రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని, తమపై ఒత్తిడి పెరుగుతుందని ఒక ఎంఎల్‌సి 'మన తెలంగాణ'కు చెప్పారు. ఎస్ఆర్‌క్యూ కోటాలో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ ట్రాక్టర్లు మంజూరు చేస్తున్నారని, సామాన్యులకు మాత్రం మొండిచేయే ఎదురవుతోందని దరఖాస్తు చేసుకున్న రైతులు వాపోతున్నారు. 2017–18 ఆర్థిక సంవత్స రానికి మొత్తం ఐదు వేల ట్రాక్టర్లు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు రూ.186.6 కోట్లు బడ్జెట్‌లో నివేదించారు.అయితే ఇప్పటివరకు ఒక్క ట్రాక్టర్ కూడా లబ్దిదారులకు అందలేదు. గత ఆర్థిక సంవత్సరం మంజూరు చేసి,లబ్దిదారులకు ఇచ్చిన ట్రాక్టర్లకు ఈ ఏడాది బకాయిల కింద బిల్లులు చెల్లించారు.

కెసిఆర్‌వి పెత్తందారి పోకడలు

మన తెలంగాణ/హైదరాబాద్ : చరిత్రలో ఎంతో మంది నియంతలు కాల గర్భంలో కలిసిపోయారని, సిఎం కె.చంద్రశేఖర్‌రావు కూడా అలాగే వ్యవహరిస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ అన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో సోమవారం మందకృష్ణ మాదిగ నిర్బంద వ్యతిరేక పోరాట కమిటీ రమణను కలిసింది. ఈ సందర్భంగా మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావాలని కోరారు.బిసి మహాసబ గోడపత్రికను రమణ ఆవిష్కరించారు. పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

రోజా ఇంట్లో దొంగతనం

రూ.10 లక్షల విలువైన వస్తువులు అపహరణ

మనతెలంగాణ/హైదరాబాద్/ గచ్చిబౌలి : ప్రముఖ సినీ నటి , వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యే రోజా ఊరికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో విలువైన వస్తువులు దొంగిలించినట్లుగా గుర్తించిన భర్త సెల్వమణి సోమవారం రాయదుర్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... మణికొండలోని పంచవటి కాలనీలో నివాసం ఉంటున్న సినీ నటి, వైసిపి ఎమ్మెల్యే రోజా ఈ నెల 11న సంక్రాంతి పండగకు కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరికి వెళ్లింది. ఊరికి వెళ్లే సమయంలో ఇంట్లోని పని మనిషి రామలక్ష్మి కి తాళం ఇవ్వడంతో ఆమె కూడా ఊరికి వెళ్లి తిరిగి 18న పంచవటి కాలనీకి రావడంతో ఇంట్లో ఉన్న వస్తువులు, అల్మరా తాళం పగులగొట్టి ఉండడంతో తక్షణమే రోజాకు సమాచారం అందించింది. దీంతో రోజా భర్త సెల్వమణి వచ్చి చూసి ఇంట్లో ఎన్ని వస్తువులు పోయినవని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్ రాయదుర్గం పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఎంక్వైరీ చేయడం జరిగింది. 14 తులాల బంగారం, 2 కిలోల వెండి,కొన్ని వజ్రాలు పోయినట్లు గుర్తించారు. వీటి విలువ సూమరు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





మన తెలంగాణ
3 | హైదరాబాద్ మంగళవారం 23, జనవరి 2018
www.manatelangana.news



పవన్‌కల్యాణ్‌వి అవకాశవాద రాజకీయాలు: బిజెపి

మనతెలంగాణ/హైదరాబాద్: జనసేన అధినేత పవన్‌కళ్యాన్‌వి అవకాశ వాద రాజకీయాలని, ప్రాంతీయ వాదంతో ఆయన రాజకీయ పబ్బం గడపాలని చూస్తున్నారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్ రావు విమర్శించారు. జనసేన రాజకీయ పార్టీనా..? దళారి సంస్థనా .? అని ఎద్దేవా చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేనకు కార్యవర్గం, లోగో, జెండానే లేదన్నారు. ఆ పార్టీ విడుదల కాకముందే ఫెయిల్ అయిందని వ్యాఖ్యానించారు. కెసిఆర్‌ను పొగడడం వెనకాల ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ వ్యతిరేక ఓటును చీల్చేందుకు టిఆర్ఎస్ ప్రయోగిస్తున్న అస్త్రమే జనసేన పార్టీ అని వ్యాఖ్యానించారు. ఎపిలో చంద్రబాబు, తెలంగాణలో కెసిఆర్‌ను పొగడడం అంటేనే అది ప్యాకేజీల పార్టీగా కనబడుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఎపిలో పెరుగన్నం, తెలంగాణలో బిర్యానీ తినడమే రాజకీయం కాదన్నారు. రైతులు ఆత్మహత్యలు జరుగుతున్న సిఎంను ఎందుకు ప్రశ్నించలేదన్నారు. పవన్ యాత్రకు దిక్కు మొక్కులేదని, ఆ యాత్రకు లక్ష్యమే లేదన్నారు. గౌరిలంకేష్ మృతిపై ప్రధాని మోడి స్పందిచలేదంటూ ప్రకాష్‌రాజ్ మతిలేకుండా మాట్లాడుతున్నారని, ఆయన వామపక్ష, కాంగెస్ పార్టీల కీలుబొమ్మ అని కృష్ణసాగర్ వ్యాఖ్యానించారు.

ఎన్‌ఆర్‌ఐలే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు

● స్విట్జర్లాండ్‌లో మంత్రి కెటిఆర్ పిలుపు



మన తెలంగాణ / హైదరాబాద్ : బంగారు తెలంగాణ కల సాకారంలో ప్రవాస తెలంగాణ వాసులు కలిసి రావాలని మంత్రి కెటి. రామారావు పిలుపు నిచ్చారు. సోమవారం స్విట్జర్‌లాండ్‌లోని జ్యూరిచ్ నగరంలో తెలంగాణ ఎన్‌ఆర్‌ఐలు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ పాలసీలు, రాష్ట్రంలో వాటి అమలు, గడచిన నాలుగు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని వివరించారు. ప్రవాస భారతీయులు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండాలని కోరారు. ఇతర దేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పరిచయం చేసేందుకు ఆసక్తిగల పారిశ్రామికవేత్తలను తెలంగాణ ప్రభుత్వంతో అనుసంధానం చేయడానికి ఎన్‌ఆర్‌ఐ మిత్రులు కలిసి రావాలని పిలుపు నిచ్చారు. పదిహేడేళ్ళ క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు ఇంకా పూర్తిగా కుదురుకోని పరిస్థితుల్లో ఉంటే తెలంగాణ మాత్రం మూడున్నరేళ్ళ లోనే అనేక రంగాల్లో దూసుకుపోయి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షల సాధన దిశగా ప్రయాణం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణను సాధిస్తామని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అప్పట్లో వ్యతిరేకించిన వారే ఇప్పుడు అభినందనలు తెలుపుతు న్నారన్నారు. పక్క రాష్ట్రం నుండి కూడా పార్టీ పెట్టాలన్న విజ్ఞప్తులు వస్తున్నాయంటేనే ఇక్కడి పాలన ఎంత జనరంజకంగా సాగుతుందో అర్థమవుతుందన్నారు. రాష్ట్రం విడిపోతే కరెంటు సమస్యలు వస్తాయని భయపెట్టారని, కానీ తెలంగాణ ప్రజలకు ఇప్పుడు పవర్ కష్టాలు తొలగిపోయాయని, 24 గంటల సరఫరా జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి మాత్రం 'పవర్' (అధికారం) పోయిందన్నారు. రాష్ట్రమంతటా తాగు, సాగు నీరు కల్పనే ముఖ్యమంత్రి ప్రాధాన్యత అన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనతో అన్నీ ఆన్‌లైన్‌లోకి వస్తున్నామని, ఇక ఎన్‌ఆర్‌ఐలు తెలంగాణలో భూములు ధైర్యంగా కొనవచ్చని అన్నారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు కూడా మాట్లాడారు.

టిఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



మన తెలంగాణ/హైదరాబాద్ : ఏడుదశాబ్దాల కాంగ్రెస్ పాలనే తెలంగాణ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి పోవడానికి కారణమని విద్యుత్, ఎస్‌సి అభివృద్ధిశాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం పరిధిలోని నిడమనూరు ఎంపిపి దాసరి నరసింహ, పెద్దవూర మండలం కొత్తలురు సర్పంచ్ ఒద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, సిరసన గండ్ల సర్పంచ్ పవన్ కుమార్,నెల్లికల్ మాజీ సర్పంచ్ జఠావత్ పంతులు నాయక్, త్రిపురారం మండల టి.డి.పి అధ్యక్షుడు కలకుండ వెంకటేశ్వర్లు సోమవారం తెలంగాణ భవన్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టిఆర్‌ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాము చేయని అభివృద్ధి ఇంకెవ్వరూ చేయొద్దనే రీతిలో ప్రతిపక్షాలు ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు.మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే అభినందించాల్సింది పోయి దొంగ కేసులతో అడ్డుకునే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులేనన్నారు. మిషన్ భగీరథకి నిధులు రాకుండా మోకాలడ్డింది ఆ పార్టీ నాయకులు కాదా అని ఆయన ప్రశ్నించారు. చివరికి కాం ట్రాక్ట్ ఉద్యోగుల క్రబద్ధీకరణకు కూడా కాంగ్రెస్ నేతలు కేసులు వేసి అడ్డుకోవడంతో సుమారు 20 వేల మంది ఉద్యోగులు అభద్రతకు నెట్టబడ్డారని మంత్రి ఆవేదన వ్యక్త పరిచారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ టిఆర్ యస్ ఇంఛార్జి నోముల నర్సిమయ్య,సీనియర్ టి ఆర్ యస్ నాయకులూ యం.సి కోటి రెడ్డి,కే.వి రామారావు,విజయభాస్కర్ రెడ్డి,వస్త్రపురి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వల్లనే ప్రభుత్వానికి అవార్డులు

మన తెలంగాణ/హైదరాబాద్: ఉద్యోగుల పనితీరుతోనే ప్రభుత్వానికి అవార్డులు దక్కుతున్నాయని టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 'తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్–2018' డైరీని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. టిజివో అధ్యక్షులు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు విష్ణువర్ధనరావు, కృష్ణమూర్తి, రవీందర్‌రావు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తి



మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నారని రాష్ట్ర హోంమంత్రి నాయినినర్సింహరెడ్డి అన్నారు. 29 రాష్ట్రాల్లో సిఎం కెసిఆర్ నెంబర్ వన్ అని మీడియానే చెబుతుంటే ప్రతిపక్షాలు మాత్రం ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నాయన్నారు. ఆన్‌లైన్ విధానంలో ఇటీవల కార్మిక శాఖకు అవార్డు లభించిన నేపథ్యంలో సచివాలయంలో సోమవారం కార్మిక శాఖ కమిషనర్ నదీమ్ అహ్మద్‌ను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ప్రభుత్వం నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. అవినీతి రహిత పాలనగా కార్మిక శాఖ పేరు తెచ్చుకున్నదని, ఇందుకు పనిచేసిన కార్మిక శాఖ అధికారులను, సిబ్బందిని ఆయన అభినంధించారు.

కమిటీలపై కృష్ణాబోర్డు చైర్మన్ ఒత్తిడి ?

మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో శ్రీవాస్తవ తన హయాంలో వేసిన మూడు కమిటీలను నివేదికలు త్వరగా సమర్పించాలని వత్తిడి తెస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ఫిర్యాదుల మేరకు రెండు, ఆంధ్ర ఫిర్యాదు మేరకు మరొక కమిటీని కృష్ణాబోర్డు చైర్మన్ నియమించారు. కమిటీలనైతే వేసారు గానీ, ఇప్పటివరకూ నివేదికలు మాత్రం రాలేదు. దీంతో పదవీ విరమణకు ఇంకా పది రోజులే సమయం ఉన్నందున త్వరగా నివేదికలు సమర్పిస్తే ఆమోదం తెలుపుతానంటూ ఆ కమిటీల బాధ్యులపై వత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. పలు అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్న బోర్డు ఇప్పుడు కమిటీల నివేదికల సిఫారసుల్లో సైతం అదే తరహాలో పావులు కదుపుతున్నారని తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులు అనుమానాలను, ఆందోళనను, ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

35 బాలికల గురుకులాలు అప్‌గ్రేడ్

మనతెలంగాణ/మల్యాల : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 35 బాలికల గురుకుల విద్యాలయాలను అప్‌గ్రేడ్ చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌మీడియట్ తరగతులు బోధిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలను సోమవారం కడియం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 35 గురుకులాలను కూడా ఇంటర్‌మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యాబోధన అందిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న బాలుర గురుకులాలతో పాటు మరో 29 బాలుర గురుకులాలను ఏర్పాటు చేసి ప్రతి జిల్లాకు రెండు గురుకులాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎంపిపి శ్రీలత, సర్పంచ్‌లు ఎనగందుల రజని, ఓలపు గంగాధర్, టిఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బొట్ల ప్రసాద్, ఎంపిటిసిలు దూస వెంకన్న, గంగాధర్, రాజయ్య, లత పాల్గొన్నారు.

టమాట, చెరుకు పంటలకూ బీమా

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమాలో టమాట, చెరుకు పంటలను నమెదు చేయాలని రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ ప్రతిపాదించింది. దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఫలితంగా అకాల వర్షాలకు, వడగండ్లకు, కరవు సమయాల్లో పంట నష్టపోతే బీమా కింద పరిహారం అందనుంది. అర్థగణాంక శాఖ ఇచ్చే 10 సంవత్సరాల సాగు, దిగుబడి ఆధారంగా కొత్త పంటలను బీమాలో చేర్చనున్నారు. అలాగే పంట నష్టానికి సంబంధించి డ్రోన్‌లను వినియోగించుకోవాలని ఎస్‌ఎల్‌టిసి ప్రతిపాదించింది. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో నష్టం అంచనాపై ప్రయోగత్మక పరీక్షలు నిర్వహిస్తున్నారు. డ్రోన్ పరిజ్ఞానంతో ఖచ్చితమైన పంట నష్టం అంచనా త్వరగా వచ్చి, పరిహారం రైతులకు తొందరగా వచ్చేందుకు వీలుపడుతందని అధికారులు పేర్కొంటున్నారు.

కొండగట్టులో పవన్ పూజలు



● ఆలయానికి రూ.11 లక్షల విరాళం

మనతెలంగాణ/హైదరాబాద్/జగిత్యాల/మల్యాల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ అంజనేయ స్వామి సన్నిధిలో జనసేన పార్టీ అధినేత, సినీ హీరో పవన్ కల్యాణ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరిన పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొండగట్టుకు చేరుకోవాల్సి ఉండగా గంటన్నర ముందే కొండగట్టుకు చేరుకున్నారు. ఆలయంలో అర గంట పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ఆలయ అభివృద్ధి కోసం తన వంతుగా రూ.11 లక్షల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఆంజనేయ స్వామి తన ఇలవేల్పు అని, అంజన్న దయ వల్లే తాను ప్రమాదం నుంచి బతికి బయటపడ్డానని, అంజన్న ఆశ్వీరాదం తీసుకుని ఇక్కడి నుంచే పార్టీ ప్రచారం ప్రారంభించేందుకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వపన్ కల్యాణ్ వస్తున్నారని తెలుసుకున్న అభిమానులు కొందరు ముందుగానే కొండగట్టుకు చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు.

మంగళహారతి.. నుదుట తిలకం : ప్రజాయాత్ర ప్రారంభానికి ముందు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు ఆయన సతీమణి అన్నా మంగళహారతులు ఇచ్చి సింధూర తిలకం దిద్ది అంతా శుభం కలగాలని ఆకాంక్షించారు. ప్రజాయాత్ర విజయవంతం కావాలని కొబ్బరికాయ కొట్టారు. అంతకుముందు జనసేనపార్టీ పరిపాలనా కార్యాలయంలో విభిన్న మతాలకు చెందిన మహిళలు మత సంప్రదాయాల ప్రకారం దైవ ప్రార్ధనలు చేసి పవన్ యాత్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన సోషల్ మీడియాకు సంబంధించి 'వీరమహిళ' పేరుతో ఏర్పాటయిన విభాగాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకువెళుతూ, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చే విధంగా 'వీర మహిళ' బృందం కృషి చేయాలన్నారు. ప్రజా శ్రేయస్సుకు కృషి చేస్తూ, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. కార్యకర్తల నినాదాలు నడుమ జనసేన నేత పవన్ తన పార్టీప్రతినిధుల బృందంతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధికి బయలుదేరారు.



నవ శిశువులకు ఆధార్

మహిళా శిశు సంక్షేమ శాఖకు నమోద బాధ్యత అప్పగింత





మన తెలంగాణ / హైదరాబాద్ : అప్పుడే పుట్టిన నవ శిశువుల మొదలు ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డుల నమోదు బాధ్యతను ఇకపై రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ చేపట్టనుంది. ఇప్పటి వరకు కొన్ని ఎంపిక చేసిన 'ఈ సేవ', 'మీ సేవ' కేంద్రాల ద్వారా ఆధార్ నమోదు ప్రక్రియ జరుగుతూ ఉంది. అయితే ఇది నిర్దిష్ట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండేవారికి మాత్రమే వీలుపడేది. నియోజకవర్గ పరిధికి బైట ఉండేవారికి వీలుపడేది కాదు. దీంతో జిల్లాను యూనిట్‌గా చేసుకు ని పౌర సరఫరాల శాఖకు ఈ బాధ్యతలను అప్పగించాలని ప్రభుత్వం తొలుత భావిం చింది. ఈ ఆలోచన కార్యరూపం దాల్చలేదు. దీంతో ఇకపైన మహిళా శిశు సంక్షే మ శాఖ ద్వారా ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం శనివారం రాష్ట్రాలకు మార్గ దర్శ కాలను పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతు (60%)గా ఆర్థిక సాయం చేస్తుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

కెమెరాలు, సామాగ్రికి రూ. 6.7 కోట్లు : ఆధార్ నమోదు కోసం కావాల్సిన ఐరిస్ ఉపకరణాలు, మూడు రకాల కిట్‌ల సామాగ్రిని మహిళా శిశు సంక్షేమశాఖను సమకూర్చుకునేందుకు అవసరమయ్యే రూ. 6.7 కోట్లలో కేంద్రం తన వాటా (60%)గా రూ. 4.07 కోట్ల మేరకు ఆర్థిక సహా యం అందిస్తుంది. మిగిలిన రూ. 2.63 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విడుదల చేస్తుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సమ్మతిని తెలియజేసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ సంక్షేమశాఖ డైరెక్టర్ విజయేందిర బోయి 'మన తెలంగాణ'కు వివరించారు. ఈ నిధులతో ఆఫీసులో సమకూర్చుకునే మూడు డెస్క్‌టాప్ కిట్స్, ఎక్కడికైనా తీసుకెళ్లేలా ఉండే లాప్‌టాప్ కిట్స్, మొబైల్ ట్యాబ్‌లను కొనుగోలు చేస్తారని తెలిపారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీస్ (సిడిపిఓ) ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఏజెన్సీగా ఉంటుందని, రాష్ట్రంలో149 సిడిపివో కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లల సమాచారాన్ని తెలుసుకుని వారి ఇండ్ల వద్దకే వెళ్లి సిడిపివో సిబ్బంది ఆధార్‌ను నమోదు చేస్తారని తెలిపారు. ఈ నెలలోనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు ఆమె తెలిపారు.

రాష్ట్ర ఖజానా దివాళా



● అభివృద్ధికి శాపంగా మారిన అప్పల భారం
● ప్రజలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినందుకు టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖాజానాను దివాళా తీయిస్తూ అభివృద్ధికి శాపంగా మారారన్నారు. కాంగ్రెస్‌వి నీచరాజకీయాలంటున్న వారే గతంలో గవర్నర్‌పై కాగితాలు చింపి మొహంపై విసిరేసిన విషయాన్ని గుర్తు చేశారు.గాంధీ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యాలను ఖండించారు. తాము లేవనెత్తిన అంశాలపై మంత్రి నేరుగా సమాధానం ఇవ్వకుండా అనుచిత వ్యాఖ్యాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. తాము నాడు శాసనసభ సమావేశాల్లో గవర్నర్ విషయంలో వెలికిగా ప్రవర్తించలేదన్నారు. నీళ్లు, నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. రూ. 28 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ. 80వేల కోట్లను పెంచితే గవర్నర్ ఎందుకు ప్రశ్నించలేదని మాత్రమే తాను నిలదీశానని చెప్పారు. ప్రతి ప్యాకేజీలో టెండర్లను ఆహ్వానించకుండానే పనులను ఎలా అప్గించారని ప్రశ్నించారు. ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్ట్‌కు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును పెడితే, ఎందుకు మార్చాల్సి వచ్చిందని అడిగినట్టు ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం బ్యాంక్‌ల నుంచి 9 నుంచి 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారని, అప్పు కోసం బ్యాంకులకు సమర్పించిన డిపిఆర్‌ను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్యాకేజీల వారిగా విచారణ జరగాలని, దీనిపై తాము గవర్నర్, పిఎసికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయమై గవర్నర్ స్పందించకుంటే రాష్ట్రపతిని కలిసి సెంట్రల్ విజిలెన్స్ విచారణ కోరుతామని, రాజ్యాంగ పరంగా అన్ని వ్యవస్థల తలుపులు తడుతామని ఆయన తెలిపారు.

పాలమూరు ప్రాజెక్టులూ పరిశీలించాలి : డి.కె.అరుణ

కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించిన గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను కూడా పరిశీలించాలని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ డి.కె. అరుణ ఆహ్వానించారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చి మూడున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ పాలమూరు ప్రాంతంలోని నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిలసాగర్ ప్రాజెక్ట్‌లలో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదన్నారు. కాం గ్రెస్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తై తుదిదశలో ఉన్నప్పటికీ వాటిని ఎందుకు పూర్తి చేయడం లేదో గవర్నర్ నరసింహన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. సిఎం, మంత్రి హరీశ్‌రావును గవర్నర్ పొగడ్తలతో ముంచడం శోచనీయమని, వారు కాటేశ్వర్‌రావులు, కమీషన్‌రావులని ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా పాలకుల మెప్పు కోసం పాకులాడుతున్న చందంగా గవర్నర్ శైలి ఉన్నదని ఆమె వ్యాఖ్యానించారు.



జాతర ఏర్పాట్లు పూర్తి

● జయశంకర్ భూపాలపల్లి ఇంచార్జి కలెక్టర్ కర్ణన్

మనతెలంగాణ/మేడారం/తాడ్వాయి/మంగపేట: జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జయశంకర్ భూపాలపల్లి ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్ అన్నారు. సోమవారం మేడారంలోని ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. జాతరకు పనులన్ని పూర్తయ్యాయన్నారు. చిన్న చిన్న పనులు ఏమైనా ఉంటే ఈ నెల 25వరకు పూర్తి చేస్తామన్నారు. జాతరకు ఇంకా 15రోజులు ఉన్నప్పటికీ ముందస్తుగానే సుమారు 10లక్షల పైచీలుకు భక్తులు తల్లులను దర్శించుకున్నారని తెలిపారు. జాతరలో ప్లాస్టిక్ మహమ్మారిని నియంత్రించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత జాతరగా జరుపుకునేందుకు భక్తులు సహకరించాలని కోరారు. మేడారం మహా జాతరలో ఎనిమిది మంది ట్రైనీ ఐఏఎస్‌లు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. మేడారంలో సేవలను వినియోగించుకునేందు కు మన మేడారం యాప్‌ను ప్రవేశపెట్టినట్టు ట్రైనీ కలెక్టర్ సంతోష్ తెలిపారు. మేడారానికి వచ్చే భక్తులు యాప్ ద్వారా జంపన్న వాగు, గద్దెల ప్రాంగణం వా రు ఉన్న ప్రదేశం నుంచి ఎంత దూరంలో ఉన్న ది తెలుసుకోవచ్చన్నారు.


జంతువుల గణన ప్రారంభం



మన తెలంగాణ/ ఉట్నూర్ రూరల్ : అడవిలో ఆరు కిలోమీటర్లు కాలి నడకన తిరిగి అటవీ జంతువుల గణన కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగురామన్న ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని బిర్సాయిపేట రేంజ్ పరిధిలోని కొలాంగూడ, రాంపూర్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. అడవి ప్రాంతంలో నీలుగాయి సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీశాఖ అధికారులు నీలుగాయి మల్లంను మంత్రికి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జంతు గణన ప్రారంభమైందన్నారు. 3 రోజుల పాటు మాంసహార జంతు గణన మరో మూడు రోజులు శాఖహార జంతు గణన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 713 బీట్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి 200 మీటర్లకు ట్రాక్ ఏర్పాటు చేసి జంతువుల పంజా, మల విసర్జనను బట్టి జంతువులను గుర్తించడం జరుగుతుందన్నారు. జంతువుల గణన పూర్తి చేసి, వాటి పరిధిని బట్టి వాటికి కావాల్సిన భద్రతను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టైగర్‌జోన్ పరిధిలో ఉన్న గూడాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళడానికి అంగీకరిస్తేనే వారికి పూర్తి పునరావాస చర్యలు చేపట్టిన తర్వాతనే వారిని తరలిస్తామన్నారు. టీఎఫ్‌వో సరువరణ్, డిఎఫ్‌వో డా ప్రభాకర్, ఎఫ్‌బివో విజయ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌వోలు రమేష్‌రావు, గులాం మహినోద్దిన్, ఆర్‌డివో జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు యునిస్ అక్బాని, రవి సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ ఎట్ హోంకు వెళ్ళను : నారాయణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ నిర్వహించే 'ఎట్ హోం'కు తాను ఈ సారి హాజరుకావడం లేదని సిపిఐ జాతీయ కార్య దర్శి డాక్టర్ కె.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా తనకు 'ఎట్ హోం' ఆహ్వానం లభిం చిందని తెలిపారు. గవర్నర్‌ను వ్యక్తిగతంగా ఇష్టపడుతున్నప్పటికీ, ఇటీవల ఆయన వ్యాఖ్యలు, తీరు పట్ల అసంతృప్తికి గురి చేసినందునే తాను ఆ కార్యక్రమానికి వెళ్ళడం లేదని చెప్పారు.



"విజయం ఒక ప్రయాణం మాత్రమే. గమ్యం కాదు.జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా సఫలం కావడానికి అవకాశం ఉంటుంది.
– అరిస్టాటిల్"

డార్విన్‌ను చెరిపేద్దాం!



సంపాదకీయం

''మానవ పరిణామ క్రమం గూర్చిన ఛార్లెస్ డార్విన్ సిద్ధాంతం బూటకం. దాన్ని స్కూలు పాఠ్య పుస్తకాలనుంచి తొలగించాలి'' అంటున్నారు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ జూనియర్ మంత్రి సత్య పాల్ సింగ్. ఏమిటి ఆయన వాదనకు మూలం? ''వానరం మనిషిగా మారటాన్ని తాము చూచినట్లు మన పూర్వీకులు సహా ఎవ్వరూ లిఖితంగా లేక మౌఖికంగా చెప్పలేదు. మనం చదివిన గ్రంథాల్లో గాని, మన తాతముత్తాతలు మనకు చెప్పిన కథల్లో గానీ అటువంటి ప్రస్తావన లేదు. భూమిపై మనిషి కనిపించిన నాటినుంచీ మనిషిగానే ఉన్నాడు. అందువల్ల డార్విన్ సిద్ధాంతం శాస్త్రీయంగా తప్పు''. ఏదో మాట జారాడు, సర్దుకుంటాడు అనుకుంటే ఒక టెలివిజన్ ఛానల్‌లో ఆయన తన వాదాన్ని రెట్టించాడు. ''డార్విన్ సిద్ధాంతం ప్రపంచ వ్యాప్తంగా సవాలు చేయబడుతోంది. డార్వినిజం బూటకం. నేను ప్రకటన చేస్తున్నానంటే ఆధారం లేకుండా చేయటం లేదు. నేను సైన్స్ చదువుకున్నాను.. ఢిల్లీ యూనివర్శిటీనుంచి కెమిస్ట్రీలో పిహెచ్‌డి చేశాను.''

ఏదోక వివాదం సృష్టించకపోతే కొందరు మంత్రులకు బహుశా నిద్రపట్టదేమో! మరో కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే గతనెలలో లౌకికవాదులపై సిగ్గుమాలిన వ్యాఖ్యచేసి లోక్‌సభలో క్షమాపణ చెప్పారు. 'మతమే మనిషికి గుర్తింపు. తమ తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన రక్తం తెలియనివారు తమనితాము 'సెక్యులర్' అని పిలుచుకుంటున్నారు. వారికి సొంత గుర్తింపు లేదు...రాజ్యాంగాన్ని మారుస్తాం, మార్చటానికే మేము అధికారంలోకి వచ్చాం' అని నోరుపారేసుకున్నాడు. ఇప్పుడీ జూనియర్ విద్యామంత్రేమో శాస్త్రీయంగా నిరూపితమైన, ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞుల లోకం గుర్తించిన డార్విన్ 'మానవ పరిణామ సిద్ధాంతాన్ని' తిరస్కరిస్తున్నాడు. మన పుక్కిటి పురాణ గాథలు ఆ విషయం చెప్పలేదంటున్నాడు. ఆయన సైన్స్ చదువుకున్నా శాస్త్రీయంగా మరుగుజ్జుగానే ఉండిపోయారని భావించేవారిని తప్పుపట్టలేము. వినాయకుడికి ఏనుగు తల అమర్చిన పౌరాణిక గాథను బట్టి భారతదేశంలో పురాణ కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ ఉందనే అంధవిశ్వాస నేతలున్న దేశంలో ఇటువంటి విద్యాశాఖ మంత్రి ఉండటంలో ఆశ్చర్యం లేదు.

మంత్రి సత్యపాల్ సింగ్ వ్యాఖ్యలను మన దేశంలోని మూడు అత్యున్నత శాస్త్రవిజ్ఞాన సంస్థలు ఖండించాయి. జనవరి 19 నాటి ప్రకటనను వెనక్కుతీసుకోవాలని కోరుతూ ఆయనకు పంపనున్న లేఖపై వెయ్యిమందికిపైగా సంతకాలు చేశారు. అలాగే 1800 మంది శాస్త్రవేత్తలు, శాస్త్ర ప్రచారకులు, శాస్త్రీయ దృక్పథంగల వ్యక్తుల సంతకాలతో కూడిన లేఖ ఒకటి సోషల్ మీడియాలో మంత్రిని ప్రశ్నిస్తున్నది. 'మీ వాదన మాకు బాధ కలిగించింది. మానవ పరిణామ సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తల సమాజం తిరస్కరించిందనటం అవాస్తవం. తద్భిన్నంగా, ప్రతి ఒక్క నూతన అన్వేషణ డార్విన్ సిద్ధాంతాన్ని బలపరుస్తున్నది' అని వారు పేర్కొన్నారు. ఇండియన్ సైన్స్ అకాడెమీ, నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటన ఇలా తెలిపింది : 'మంత్రి ప్రకటనలకు శాస్త్రీయ ప్రాతిపదికలేదు. మానవ పరిణామ సిద్ధాంతానికి డార్విన్ చేసిన గొప్ప దోహదం సువ్యవస్థితం. మానవ పరిణామం గూర్చిన ప్రాథమిక వాస్తవాలపై శాస్త్రీయంగా వివాదమేదీలేదు. ఆ శాస్త్రీయ సిద్ధాంతం చేసిన అనేక ఊహలు ప్రయోగాల ద్వారా పలుమార్లు రూఢి అయినాయి. ఈ భూగోళంపై జీవ రూపాలన్నీ – మనుషులు, ఇతర వానరాలు ఒకటి లేక ఉమ్మడి పూర్వీక సంతానోత్పత్తి నుంచి ఉద్భవించాయన్నది పరిణామ సిద్ధాంతంలో అత్యంత ప్రధానమైంది. ఈ సిద్ధాంతాన్ని స్కూలు లేక కాలేజీ పాఠ్యాంశాల నుంచి తొలగించాలనటం లేదా అశాస్త్రీయ ప్రతిపాదనలు, బూటకాలతో దాన్ని నీరుగార్చటం తిరోగమన చర్య. డార్విన్ కనుగొన్న స్వయం ఎంపిక ద్వారా పరిణామ సిద్ధాంతం, ఉత్తరోత్తరా దాని అభివృద్ధి, విస్తరణ ఆధునిక జీవశాస్త్రంపై, వైద్యశాస్త్రంపై, ఆధునిక శాస్త్రాలన్నిటిపై ప్రధాన ప్రభావం చూపుతున్నది. దీనికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత మద్దతు ఉంది''.ఈ శాస్త్రవేత్తల ప్రకటన స్వయం సుబోధకం. మంత్రిగారు తన వైఖరిని, సరిదిద్దుకుంటారా?

దళిత రాజకీయ వెలుగునీడలు

చూపు

భీమా కొరేగాంవ్‌లో ఇటీవల పరిణామాలు దళితుల పోరాటానికి కొత్తగా పథనిర్దేశం చేస్తాయా? దేశ రాజకీయ రంగంలో సమానత్వంకోసం అంబేద్కర్ మొదలు పెట్టిన రాజకీయాల పునరుద్ధానాన్ని అదీ సూచిస్తోందా?1970దశకం దాకా భారత రిపబ్లికన్ పార్టీ(ఆర్‌పిఐ) ద్వారా దళిత రాజకీయవాదులు తమ ఆశయాలు ఈడేర్చుకోడానికి ప్రయత్నించారు. అంబేద్కర్ నెలకొల్పిన షెడ్యూల్డు కులాల సమాఖ్య (ఎస్‌సిఎఫ్) నుంచి ఆర్‌పిఐ ఉద్భవించింది. ఎస్‌సి నాయకులు ప్రధాన రాజకీయ స్రవంతిలోని కాంగ్రెస్‌ను అందులోకి కో ఆప్ట్ చేసుకున్నారు. అంతర్గత కుమ్ములాటలవల్ల ఆర్‌పిఐ పెద్దగా దళిత సేవ చేయలేకపోయింది. దానికంటే ప్రధాన స్రవంతి పార్టీలే దళితులకు కొద్దిగా ఎక్కువసేవ చేయగలిగాయి. ఆర్‌పిఐ, కాంగ్రెస్ స్వప్రయోజనాలు ఆశించి పనిచేస్తుండగా సైద్ధాంతిక ఆవేశంగల యువదళితులు అమెరికాలోని 'బ్లాక్ పాంథర్స్' ఉద్యమం నుంచి స్ఫూర్తిని పొందారు. కాన్షీరామ్ వంటి మితవాద దళితనాయకులు తీవ్రవాదానికి, నిస్తేజమైన ఉదాసీన సహకార వాదానికి మధ్య మార్గాన్ని ఎంచుకొన్నారు.

ఇటీవల వెలువడిన రెండు పుస్తకాలు 1970ల నాటి దళిత్ పాంథర్ ఉద్యమాన్ని, అంబేద్కర్ తరువాత రాజకీయాలలో గుర్తించదగ్గ దళిత నేతగా ఎదిగిన మాయావతి సారథ్యాన్ని కూలంకషంగా వివరించాయి. జెవి. పవార్ 'దళిత్ పాంథర్స్: యాన్ అథారిటేటివ్ హిస్టరీ' అనే పుస్తకంలో ఆ ఉద్యమాన్ని విపులంగా వివరించారు. ఆ ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు కూడా. దాని ఆరంభకులలో తానొకడినని ఆయన గర్వంగా చెప్పుకున్నారు. ఆ ఉద్యమం సహవ్యవస్థాపకుడు, కార్యనిర్వాహకుడు, ప్రధాన కార్యదర్శిగా 'దళిత్ పాంథర్స్' పత్రాలను పరిశీలించి పవార్ ఆ పుస్తకం రాశారు. ఆయన కవి ఢశాల్ కలిసి ఆ ఉద్యమ సంస్థను నెలకొల్పినట్లు చెప్పుకున్నారు. అందులో విద్యావంతులైన మెహర్‌లు చాలామంది పాలుపంచుకున్నారు. దేశ 25వ స్వాతంత్ర్య పోరాటాన్ని 'నిరసన దినం'గా పాటించడం వారి మొట్టమొదటి చర్య. అందులో భాగంగా వారు నకిలీ పార్లమెంటు సమావేశాలను నిర్వహించి, దళితులపై నేరాల గురించి చర్చించారు.

కుల నిర్మూలన జరగాలన్నది వారి పిలుపు. నిరసన ప్రదర్శనలు, యాత్రలు, కరపత్రాల పంపిణీ, ఆకర్షణీయమైన నినాదాలకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ ద్వారా దళిత యువకులను వారు ఆకర్షించగలిగారు. సంపన్న కాంగ్రెస్ దాష్టీకాన్ని ఆ యువత ద్వార ఎదుర్కొని పాంథర్స్ ఖండించారు. అప్పటి కేంద్రమంత్రి జగజ్జీవన్ రాం పర్యటనను నిరసించినప్పుడు పాంథర్స్ పెద్దగా అరెస్టయ్యారు. ఆయనను ఫిరాయింపుదారుగా వారు గేలి చేసేవారు. కొత్తకొత్త దళిత యువదళాలు ఉద్యమ స్ఫూర్తిని అందుకున్నాయి కూడా. బౌద్ధేతర యువ పాంథర్స్ తమ హిందూ గుర్తింపును వదులుకోవడానికి ఇష్టపడకుండా కుల, ఉపకుల ధోరణులను పాంథర్స్ పుణికి పుచ్చుకున్నట్లు పవార్ వ్యాఖ్యానించారు.

కేవలం బెదదిరింపుల ద్వారా దళితులకు జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దగలమని తరువాతి కాలంలో పాంథర్స్ భావించారు. తమ ముందు కరడుగట్టిన గూండాలు కూడా వణికిపోతారని ఆ యువకులు ధీమా పెంచుకున్నారని రచయిత పవార్ విశ్లేషించారు. 1974 నాటికి దళిత్ పాంథర్స్ సమాజంలోని అన్ని స్థాయిలకు విస్తరించి ఒక శక్తిగా రూపొందారు. అయితే పాంథర్స్ నాయకత్వంలో చీలికలు తలెత్తి దిగజారుడు మొదలైంది. వారు తమ పోరాటంలో కమ్యూనిస్టులను అనుసరించాలా లేక కేవలం కులతత్వాలతో పోరాడితే సరిపోతుందా అన్న విషయమై కలహించుకున్నారు. అవకాశవాద కాంగ్రెస్‌తో కొందరు, వామపక్షాలతో మరికొందరు అంటకాగడంవల్ల ఆ ఉద్యమం నీరుగారిపోయింది. పవార్, మరో సారథి రాజాథాలే మధ్యకూడా విభేదాలు వచ్చాయి.

సరిగ్గా వ్యవస్థీకృతం కాకపోవడంవల్ల పాంథర్స్ కనీసం మూడు వర్గాలుగా 1977లో చీలిపోయారు. ఆ ఏడాది సార్వత్రిక ఎన్నికలలో ఆ మూడు వర్గాలు వేరువేరు అభ్యర్థులను బలపరిచాయి. 1977లో పవార్, థాలే పాంథర్స్‌ను లాంఛనంగా రద్దుచేశారు. పాంథర్స్ పేరు చెబుతూ చాలామంది అక్రమ కార్యకలాపాలు సాగించడం దానితో బంద్ అయిందని పవార్ ఆ చర్యను సమర్థించుకొన్నారు.

దళిత్ పాంథర్స్ ఆందోళన వైఫల్యాలలోంచి కొత్త దళిత నేతగా కాన్షీరాం పుట్టుకొచ్చారు. ఆయన సిక్కు దళిత ప్రభుత్వ ఉద్యోగి. 1970లలో రాం అంబేద్కర్ రచనలను అధ్యయనం చేశారు. ఒక మెహర్ బౌద్ధ సహచరుడు ఆయనను అంబేద్కర్ రచనలకు పరిచయం చేశాడు. తరువాత నాలుగు దశాబ్దాలపాటు దళిత దార్శనిక నేతగా రాం వెలుగొందారు.'బెహన్ జీ : మాయావతి రాజకీయ జీవిత చరిత్ర' అనే 2008 నాటి గ్రంథంలో కాన్షీరాం దార్శనికతను ప్రముఖ జర్నలిస్టు అజయ్ బోస్ విపులంగా కళ్లకు కట్టించారు.




రాజకీయాధికారమే దళితుల సమస్యల పరిష్కారానికి కీలకమన్న అంబేద్కర్ మార్క్సిస్టు దృక్పథాన్ని నిజం చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారని బోస్ రాశారు. ఒక దళిత బాలిక మాయావతి అనేక సవాళ్లను ఎదుర్కొంటూ కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎదగడం వెనుక కాన్షీరాం అండను ఆ పుస్తకంలో బోస్ వివరించారు. ఒక దశలో మాయావతి దేశ భవిష్య ప్రధానిగాకూడా చూడబడ్డారని బోస్ ప్రశంసించారు. తరువాత కొద్దిపాటి పేరు మార్పుతో 'బెహన్ జీ : ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ మాయావతి' పేరిట తన తొలి గ్రంథానికి ఆధునిక పాఠాన్ని బోస్ విడుదల చేశారు. 2014 పార్లమెంటరీ ఎన్నికలలో, తరువాత అనేక రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో బిఎస్‌పిని మాయావతి కూడబెట్టిన సంపద ఓటమి పాలు చేసినట్లు ఆయన విమర్శించారు.

పార్లమెంటులో పూర్తిగా అదృశ్యమై, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో కూడా ప్రాతినిధ్యం క్షీణించిన మాయావతి పార్టీ దేశంలో కాని, తన రాష్ట్రంలో కానీ తిరిగి పుంజుకోవడం అసాధ్యమని బోస్ రాశారు.

జాతవ్‌లుకాని దళితులను కూడా ఆమె తనవైఖరితో దూరం చేసుకున్నారు. వారంతా తిరిగి హిందూ అడ్డాలో చేరిపోయారు. అయితే దళిత సాధికారత దేశ రాజకీయాలకు మాయావతి అందించిన శాశ్వత సేవ అని చెప్పకతప్పదు అని అన్నారు.

✻ గోవిందన్ నాయర్

చైనా శాస్త్రీయ సోషలిజం



తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

నేటి నవచైనా నిర్మాణం వెనుక కమ్యూనిస్టు ప్రణాళికతో కూడిన పాలనా సంస్కరణలు అనేకం ఉన్నాయి. 70ఏండ్ల క్రితం1949 అక్టోబర్ 1న ఏర్పడిన చైనా పీపుల్స్ రిపబ్లిక్ గడిచిన నాలుగైదు దశాబ్దాలుగా పలు సంస్కరణలు అమలు జరిపింది. అక్కడి ప్రజల, పాలకుల అవిరళ కృషి ఫలితమే నేటి చైనా అభివృద్ధికి కారణంగా స్పష్టమౌతుంది. చైనా సుదూర లక్ష్యాలను, ప్రజల కలలను సాకారం చేయడంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ ప్రక్రియ కూడా అత్యంత ముఖ్య భూమిక పోషిస్తూ రావడం కూడా మరో కారణం. ముఖ్యంగా చైనాలో కమ్యూనిస్టు పాలన అందించాలన్న కృతనిశ్చయానికి కట్టుబడి, అత్యున్నత ప్రమాణాలను పరిరక్షించుకుంటూ, అవినీతి, అధికార దుర్వినియోగం, విలాసాలకు వ్యతిరేకంగా నిరంతర క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంవల్లే ఈ పరివర్తన సాధ్యమైందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా వెల్లడించారు. అలాగే, ప్రజలే న్యాయ నిర్ణేతలుగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల తరహాలో పార్టీ కార్యకర్తల పని విధానం ఉండాలని కూడా జిన్‌పింగ్ చెప్పారు.

చైనాలో శాస్త్రీయ సోషలిజం విజయం ప్రపంచంలో మార్క్సిజానికి తిరుగులేదని రుజువు చేస్తోంది. 'చైనా లక్షణాలతో సోషలిజం' అనే అలోచన లేదా సిద్ధాంతం అనేది ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడింది కాదు. తెగువతో కూడిన స్వీయ సంస్కరణలు అమలు జరపడం వల్లనే ప్రగతి సాధ్యమైందని చైనా కమ్యూనిస్టు పార్టీ అనుభవం చెబుతున్నది. అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నతస్థాయికి చైనా పరివర్తన చెందిన క్రమాన్ని ఆయా దశలలో నిక్షిప్తమైన అనుభవాలను మనం కూడా ఆకళింపు చేసుకున్నప్పుడే మనదేశంలోనూ ఈ మార్పు సాధ్యం.

చైనాలో వారంరోజుల పర్యటన :

చైనా కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానం మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ 13మంది ప్రతినిధుల బృందం డిసెంబరు మాసంలో వారం రోజుల పాటు ఆ దేశంలో పర్యటించింది. సిపిఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు అరవింద్ శ్రీవాత్సవ నాయకత్వంలో తెలంగాణ నుంచి నాతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు, అక్కినేని వనజ వున్నాం.

వారం రోజుల పాటు చైనా దేశంలోని గుయ్‌జూ ప్రావెన్స్ రాజధాని గుయాంగ్ నగరం, హంగౌస్, పింగ్‌బా జిల్లాలోని అన్షు నగరం, జియోవాన్ గ్రామం, జునైనగరం, బైజియాబా గ్రామం, బోజ్ జిల్లాలోని ఉజ్జి యాగ్‌టౌన్‌షిప్‌తో పాటు జిబైపోనగరం, ఆ దేశ రాజధాని బీజింగ్ నగరాల్లో పర్యటించి అక్కడి ప్రజలను, రైతులను, కార్మికులను, పార్టీ శ్రేణులను కలువడం జరిగింది. అదే సమయంలో అత్యంత ప్రధానమైన ప్రపంచ రాజకీయ పార్టీల ఉన్నతస్థాయి సదస్సు బీజింగ్‌నగరంలో మూడు రోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 120 దేశాల నుంచి 200పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ, 600మంది ప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు.

ఈ సదస్సును చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రారంభించి, మాట్లాడుతూ.. ప్రపంచంలో శాంతి, స్థిరత్వం కాపాడేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ రక్షణ కవచంగా నిలుస్తున్నదని, చైనా ప్రజల సుఖసంతోషాల కోసమే కాకుండా ప్రపంచంలోని అందరి సుఖసంతోషాల కోసం చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రయత్నిస్తోందని చెప్పారు.

సహకారమే స్ఫూర్తిగా వ్యవసాయం :

చైనా అభివృద్ధిలో భాగమైన వ్యవసాయం సహకార పద్ధతిలో కొనసాగడం గమనార్హం. సహకార సంఘాలుగా రైతులు ఏర్పడి ప్రభుత్వం నుంచి భూమిని ఉచితంగా లీజ్‌కు తీసుకుని పంటలు పండిస్తూ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకుంటారు. ప్రయివేటు భూమి అనేది లేకుండా ప్రభుత్వం చేతిలోనే భూమి నిక్షిప్తమై ఉన్నది. రైతులకు, వ్యవసాయ కూలీలకు పూర్తిగా వందశాతం ప్రభుత్వమే ఆరోగ్యబీమా అమలు జరుపుతున్నది. అక్కడ ప్రతిగ్రామంలో ఆరోగ్య కేంద్రా లున్నా యి. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తారు. దేశంలో 5 నుంచి 15ఏండ్లలోపు పిల్లలకు ఉచితంగా నిర్బంధ విద్య అమలులో ఉన్నది.

ప్రతి ఏటా జిడిపిలో 5శాతం నిధులు విద్యపై ఖర్చు చేస్తున్నారు. నిరుద్యోగం ఉన్నప్పటికీ దానిని అధిగమించి అందరికీ ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధ కృషి కొనసాగిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90శాతం యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించారు. అభివృద్ధిలో మౌలిక సదుపాయా ల కల్పనలో నూటికి నూరుశాతం చైనా విజయం సాధించింది. ప్రపంచీకరణ అమలులో ఉన్నప్పటికీ ఆ దేశ ప్రయోజనాలకు అనుకూలంగా బహుళజాతి సంస్థలను అనేక షరతులతో అనుమతిస్తున్నారు.

సమసమాజం దిశగా చైనా అడుగులు

సమసమాజ నిర్మాణానికి తమదైన పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నామని సిపిసి అంతర్జాతీయ విభాగం ఆఫ్ ఏషియన్ బ్యూరో డైరెక్టర్ చెప్పారు. చైనా పర్యటనలో చివరి రోజు భారత దేశ సిపిఐ ప్రతినిధులతో సమావేశం సందర్భంగా చైనా సంస్కరణల గురించి పలు విషయాలు వివరించారు. 1949లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 23 రాష్ట్రాలతో ఆవిర్భవించిన పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 2012 జనాభా లెక్కల ప్రకారం..135కోట్ల 40లక్షల జనాభా కలిగి ఉందని, దేశంలో మత విశ్వాసాలపై స్వేచ్ఛ, సామాజిక సమానత్వం, స్త్రీ పురుష సమానత్వంతో ముందుకు సాగుతున్నదని ఆయన తెలిపారు. 2049 నాటికి చైనా విప్లవం సాధించి వందేండ్లు పూర్తి చేసుకుంటుందని అప్పటి వరకు చైనాలో సమసమాజ నిర్మాణం ఒక దశకు చేరుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాము విప్లవాన్ని ఏ దేశంనుంచి దిగుమతి చేసుకోలేదని... ఎగుమతి కూడా చేయబోమని చెప్పడం గమనార్హం.



చైనా పర్యటనలో పాల్గొన్న సిపిఐ ప్రతినిధి బృందంలో సభ్యులు

'చైనా లక్షణాలతో సోషలిజం' అనే అలోచన లేదా సిద్ధాంతం అనేది ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడింది కాదు. తెగువతో కూడిన స్వీయ సంస్కరణలు అమలు జరపడం వల్లనే ప్రగతి సాధ్యమైందని చైనా కమ్యూనిస్టు పార్టీ అనుభవం చెబుతున్నది. అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నతస్థాయికి చైనా పరివర్తన చెందిన క్రమాన్ని ఆయా దశలలో నిక్షిప్తమైన అనుభవాలను మనం కూడా ఆకళింపు చేసుకున్నప్పుడే మనదేశంలోనూ ఈ మార్పు సాధ్యం.

యాచక రహితం ఎలా ?



వినుతా రెడ్డి

హైదరాబాదును బిచ్చగాళ్ళ రహిత నగరంగా చేయడం చాలా మంచి పనే. కానీ అందుకు అవలంబిస్తున్న విధానాలే చర్చనీయాంశాలు. ఇవాంక ట్రంప్ ఇటీవల హైదరాబాద్ వచ్చినప్పుడు బిచ్చగాళ్లు ఆమె కంట్లో పడకుండా చూడడానికి హడావుడిగా పోలీసులు బిచ్చగాళ్లను అరెస్ట్ చేయడం, కేసులు పెట్టడం, సంరక్షణ కేంద్రాలకు పంపడం ఇక అక్కడితో మాపని అయిపోయింది అనుకున్నారు.

బిచ్చగాళ్లను పట్టుకుంటే ఒక్కొక్కరికి 1000 రూపాయలు ఇస్తామని పోలీసు శాఖ ప్రకటించింది. 235 మంది మగ 125 మంది ఆడ బిచ్చగాళ్ళను అరెస్టు చేశారు. వాళ్ల చేతి ముద్రలను సేకరించి, ఆధార్ కార్డు నెంబర్ నోట్ చేసుకుని, కౌన్సెలింగ్ ఇచ్చి మళ్ళా దొరికితే జైలుకు పంపిస్తామని హెచ్చరించి పంపారు. ఇవాంక వచ్చి వెళ్ళారు. హడావుడి ఆగిపోయింది. నిజంగా హైదరాబాదును బిచ్చగాళ్ళ రహిత నగరంగా మార్చదలచుకున్నారా? లేక ఇవాంకా వంటి సెలబ్రిటీలు వచ్చినప్పుడు మాత్రం అరెస్టులు చేసి వాళ్లకు బిచ్చగాళ్ళు లేని నగరంగా చూపెట్టి ఆ తర్వాత సమస్యను వదలి వేయదలచుకున్నారా? పోలీసుశాఖ హడావుడి చూస్తే కేవలం ఆ రెండు నెలలు హడావుడి చేసి ఆ తర్వాత మరచిపోయినట్టుగా కనపడుతున్నది.

ఇలాంటి అప్పుడప్పుడు హడావుడి మొక్కుబడి కార్యక్రమాల వలన ఫలితాలు ఉండవు. సమస్య తీవ్రతను అర్థం చేసుకొని దాని మూలాలు వెతికితే పరిష్కార మార్గం లభిస్తుంది.

హైదరాబాద్ నగరంలో ఈ సమస్య తీవ్రత ఎలా ఉంది? నగరంలో దాదాపు పదిహేనువేలమంది వరకు బిచ్చగాళ్లు ఉన్నట్టు ఒక సర్వే అంచనా. అందులో 98శాతం మంది నకిలీలు అని తేల్చేసి సమస్య తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. పోలీస్ శాఖ నడిపిన హడావుడి కార్యక్రమంలో 360మందిని మాత్రం అరెస్ట్ చేశారు. అందులో 50మందిని పునరావాస కేంద్రాలకు పంపారు.

వీరిలో ఒక ఆమె గ్రీన్‌కార్డ్ హోల్డర్ అని కొంతమంది దగ్గర లక్షల రూపాయలు ఉన్నాయని చెప్పి, వాళ్లంతా నకిలీలు అని దాటవేస్తే సమస్య పరిష్కారం అవుతుందా? నిజమే కొంత మంది రోజుకు 1000 నుండి 2000 వరకు సంపాదిస్తుండవచ్చు. అంతమాత్రాన పదిహేను వేలమందీ అదేవిధంగా అంత మొత్తం సంపాదిస్తున్నారని అనుకోవడం మాత్రం సరైనది కాదు. చిన్నపిల్లలను ఎత్తుకొచ్చి బిచ్చగాళ్లుగా మారుస్తున్న మాఫియాల సంగతేమిటి?

కొంతమంది ఆడవాళ్లు ఎప్పుడూ పిల్లలను ఎత్తుకుని అడుక్కుంటారు. వాళ్లకి ఎప్పుడూ పిల్లలు ఎలా ఉంటారు? చిన్నపిల్లలను తీసుకొచ్చి వీళ్ళకు అద్దెకిచ్చే మధ్య దళారులు ఉంటారు. ఆ మధ్య దళారులకు పిల్లలను అద్దెకు ఇచ్చే తల్లులు ఎవరు? వాళ్లు ఎంత పేదరికంలో ఉంటే తమ పిల్లలను ఇలా అడుక్కోడానికి అద్దెకిస్తారు? ఎంతోమంది చిన్న పిల్లలు బాల కార్మికులుగా ఈ అడుక్కునే వృత్తిలోనే ఉన్నారు గదా! మరి ఆ పిల్లలు ఇందులోకి ఎలా వస్తున్నారు?

ఈ సమస్యను పోలీసు శాఖకు ముఖ్యంగా జైళ్ళశాఖకు అప్పగించడంలోనే ఈ సమస్యను మన పాలకులు ఎలా చేస్తున్నారు అనేది అర్థమవుతుంది. దీనిని పాలకులు ఒక నేరంగా చూస్తున్నారు తప్ప, దీని వెనకాల ఉన్న సామాజిక, ఆర్థిక కారణాలు మాత్రం పరిశీలించడానికి ఇష్టపడటంలేదు. ఎంతసేపూ దీనివలన న్యూసెన్స్ జరుగుతున్నది, ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి, వీళ్ళు అడుక్కోవడం వల్ల రోడ్లపైన యాక్సిడెంట్లు జరుగుతున్నాయి అనే కోణంలోనే చూస్తున్నారు. యాచకులంతా నేరగాళ్ళని భావిస్తున్నారు. అందువల్లనే దీనిని శాంతిభద్రతల సమస్యగా భావించి పోలీసు శాఖకు అప్పగించారు. కానీ వాస్తవంగా ఇది సంక్షేమ శాఖలు చూసుకోవాల్సిన పని. యాచకులు నేరగాళ్ళు కాదు. ఇందులోని మాఫియాను నడిపేవాళ్ళు మాత్రమే నేరగాళ్ళు. మాఫియాను రూపుమాపకుండా యాచకులపై కేసులు పెట్టడడం వాళ్ళను నేరస్తులుగా మార్చడమే.

ఈ వృత్తిలో ఉన్న వాళ్లను పరిశీలిస్తే ఎక్కువమంది గ్రామాల నుండి వలసలు వచ్చిన వాళ్లు ఉన్నారు. చాలామంది పెద్ద వాళ్ళు, ముసలివాళ్ళు కనపడతారు. గోచీతో ఉన్న వాళ్ళను చూడగానే పల్లెల నుండి వచ్చినట్లు తెలుస్తోంది.

వ్యవసాయం సంక్షోభంలో పడి ఊర్లలో వ్యవసాయం పనులు లేక పట్టణాలకు వలస వచ్చిన వాళ్ళ పిల్లల దగ్గర ఉంటున్నారు. వాళ్లకేమో పనుల్లేక, కూలీ రాక వీళ్ళను సరిగా చూసుకోలేకపోతున్నారు. వాళ్ల దారుణ పరిస్థితులు చూసి వీళ్ళ అవసరాలకి పిల్లలను అడగలేక ముసలివాళ్ళు రోడ్ల మీదకు వచ్చి అడుక్కోవాల్సి వస్తుంది. ఇలాంటివారికి వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం కల్పించాలి. వాళ్ల పిల్లలకు పనులు దొరికేలా చూడాలి.

పల్లెల నుండి వలస వచ్చిన వాళ్లకు పనులు దొరకక, తమకు తిండి లేక, తమ పిల్లలకు సరైన తిండి పెట్టలేక తప్పని సరి పరిస్థితుల్లో పేద తల్లులు తమ పిల్లలను అడుక్కోవడానికి అద్దెకిస్తున్నారు. పిల్లలను అడుక్కోవడానికి అద్దెకివ్వడం అనే పేదరికం చాలా విచారకరమైనది.

ఒకవైపు మాఫియా ముఠాలు పిల్లల్ని ఎత్తుకొచ్చి వాళ్ళను చిన్నతనంలోనే అడుక్కునే బాలకార్మికులుగా తయారుచేస్తున్నారు. ఒక్కసారి వాళ్ళను బలవంతంగా అంగవికలురుగా మార్చి అడుక్కోడానికి పంపుతున్నారు. మరొకవైపు అనేక కారణాల రీత్యా ఇంటిలోనుండి తల్లిదండ్రులకు చెప్పకుండా బయటకు వచ్చిన పిల్లలు కూడా యాచక వృత్తిలోకి వస్తున్నారు. ఆ కారణాలను పరిశీలించకుండా వాటి పరిష్కారాలను వెతకకుండా కేవలం లాఠీతో, కేసులతో సమస్యను పరిష్కరించాలనుకోవడం వేరుకు చీర పడితే ఆకులను దులిపితే సమస్య పరిష్కారమవుతుందని అనుకున్నట్లు ఉంటుంది.

ఇప్పటికైనా ప్రభుత్వం యాచక వృత్తి కారణం అయిన సామాజిక ఆర్థిక అంశాలను పరిశీలించి పరిష్కార మార్గాలను వెతకాలి. యాచక వృత్తిలోని వారికోసం వృద్ధాశ్రమాలను నిర్మించాలి. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వారికి వృత్తి నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించాలి.

సైకాలజిస్టులను నియమించి నిరంతరం వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. ముఖ్యంగా సంక్షేమ, ఆరోగ్య, కార్మిక మొదలైన శాఖలన్నీ కలసి సమన్వయంతో ఈ సమస్యకు పరిష్కార మార్గాలు వెతకాలి. ప్రతి ఒక్కరికి గౌరవప్రదమైన జీవనం లభించేలా చూడాలి. ప్రభుత్వం ఇందుకోసం ఇప్పటికైనా తగిన ఏర్పాట్లు చేస్తుందని ఆశిద్దాం. అప్పుడే యాచక సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికి ఈ విశ్వనగరం బిచ్చగాళ్ళ రహిత నగరమవుతుంది.

మన తెలంగాణ
5
హైదరాబాద్
మంగళవారం
23 జనవరి, 2018
www.manatelangana.news



యువత

ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాల్సిన యువత అలివిగాని చదువులతో, సమయం తెలియని ఉద్యోగాలతో సతమతమవుతోంది. చుట్టూ కనిపిస్తున్న తళుకుబెళుకుల మోజులో పడి తమ లక్ష్యసాధనను మరిచే ప్రబుద్ధులు కొంతమంది. చదువు, కెరీర్ వంటి విషయంలో యువత ఎంచుకుంటున్న మార్గం, అనుసరిస్తున్న తీరు వారిని మానసిక ఒత్తిడిలోకి నెడుతున్నాయి. ఎలాగోలా తమ బిడ్డను ఇంజినీరింగ్ లేదా మెడిసన్ చదివించేయాలన్న తాపత్రయం తప్ప, పిల్లల ఇష్టాఇష్టాలను తెల్సుకొనే తల్లిదండ్రులూ బహు తక్కువ. అందువల్లే పిల్లలకు చదువే గుదిబండ అయ్యింది. ఐఐటీలో సీటు రావాలి. బాగా చదివి అమెరికా వెళ్లాలి. బాగా సంపాదించాలి ...ఇలాంటి ధోరణులు వారి పాలిట శాపంగా మారింది. కెరీర్ విషయంలోనూ యువత మానసికి ఒత్తిడికి గురవుతున్నారు. చదివిన చదువుకు సరైన ఉద్యోగం రాలేదని, వచ్చిన ఉద్యోగంలో సరైన నైపుణ్యం చూపించలేకపోవడంలంటివి మరింత స్ట్రెస్‌కు గురిచేస్తున్నాయి.

ఒత్తిడితో చిత్తుకాకుండా..

యువతలో ఆశించినంత స్థాయిలో స్కిల్స్ లేకపోవడానికి కారణం విద్యావ్యవస్థే అని విద్యానిపుణుల అభిప్రాయం. కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎంసెట్, ఐఐటి కోచింగులలో కొన్ని మెమరీ టిప్స్ నేర్పించి అవే లోకంగా ఊదరగొట్టేస్తుంటారు. ర్యాంకుల కోసం ఒత్తిడి చేస్తుంటారు. అదేస్థాయిలో బిటెక్, ఎంటెక్‌ల్లాంటి చదువులు అయిందనిపించి, కొలువుల వేటలో పడుతోంది యువత. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు వస్తున్నా, అనునిత్యం మారిపోతున్న టెక్నాలజీని అందుకోవడం అసాధ్యమౌతోంది వీరికి. సంస్థల్లో చివరికి సరైన స్కిల్స్ లేవనేసాకుతో ఉద్యోగాల నుంచి తీసేయడం చూస్తున్నాం. తాము ఏ చదువు చదివినా కంప్యూటర్ పరిజ్ఞానంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలి. ఉన్నదాన్ని మెరుగుపరుచుకుంటూ తామెన్నుకున్న రంగంలో ముందుకెళ్లాలి. ఐటి కంపెనీల్లో ఉద్యోగాలే లోకం కాదన్న విషయాన్ని గుర్తించాలి. అప్పుడే యువతలో సగం డిప్రెషన్ మాయమౌతుంది. ఇతరులను అనుకరించం ఎప్పటికీ ప్రమాదమే.

ఒత్తిడిని నియంత్రించడం సాధ్యమే అంటున్నారు వైద్యులు. ఆశ, నిరాశల స్థితి వేరు, డిప్రెషన్ వేరు. ఓ నిరాశ ఎదురైనప్పుడు అక్కడితో లైఫ్ ముగిసిపోతుందనిపిస్తే డిప్రెషన్‌కు లోనయినట్లే లెక్క. ఏఏ సమయాల్లో తమ ఆలోచనలు ఏవైపు మళ్లుతున్నాయో గమనిస్తుండాలి. ప్రతి రోజూ తమకొచ్చే ఆలోచనలను కొద్దిసేపు విశ్లేషించుకోవాలి. నిపుణులను సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలి. అంతేగానీ లోలోపలే కుమిలిపోకూడదంటున్నారు నిపుణులు. మానసిక ఒత్తిడిని జయించాలంటే మిమ్మల్ని మీరు పోత్సహించుకోవడం అవసరం.



కొన్ని చిట్కాలను పాటిస్తే ఒత్తిడికి ఆమడదూరంలో ఉన్నట్లే..

* ఉదయం నుంచి రాత్రి వరకు ఏఏ పనులు చేయాలో ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్లానింగ్‌తో అన్ని పనులు సక్రమంగా పూర్తవుతాయి.
* ఎక్కువ సేపు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించకుండా, దానికంటూ ఒక సమయం కేటాయించుకోవాలి.
* సామాజిక మాధ్యమాల విషయంలో క్రమశిక్షణ అలవర్చుకోవాలి.
* రోజూ తేలికపాటి వ్యాయామం చేయాలి. తగినంత నిద్రపోవాలి.
* ప్రతి రోజూ కొంతసేపు పుస్తకాన్ని చదవడం అలవాటు చేసుకోండి.
* రోజులో కొంతసేపైనా కుటుంబసభ్యులతో మాట్లాడాలి. అభిప్రాయాలను పంచుకోవాలి.
* చదువు, ఉద్యోగం, భవిష్యత్తులపై విపరీతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవద్దు.
* మారుతున్న టెక్నాలజీ గురించి తెలుసుకోండి. వాటిని నేర్చుకోండి.
* పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి. ఏది పడితే అది ముఖ్యంగా జంక్‌ఫుడ్ జోలికి వెళ్లకుండా ఉండాలి.
* ఏవిషయంలోనైనా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. అలాగని నాన్చుడు ధోరణికూడా పనికిరాదు.
* మీకు సంబంధించిన విషయాలను అత్యంత ఆప్తుల దగ్గర మాత్రమే చెప్పుకోండి.వారి సలహాలను తీసుకోండి. సరైనదనిపిస్తే పాటించండి.



గ్రామ సంరక్షకులుగా..



ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఇప్పటి యువత సమాజానికి సేవ చేయడంతోపాటు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. గ్రామానికి ఎంతో కొంత సేవ చేయాలనే ఆలోచనతో తమ వంతు కృషి చేస్తున్నారు. ఆ కోవకు చెందిన వారే రంగారెడ్డి జల్లా మంచాల మండలం కాఘజ్‌గట్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన మైలారం అయిలయ్య యాదవ్. వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని 1997లో నవ జ్యోతి యువజన సంఘాన్ని స్థాపించాడు. కులమతాలకు అతీతంగా గ్రామ యువకులను సంఘంలో చేర్చుకున్నాడు. యువజన సంఘం ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఆరోగ్యంతో పాటు బాలకార్మికులను విముక్తి కల్పించడం, తుపాన్ బాధితులకు విరాళాల సేకరణ, ఎయిడ్స్, పోలియో, కుటుంబనియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాడు. అంటరానితనం నిర్మూలన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.

గ్రామంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ సంఘంలోని యువత అనేక మొక్కలు నాటారు. మంచాల మండలం ముచ్చర్ల కుంట తండాలో తాగు నీరు కోసం అలమటిస్తున్న గిరిజనుల కోసం, కలెక్టర్‌ను కలిసి గ్రామానికి బోరును వేయించేలా చేశారు. గతంలో వీరి సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ సంఘాన్ని ఉత్తమ అవార్డుతో సత్కరించింది.

స్వచ్ఛ భారత్ దిశగా అడుగులు..

గ్రామంలో అంటు వ్యాధుల నిర్మూలనకు, పరిసరాల పరిశుభ్రతకు స్వచ్ఛభారత్‌లో భాగంగా వీధులలో ఉన్న మురుగు కాలువలలో చెత్తాచెదారం తొలగించటం, ప్రభుత్వ పాఠశాలల్లో ముళ్ళచెట్లను తొలగించటం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వ్యక్తిగత మరుగు దొడ్లు నిర్మించుకోవాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

గడ్డం దశరథ్
మనతెలంగాణ ప్రతినిధి, ఇబ్రహీంపట్నం



జిమ్‌కి వెళ్తున్నారా.!





నేడు యువతలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ బాగా పెరిగింది. వాకింగ్, జిమ్, సైక్లింగ్ వంటివి నిత్యజీవితంలో భాగం చేసుకుంటున్నారు. మరికొంతమంది జిమ్‌కు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. యూత్ మాత్రమే కాకుండా జిమ్‌లో అన్ని వయసుల వారూ వస్తుంటారు. ఈ నేపథ్యంలో జిమ్‌కు వెళ్లడం వల్ల లాభాలెన్ని ఉన్నాయో ...అంతే నష్టాలు కూడా ఉన్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. జిమ్‌లో ఉండే దాదాపు 27 రకాల పరికరాలపై పరిశోధకులు నిర్వహించిన పరిశోధనలో కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదేమంటే.. ఇంటి టాయ్‌లెట్‌లో ఉండే బ్యాక్టీరియా కన్నా జిమ్‌లో ఉండే బ్యాక్టీరియానే ఎక్కువని తేలింది. జిమ్‌కు చాలా మంది స్నానం చేయకుండా, షూలు, ట్రాక్ సూట్లతో వస్తారు. అంతేకాకుండా వాటిని రెండు రోజులు వాడతారు. ఎక్సర్‌సైజులు చేస్తున్నపుడు చెమటలు కారుతుంటాయి. ఇవన్నీ బ్యాక్టీరియాకి మూలం. అందుకే జిమ్‌ను ఎంచుకునేటప్పుడు శుభ్రత గురించి తెలుసుకోవాలని పరిశోధకులు అంటున్నారు. జిమ్ యాజమాన్యం ప్రతీరోజు వస్తువులను శుభ్రం చేస్తుందో లేదో పరిశీలించాలి. అప్పుడు బ్యాక్టీరియా చాలా వరకు తగ్గుతుంది. ఎప్పుడో వారానికి ఒకసారి కాకుండా రెండు రోజులకు ఒకసారి అయినా శుభ్రం చేస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవు. కేవలం జిమ్ మేనేజ్‌మెంట్ కాకుండా అక్కడికి వెళ్లేవాళ్లు కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జిమ్‌కు వేసుకెళ్లే బట్టలు విడిగా ఉతకడం,అక్కడి నుంచి వచ్చిన తర్వాత వెంటనే స్నానం చేయడం వంటివి వస్తే బ్యాక్టీరియా గురించి భయపడనక్కర్లేదు. చక్కని ఆరోగ్యం సొంతం అవుతుంది.

నయా గాడ్జెట్స్

భాషలను తర్జుమా చేస్తుంది..



విహార యాత్రలకనో ఉద్యోగరీత్యానో పరాయి దేశాలకు వెళ్లడం సాధారణమైపోయింది. మనకొచ్చిన భాషలతో ఒకే. అదే చైనీస్, కొరియన్, రష్యన్‌లాంటి కొరుకుడు పడని భాషలతోనే చిక్కంతా..మరి అలాంటి సమస్యను అధిగమించడం ఎలా? ట్రావిస్ పర్సనల్ ట్రాన్స్‌లేటర్ ఈ సమస్యను చిటికెలో తీర్చేస్తుంది. ప్రపంచంలో ఉన్న అన్ని భాషల్లో ఏ సమాచారం కావాలన్నా అప్పటికప్పడే మీ భాషలోకి తర్జుమా చేసి చెప్పేస్తుంది. ఈ పరికరాన్ని ఇంటర్‌నెట్‌లో కనెక్ట్ చేసుకుని వాడాలి. ఆఫ్‌లైన్‌లో కొన్ని భాషలను గురించి చెప్పేస్తుంది. సెల్‌ఫోన్ అంత సైజులో ఉన్న ఈ పర్సనల్ ట్రావిస్ ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి తెప్పించుకోవచ్చు.

ఎకోబటన్



ఆఫీసులో ఆరు నుంచి ఎనిమిది గంటలు మన కంప్యూటర్ ఆన్‌చేసే ఉంటుంది. ఇంట్లోనూ కొన్ని గంటలపాటు అది పనిచేస్తూనే ఉంటుంది. అయితే మధ్యలో కాసేపు విరామం తీసుకున్నా ఇంకేదో పని చేస్తున్నా అనుకోకుండా పక్కకు వెళ్లినా దాన్ని కట్టెయ్యం. ఇలా చెయ్యడం వల్ల ఏడాదిలో ఓ దేశం మొత్తంమీద వృథా చేసే కరెంటు విలువ కొన్ని కోట్లైతే కంప్యూటర్ల వల్ల విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్ చేసే హాని లెక్కగట్టలేనంత.

ఈ సమస్యకు పరిష్కారంగా వచ్చిందే ఈ ఎకోబటన్. యూఎస్ బీతో పనిచేసే దీన్ని కంప్యూటర్‌కి అనుసంధానిస్తే సిస్టమ్‌ని ఆఫ్ చేసే పనిలేకుండానే దీని బటన్‌ని నొక్కి స్లీపింగ్ మోడ్‌లో పెట్టొచ్చు. మళ్లీ బటన్ నొక్కి వెంటనే పనిచేసుకోవచ్చు. పర్యావరణ హితమే కాదు, ఏడాదికి రెండు మూడు వేల రూపాయల కరెంటు బిల్లునూ తగ్గిస్తుంది ఎకోబటన్.

కీ ప్యాడ్ పెన్‌డ్రైవ్

కంపెనీ ప్రాజెక్టు వర్క్, కొటేషన్ రిపోర్ట్, పీహెచ్‌డీ పేపర్ వర్క్ ఇలా ముఖ్యమైన డేటాని యూఎస్‌బీ డ్రైవ్‌ల్లో కాపీ చేసుకుని వెంట తీసుకెళ్తుంటాం. డ్రైవ్‌ను యాక్సెస్ చేసేందుకు ఓ పాస్‌వర్డ్‌ని పెట్టుకుంటాం. దురదృష్టవశాత్తూ పెన్‌డ్రైవ్ పోతే అంతే సంగతులు. మన డేటా మొత్తం పోతుంది. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే..కింగ్‌స్టన్ డేటా ట్రావెలర్స్ సిరీస్‌లోని డీటీ2000 డ్రైవ్ డేటా ఎవరికంటా పడకుండా కాపాడుతుంది. డ్రైవ్ పైనే కీప్యాడ్ ఉండటం దీని ప్రత్యేకత.అక్షరాలు, నెంబర్లతో పిన్‌ను పెట్టుకుని డ్రైవ్‌ను సురక్షితంగా వాడొచ్చు. ఎన్‌క్రిప్షన్ వలయంతో తయారుచేసిన ఈ డ్రైవ్ నుంచి డేటాను కొట్టేయడం అసాధ్యం. తప్పు పిన్ నెంబర్‌తో ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తే డేటా డ్రైవ్ నుంచి తొలగిపోతుంది. మూడు రకాల మెమొరీ సామర్థ్యాలతో డ్రైవ్ ఆన్‌లైన్‌లో లభిస్తుంది. 16జీబీ, 32జీబీ,64జీబీల్లో దొరుకుతుంది.



ఇక్కత్ షర్ట్స

ఇప్పటివరకూ పోచంపల్లి అనగానే మహిళల వస్త్రాలే స్ఫురణకు వస్తుంటాయి. ఇక్కత్ వస్త్రాలను మగవారికి కూడా నప్పేటట్లు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. పోచంపల్లి షర్ట్స్, నెహ్రూ కోట్లు, జాకెట్లు, ఫుల్‌కోట్లు, పైజమా, న్యారోకట్ ప్యాంట్లు దర్శనమిస్తూ యువతను ఆకర్షిస్తున్నాయి. ఇక్కత్ డిజైన్లలో మగవారి దుస్తులను తయారుచేయడానికి డిజైనర్లు కూడా ఆసక్తి చూపుతున్నారు. చేనేత వస్త్రాలను ధరించి నేతన్నకు చేయూతనివ్వాలనుకుంటోంది నేటి తరం. వీటి ధర వెయ్యి నుంచి మొదలవుతున్నాయి. అందరికీ అందుబాటులో ఉంటున్నాయి.










మన తెలంగాణ
6
హైదరాబాద్
మంగళవారం
23, జనవరి 2018
www.manatelangana.news


2024 కన్నా ముందు జమిలి ఎన్నికలు సాధ్యం కావు



హైదరాబాద్: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడమన్నది 2024 కన్నా ముందు సాధ్యం కాదని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తి అన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ సవరణ అవసరమవుతుందని ఆయన తెలిపారు. ఐదేళ్లకోసారి జమిలి ఎన్నికలు నిర్వహించడమన్నది ఆదర్శప్రాయమేనని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ పదేపదే ప్రస్తావిస్తున్న అంశాన్ని లేవనెత్తినప్పుడు ఆయన ప్రతిస్పందిస్తూ ' రాజ్యాంగాన్ని సవరించకుండానే అది సాధ్యమా?' అని ప్రశ్నించారు. 'మనం విశ్వాస తీర్మానం తాలూకు వెస్ట్‌మినిష్టర్ విధానాన్ని అనుసరిస్తున్నాం. ఒకవేళ మనం అమెరికా విధానాన్ని అనుసరించాలనుకుంటే దానికంటూ నిర్ణీత కార్యనిర్వాహక వర్గం, కాల పరిమితి ఉంటాయి. ఒకవేళ ఎవరినైనా తొలగిస్తే శాసనసభ మరొకరిని ఎన్నుకోవలసి ఉంటుంది. అంత వరకు పాత ప్రభుత్వమే పనిచేస్తుంది' అని ఆయన వివరించారు. ఐదేళ్లకోసారి ఏకకాలంలో దేశవ్యాప్తంగా ఎన్నికలు అనేది మంచి విషయమేనని కృష్ణమూర్తి అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సు మేరకు ఒకే ఏడాది లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి వీలుపడుతుందని, అందుకు కొంత అధ్యయనం, రాజ్యాంగ సవరణ అవసరమని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులు జిజ్ఞాసలో పాల్గొనడమే విజయం

ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు వెంకటరమణ



మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు జిజ్ఞాస పోటీలలో పాల్గొనడమే విజయంగా భావించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా సోమవారం జరిగిన కామర్స్ విభాగం అధ్యయన నివేదికల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో నిరంతరం ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి పడిలేచే సముద్ర కెరటాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ నిత్యనూతనంగా ఆలోచనలు చేసేందుకు నిబద్ధతతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిజ్ఞాస రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ నాన్సీ సెరీనా, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ జగదీశ్వర్, డాక్టర్ జె.నీరజ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డేకు గట్టి బందోబస్తు

మన తెలంగాణ/హైదరాబాద్: జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ఉండేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నర్సింహన్ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగరవేయAనున్నందున అక్కడ పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలు అణువణువూ తనిఖీ చేశాయి. అన్ని పోలీసు కమిషనరేట్లు, జిల్లా కేంద్రాలలో కూడా పోలీసు బందోబస్తును పటిష్టం చేశారు. ముందు జాగ్రత్త చర్యగా ఆయా జాతీయ, రాష్ట్ర రహదారులపై సోమవారం నుంచి వాహనాల తనిఖీలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టపర్చారు. పోలీసు గస్తీని పెంచారు. కరుడుగట్టిన ఉగ్రవాది అబ్దుల్ సుభాన్ ఖురేషీ (46) ఢిల్లీలో తాజాగా పట్టుబడడంతో కేంద్ర నిఘా వర్గాలు ఆయా రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేశాయి. ఈ మేరకు తెలంగాణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. హైదరాబాద్‌లో పలు ప్రాంతాలలో వరుసగా కార్డన్ సర్చ్‌లు నిర్వహిస్తున్నారు.

'గొర్రెల పంపిణీ'పై విచారణకు ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్: గొర్రెల పథకంలో పలు అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీనిపై విచారణ జరిపించాలని ప్రజా పద్దుల కమిటీ(పిఏసి) అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. శాసనసభ కమిటీ హాల్‌లో సోమవారం పిఏసి ఛైర్మన్ డాక్టర్ జె. గీతారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయం, పశుసంవర్థక శాఖలపై సమీక్ష జరిగింది. ప్రధానంగా గొర్రెల పంపకం, రుణమాఫీ, పాడిపరిశ్రమ తదితర అంశాలపై చర్చించినట్టు తెలిసింది. గొర్రెల పథకంలో భాగంగా రీసైకిలింగ్, సుమారు 30 నుంచి 40 వేల గొర్రెలు చనిపోయినట్టు వార్తలు వస్తున్నాయని సంబంధిత అధికారులను కమిటీ సభ్యులు ప్రశ్నించగా అందుకు వారు బదులిస్తూ లక్షల సంఖ్యలో గొర్రెల పంపిణీ జరిగినప్పుడు కొన్ని ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులకు అలవాటుపడక కొన్ని మృతి చెందినట్టు సమాధానమిచ్చినట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 24వేల పైచిలుకు రైతులకు రుణమాఫీ జరగలేదని, వెంటనే వీరికి రుణమాఫీ అమలు చేయాలని గతంలో జిల్లా కలెక్టర్లు, అధికారులకు లేఖ రాసిన నేపథ్యంలో దీనిపై తీసుకున్న చర్యలను తెలియజేస్తూ నెలరోజుల్లో కమిటీకి సమగ్ర నివేదికను సమర్పించాలని పిఏసి ఆదేశించింది. పాడిపరిశ్రమ అభివృద్ధిలో భాగంగా 2014లో చేపట్టిన బర్రెల పంపిణీ కార్యక్రమంపై కమిటీ సమీక్ష నిర్వహించింది. లబ్ధిదారులకు రెండు బర్రెల చొప్పున పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం ఒక బర్రెను మాత్రమే పంపిణీ చేయడంతో ప్రభుత్వ ఆశించిన ఫలితం దక్కలేదని కమిటీ అభిప్రాయపడింది. మార్గదర్శకాలకు విరుద్ధంగా రైతులు కాని వారికి లబ్ధి చేకూర్చారని కమిటీలోని ఒకరు సమావేశం దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది.

జర్నలిస్ట్ హౌసింగ్ కో-ఆర్డినేషన్ కమిటీ

మన తెలంగాణ/హైదరాబాద్ : జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారానికి అన్ని జర్నలిస్ట్ సంఘాలు,హౌసింగ్ సొసైటీలు కలిసి సమన్వయ కమిటీగా ఏర్పడ్డాయి. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో జర్నలిస్టుల హౌసింగ్ సమన్వయ కమిటీ ఏర్పడింది. దీనికి కన్వీనర్‌గా ఆర్.దిలీప్ రెడ్డి, కో కన్వీనర్లుగా కె. విరాహత్ అలీ, బి.రాజమౌళి చారి, డి.వెంకటాచారి, బి.బసవపున్నయ్య, కో ఆర్డినేటర్స్‌గా ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, ఎం ఎస్ హాష్మీ, మీడియా కో ఆర్డినేటర్‌గా మామిడి సోమయ్య, లీగల్ కోఆర్డినేటర్ ఎస్.ఎ. ఇషాకీ, అడ్వయిజర్స్‌గా కోనేటి రంగయ్య, ఆర్.శైలేష్ రెడ్డి, ఎం.వేణుగోపాల్ రావు, సభ్యులుగా కె. రాములు, కె.అజిత,రెహానా, మారం శ్రీనివాస్, తాహెర్ రుమానీ, ఎండి రియాజ్ అహ్మద్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పిసిబి పోస్టుల ఫలితాలు విడుదల

మనతెలంగాణ/హైదరాబాద్ : కాలుష్య నియంత్రణ మండలి(పిసిబి)లో స్టెనో కమ్ టైపిస్ట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల ఫలితాలను టిఎస్‌పిఎస్‌సి విడుదల చేసింది. ఈ పోస్టుల భర్తీకి గత ఏడాది మే 13న సిబిఆర్‌టి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించింది. అలాగే ములుగులోకి అటవీ కళాశాలలో లైబ్రరీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టిఎస్‌పిఎస్‌సి ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.



హబ్సిగూడలో సోమవారం మాజీ డిజిపి ఆర్.కె.రాగాల మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి.

అక్రమ నిర్మాణాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు

- చర్యలు తీసుకోవాలని గ్రామాలకు ఆదేశం
- నీటి, విద్యుత్ కనెక్షన్లు మంజూరుపైనా ప్రభావం

మన తెలంగాణ, హైదరాబాద్ సిటీబ్యూరో : నగర శివారులో నిర్మాణదారులకు హెచ్చరిక. ఇక ముందు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే ఓ వైపు చర్యలు... మరో వైపు విద్యుత్, తాగునీటి కనెక్షన్లు మంజూరు కావు. ఈ మేరకు స్పష్టమైన నిర్ణయం తీసుకుంది హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండిఎ). వాటిని నియంత్రించడంలో రాజీ లేకుండా ప్రత్యేక ఆదేశాలు జారీ చేసేందుకు, చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. హెచ్‌ఎండిఎ కమిషనర్ చిరంజీవులు. ఇక ముందు ప్రతి అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేయాలనుకునేవారు ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేయడం, ఆ ఫిర్యాదుల పరిస్థితిని, అవి ఏ స్థాయిలో ఉన్నదని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు గ్రహించే వీలును కలిపిస్తున్నారు. అక్రమంగా అనుమతులు లేకుండా, అనుమతులను అతిక్రమించి చేపట్టే నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని అందుకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకువస్తున్నారు కమిషనర్.

గ్రామ పంచాయతీలకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకుండా అక్రమ నిర్మాణాలను పరోక్షంగా, ప్రత్యక్షంగా ప్రోత్సహిస్తూ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నది బహిరంగ రహస్యం. ఇటు హెచ్‌ఎండిఎ అదాయానికి గండిపెడుతున్నవి. చర్యలు తీసుకోని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాలపై జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు చేయడం జరుగుతున్నా పలు గ్రామపంచాయతీల తీరు మారడంలేదు. ఫలితంగా కొన్ని గ్రామాలకున్న అధికారాల్లోనూ కోతలను విధిస్తునత్నది హెచ్‌ఎండిఎ. మరికొన్ని గ్రామాల సర్పంచ్‌లపై, కార్యదర్శిలపై ఫిర్యాదు చేయడం జరుగుతుంది. కానీ, ఆయా గ్రామాలు అక్రమ నిర్మాణాలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో కమిషనర్ అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఆన్‌లైన్ సేవల్లోనూ పారదర్శకత...

అనుమతి లేకుండా వెలిసే నిర్మాణాలపై తీసుకునే చర్యల్లోనూ పారదర్శకతను తీసుకువస్తున్నారు కమిషనర్. హెచ్‌ఎండిఎ విస్తరిత ప్రాంతంలోని గ్రా మాలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఏదేని అక్రమ నిర్మాణం జరిగితే వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలులోకి తీసుకువస్తుంది. ఆన్‌లైన్‌లోనే ఫోటోలను జతపరచవచ్చును. ఆ ఫిర్యాదు ఏ సెక్షన్‌లో ఉన్నది. అనంతరం ఎవరి వద్దకు వెళ్తుందనేది స్పష్టంగా తెలుస్తుంది. ఏదేని ఫిర్యాదు వచ్చిన వెంటనే సంబంధిత జెపిఓ లేదా ఎపిఓ, పిఓలు వెంటనే స్పందించి ఆయా గ్రామాల్లోని నిర్మాణాల వద్దకు చేరి నివేదికను సిద్ధంచేస్తారు. ఆ నివేదిక ఆధారంగా అనుమతిలేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేస్తుంది. గ్రామ పంచాయతీలు నోటీసులందుకుని చర్యలు తీసుకోని పక్షంలో హెచ్‌ఎండిఎ స్వయంగా నిర్మాణదారుడికి నోటీసులు జారీచేయడంతోపాటు చర్యలు తీసుకుంటుందని అధికారవర్గాలు స్పష్టంచేస్తున్నాయి.

నల్లా, విద్యుత్ కనెక్షన్లు రావు...

తాగునీటి కనెక్షన్‌లను మంజూరు చేసే జలమండలికి, కరెంట్ కనెక్షన్లు అందించే విద్యుత్ అధికారులకు ఆయా నిర్మాణాలకు అనుమతులు లేవని, వాటికి విద్యుత్, నీటి కనెక్షన్‌లను మంజూరు చేయరాదంటూ నోటీసులను చేయాలని నిర్ణయించారు. నోటీసులు జారీచేసినా కనెక్షన్‌లను మంజూరు చేస్తే ఆ విభాగంపైనా ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేయాలని నిర్ణయించారు. దీంతో ఇటు జలమండలి,. అటు విద్యుత్ సంస్థలు అనుమతిలేని నిర్మాణాలకు కనెక్షన్లను మంజూరు చేసే అవకాశాలు కనుమరుగుకానున్నవి.

అనుమతులు తప్పనిసరి

అథారిటీ విస్తరిత ప్రాంతంలో భవన నిర్మాణాలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి, అది నిర్మాణదారులకు ప్రయోజనకరం, ఇటు సంస్థకు మేలు అవుతుందని హెచ్‌ఎండిఎ కమిషనర్ చిరంజీవులు స్పష్టంచేశారు. మెరుగైన సమాజం కోసం ప్రణాళికా ప్రకారంగా అభివృద్ధికి సక్రమమైన నిర్మాణాలు దోహదం చేస్తాయని చిరంజీవులు చెప్పారు.

మా దారి సుదీర్ఘం

(మొదటిపేజీ తరువాయి)

కలుసుకోవడంలో తప్పేమి ఉంటుందని ప్రశ్నించారు. కె. చంద్రశేఖర్‌రావు తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించారని, ఆ కారణంగానే ప్రజలు ఆయనకు పట్టంకట్టారని తెలిపారు. ఎవరైనా ప్రజా తీర్పును గౌరవించాల్సిందే అన్నారు. జనసేన ఆవేశపూరిత రాజకీయాలకు దూరంగా ఉంటుందన్నారు. తాము నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తామని, ఏది చేసినా అది ప్రజలకు ఉపయోగపడేలా చూస్తామన్నారు. రెండు రాష్ట్రాలలో అధికార పార్టీలు తనను వాడుకోవడం లేదని, తాను ఎవరి ప్రలోభాలకు లొంగేది లేదన్నారు. అనేక దశాబ్దాల పోరాటం తరువాత తెలంగాణ నూతన రాష్ట్రంగా ఏర్పడిందని, అందుకే ఈ రాష్ట్రంపై తాను ఇష్టాన్ని, మమకారాన్ని పెంచుకున్నానని చెప్పారు. జనసేన తెలంగాణలో ఆచితూచి, బాధ్యతగా ముందుకు సాగుతుందన్నారు. మొదట రాష్ట్రంలోని ప్రజా సమస్యలను అర్థం చేసుకొని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తమన్నారు. 2019 ఎన్నికల్లో ఇన్ని ఓట్లు, సీట్లు కావాలని తాము ఆలోచించడం లేదన్నారు. 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం కోసం పార్టీని ప్రారంభించామన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా మీకెందుకి రాజకీయ గొడవలంటూ తనను బిజెపిలోకి



రమ్మని ఆహ్వానించినా సున్నితంగా తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళ, బుధవారాల్లో జనసేన వేదికల ద్వారా కార్యకర్తలతో సమావేశమవుతున్నానని చెప్పారు. వారి నుండి సలహాలు, సూచనలు తీసుకుంటానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సమస్యలపై తన పర్యటనలు ఉంటాయన్నారు. జనసేనకు మద్దతు ఇవ్వాలని తన సోదరుడు చిరంజీవిని అడగలేదని, ఇకపై అడగబోనని చెప్పారు. పార్టీని నడపడంపై స్పష్టత ఉందని, ఆ దిశగా పని చేసుకుంటూ పోతూ ఉంటానన్నారు. రాజకీయాలు అంటే పరిష్కారం, పునశ్చరణ అనేవిగా ఉండాలన్నది తన భావన అన్నారు. అంకిత భావం కలిగిన రాజకీయ కార్యాచరణ ఉంటే ఉపాధి కల్పనతో పాటు ఇతర అభివృద్ధి అంశాలను సాధించడం సుసాధ్యమే అన్నారు. తెలుగు రాష్ట్రాలలో వనరులు ఉన్నాయని, జనాభా నిష్పత్తి పెరిగిందని ఈ క్రమంలో సత్వర అభివృద్ధి ఏ ప్రభుత్వానికైనా సవాల్‌తో కూడుకున్నదేనని చెప్పారు. 2009 ఎన్నికల ప్రచార సందర్భంగా జిల్లాలలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి తాను ప్రమాదానికి గురి అయినప్పుడు కొండగట్టు అంజనేయ స్వామి కృప వల్లనే బ్రతికి బయటపడ్డానన్నారు. అందుకే ఆయన ఆశీర్వాదం తీసుకొని తన సంపూర్ణ రాజకీయాన్ని ఇక్కడి నుండే ప్రారంభిస్తున్నానని తెలిపారు.


సిఐతో మహిళా ఎఎస్‌పి వివాహేతరం

(మొదటిపేజీ తరువాయి)


కొనసాగిస్తున్నాడని సురేందర్‌రెడ్డి మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సదరు ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. ఎంతో మంది మహిళలను లొంగదీసుకుని నాశనం చేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సురేందర్‌రెడ్డి, సునితారెడ్డి తల్లి, అత్త డిమాండ్ చేశారు. ఇన్ స్పెక్టర్ తన కూతురు జీవితాన్ని నాశనం చేశాడని సునితారెడ్డి తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఇదిలా వుండగా తనకు సునితారెడ్డితో వివాహేతరు సంబంధం లేదని, కేవలం ఆమెను ఇంటి వద్ద డ్రాప్ చేయడానికి వచ్చానని మల్లిఖార్జున్‌రెడ్డి వివరణ ఇచ్చారు. ఈ ఉదంతంపై డిజిపి మహేందర్‌రెడ్డి విచారణకు ఆదేశించారు.

త్వరలో పెళ్లి చేసుకుంటాం..కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్

వివాహేతర సంబంధం ఉదంతంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. అదనపు ఎస్పి సునీతారెడ్డితో తనకు గత ఐదేళ్లుగా పరిచయం ఉందని తెలిపారు. ఆమె తన భర్తతో విడాకులు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారని, విడాకులు వచ్చాక చట్టబద్ధంగా తాము వివాహం చేసుకోవాలనుకుంటున్నామన్నారు. ఆదివారం అర్ధరాత్రి



ఎఎస్‌పి సునీతారెడ్డి



ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి

సమయంలో సునీతారెడ్డిని ఆమె ఇంటి వద్ద డ్రాప్ చేసేందుకు వచ్చానని, అయితే తనను పట్టుకుని కొట్టారని ఆయన ఆరోపించారు. తమది వివాహేతర సంబంధం కాదని, చట్టబద్ధంగానే ఒక్కటవుతామన్నారు. ఈ విషయం ఆమె భర్తకు కూడా చెప్పానని తెలిపారు. తన భార్యతో తాను సఖ్యంగా లేనని..చాలా కాలంగా తన భార్యతో దూరంగా ఉంటున్నట్లు చెప్పారు. త్వరలో అన్ని విషయాలు మీడియా ముందుకు వచ్చి వివరిస్తామన్నారు.

ఎన్నికలకు సిద్ధంకండి

(మొదటిపేజీ తరువాయి)

వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం ఎజెండాగా పనిచేస్తున్న కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా 70 స్థానాలకు తక్కువ కాకుండా గెలిచి తీరుతుందని, దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ అభ్యర్థులు పూర్తిగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో 12 స్థానాలు కాంగ్రెస్ పార్టీనే గెలిచి తీరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో సమర్థవంతంగా పనిచేస్తుందని ఇప్పటికే 31 రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో ఎల్.డి.ఎం.ఆర్.సి కార్యక్రమాలు నిర్వహించి పార్టీ పటిష్టంగా చేయగలిగామని, త్వరలో జనరల్ స్థానాలలో కూడా లీడర్ షిప్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. మే నాటికి రాష్ట్రంలో 119 నియోజకవర్గాలలో లీడర్ షిప్ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులందరికీ సముచిత గౌరవమిస్తామని, ఏ ఇబ్బందులు ఉన్నా తాను, మల్లు భట్టి విక్రమార్క అందుబాటులో ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి పాల్గొన్నారు.

గోదావరిపై 3 వంతెనలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణం, నూతన కలెక్టరేట్ల నిర్మాణం వంటి అంశాలను చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు అటవీ ప్రాంతాలలో ఒక్క వరుస రహదారి స్థానంలో నిబంధలను సవరించి కేంద్ర ప్రభుత్వం రెండు వరుసల రహదారులను మంజూరు చేసింది. కరీంనగర్ జిల్లాలో మహదేవ్‌పూర్–ముక్కునూర్–కుకునూర్–కాటారం రహదారి, కమాన్‌పేట–ముక్కనూర్ రోడ్డు–తుపాకుల గూడెం, కరీంనగర్ రహదారిని కలిపే పగడపల్లి–కనేపల్లి రహదారులు రెండు లైన్ల రోడ్లుగా మారుతున్నాయి. వీటితో పాటు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల ప్రస్తుత స్థితి, ఆలస్యం అవుతున్న వాటి వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకంలో భాగంగా గతంలో మంజూరు అయిన రూ. 1,290 కోట్ల రహదారుల పనులను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఆయా పనులను త్వరిత గతిన చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు.



తల్లి, కూతురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

గురవుతుంది. నెల రోజుల పాటు సాన్వి అనారోగ్యానికి గురై రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందింది. దీంతో ఇద్దరి పిల్లల ఆరోగ్య పరిస్థితిపై తల్లి స్వాతి (30) కలత చెందుతూ వచ్చింది. బాబు ఆరుశ్రమ్ స్వాతి పుట్టింట్లో ఉండగా సోమవారం ఉదయం ఐదంతస్తుల మేడపై నుంచి పాపతో పాటు దూకి ఆత్మహత్య చేసుకుంది. దీనిని గమనించిన చుట్టు పక్కల వారు దగ్గరలో ఉన్న అర్చన ఆసుపత్రికి తీసుకువెళ్ళగా అప్పటికే తల్లి బిడ్డ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆత్మహత్య చేసుకున్న సమయంలో బాబు లేకపోవడంతో చావు తప్పించుకున్నట్లు తెలుస్తుంది. తల్లి బిడ్డల మరణంతో ఇరు కుటుంబాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త ప్రదీప్ ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు ఎస్‌ఐ వేణు కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

అసమ భారత విషమ దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

లింగ భేదాలను మహానాయకులు లోతుగా చర్చిస్తారు. 2016 సర్వేలో భారత్‌లో ఒక్క శాతం అత్యంత సంపన్నులు 58 శాతం సంపదను సొంతం చేసుకొన్నారని తెలిపింది. ఇది ప్రపంచ శాతం 50 కంటె ఎక్కువ. ఇప్పుడది 73 శాతానికి పెరిగింది. భారత దేశపు ఒక్క శాతం సంపన్నుల ఆదాయం రూ 20.9 లక్షల కోట్లు పెరిగినట్లు ఈ ఏడాది సర్వే పేర్కొంది. 2017లో పెరిగిన సంపన్నుల ఆదాయం వర్తమాన కేంద్ర బడ్జెట్ మొత్తంతో సమానం అని కూడా ఆక్స్‌ఫామ్ వివరించింది. 'పనిని గౌరవించండి. సంపదను కాదు' అన్న శీర్షికతో నివేదికను విడుదల చేశారు. లక్షలాది మంది ఆదాయాలు పడిపోయి పేదరికంలో మగ్గుతుంటే ఎలా కొందరు ధనికులు సంపదలు పోగేసుకొంటున్నారో ఈ నివేదిక వెల్లడిస్తోంది. '2017లో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ప్రతి రెండు రోజులకు ఒకటి రేటున ఈ సంఖ్య పెరిగింది.

2010 నుంచి ప్రతి ఒక్క బిలియనీర్ సంపద ఏడాదికి 13 శాతం చొప్పున పెరుగుతోంది. ఇది సామాన్య కార్మికుని వేతనం పెరుగుదల వేగం కంటె ఆరు రెట్లు ఎక్కువ. ప్రపంచంలో సగటున కార్మికుని ఆదాయం ఏడాదికి 12 శాతం మాత్రమే పెరిగింది. భారత దేశంలో దుస్తుల కర్మాగారం ఉన్నతాధికారి ఏడాదికి సంపాదిస్తున్న మొత్తంతో సమంగా సాధారణ గ్రామీణకూలీ కనీస వేతన ఆదాయం పెరగాలంటే 941 సంవత్సరాలు పడుతుందని సర్వే అంచనా వేసింది. అమెరికాలో సామాన్యకార్మికుడు ఏడాదికి సంపాదించే మొత్తాన్ని సంస్థ సిఇఒ ఒక్క రోజులో సంపాదిస్తాడు. ప్రపంచ వ్యాప్తంగా 70,000 మంది ప్రజలను ఈ సర్వేలో భాగంగా ప్రశ్నించారు. వారంతా 10 దేశాలకు చెందిన వారు. సంపన్నులు, పేదల మధ్య అంతరం తక్షణమే తొలగాలని సర్వేలో ప్రతి ఒక్కరూ సూచించినట్లు ఆక్స్‌ఫామ్ తెలిపింది. భారత దేశంలో 2017లో కొత్తగా 17 మంది బిలియనీర్లు చేరడంతో వారి సంఖ్య మొత్తం 101 అయింది. భారత దేశంలో ప్రభుత్వం సంపన్నుల పక్షం వహించకుండా సాధారణ ప్రజలందరి బాగు కోసం పని చేయాలని దావోస్ సమావేశంలో పాల్గొంటున్న ప్రధాని మోడీని ఆక్స్‌ఫామ్ ఇండియా కోరింది. కార్మికులకు ప్రోత్సాహకరమైన రంగాలలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోయే సమ్మిళిత వృద్ధికి ఊతం ఇవ్వాలని కూడా ఆక్స్‌ఫామ్ ఇండియా ప్రభుత్వాన్ని కోరింది. అందువల్ల మరిన్ని ఉద్యోగాలు కల్పించవచ్చని సూచించింది. ప్రస్తుతం ఉన్న సామాజిక భద్రతా పథకాల అమలును పటిష్టపరచవచ్చని కూడా సూచించింది. పన్నుల ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా దేశ సంపదలో 'బొరియ'లను పూడ్చవచ్చని, అత్యంత సంపన్నులపై పన్ను పెంచవచ్చని, కార్పొరేట్ పన్ను విరామాలు తొలగించాలని కూడా ఆక్స్‌ఫామ్ ఇండియా సిఇఒ నిషా అగర్వాల్ కేంద్రానికి సలహా ఇచ్చారు.ఆర్థిక వృద్ధి ఫలాలు కొద్ది మందికే పరిమితం కావడం కొనసాగడం పట్ల ఆమె ఆందోళన ప్రకటించారు. సిఇఒల వేతనంలో 60 శాతం కోత విధించాలని అమెరికా, బ్రిటన్, భారత్‌లో సర్వే జరిపిన సంస్థ సూచించింది. కార్మికుల పని పరిస్థితులు, జీతనాతాలను కనాకష్టంగా ఉంచుతూ, వాటా పెట్టుబడిదార్లు , కార్పొరేట్ సంస్థల యజమానులకు ప్రయోజనాలు కట్టపెట్టడం తగదని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ విధానాలపై బడా కార్పొరేట్ సంస్థల అదుపు తొలగాలని, కార్మిక హక్కులను కాలరాసే విధానాలు పోవాలని, నిరంతరం ఖర్చులు ఎలా తగ్గించాలి అన్న కార్పొరేట్ సంస్థల ఆలోచనకు అడ్డుకట్ట వేయాలని కూడా సూచించింది. వాటా పెట్టుబడిదారులకు, కంపెనీలకు లాభాలు పెంచడం కోసం ఖర్చులు తగ్గించడంలో భాగంగా కార్మికుల వేతనాలు, ఉద్యోగాల సంఖ్యలో కోతలు పెట్టడాన్ని కంపెనీలు అవలంబిస్తున్నాయని నివేదిక అభిప్రాయపడింది.

భారత దేశపు జనాభాలో అగ్రభాగాన నిలిచే ఒక శాతం సంపన్నులు 73 శాతం దేశ సంపదను గుప్పెట్లో పెట్టుకున్నట్లు ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. అలాగే దేశ బిలియనీర్లలో 37 శాతం మందికి వారసత్వంగా వచ్చిన కుటుంబ ఆస్తులు కూడా ఉన్నాయని తెలిపింది. ఈ 37 శాతం మంది దేశంలోని బిలియనీర్ల మొత్తం సంపదలో 51 శాతాన్ని సొంతం చేసుకున్నట్లు కూడా తెలిపింది. బిలియనీర సంపద అవధులు మించి పెరిగిపోవడం ఆర్థిక వ్యవస్థ పటిష్టానికి కాక, దిగజారుడుకు సంకేతమని హెచ్చరించింది. దేశానికి ఆహారాన్ని అందిస్తూ, మౌలిక సౌకర్యాలను నిర్మిస్తూ, కర్మాగారాలలో శ్రమిస్తున్న ప్రజలు తమ పిల్లల విద్య కోసం, కుటుంబ సభ్యులకు మందులు కొనడం కోసం, రెండు పూట్ల తినడం కోసం పోరాడుతుంటే కొద్ది మంది సంపన్నుల ఆదాయం విపరీతంగా పెరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు తెస్తుందని హెచ్చరించింది. ఈ అంతరం వల్ల అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెరుగుతుందని కూడా పేర్కొంది. భారత్‌లో ప్రతి 10 మంది బిలియనీర్లలో తొమ్మిది మంది పురుషులని, దేశంలో మహిళలు సమాజం అట్టడుగున కునారిల్లుతున్నారని కూడా ఆక్స్‌ఫామ్ నివేదిక వివరించింది. దేశంలో నలుగురే మహిళా బిలియనీర్లు ఉన్నారని, వారిలో ముగ్గురు కుటుంబ ఆస్తులకు వారసులని తెలిపింది.


మన తెలంగాణ
7
హైదరాబాద్
మంగళవారం
23, జనవరి 2018
www.manatelangana.news



బాసర ట్రిపుల్ ఐటికి ప్రపంచ స్థాయి గుర్తింపు : కడియం

మన తెలంగాణ/బాసర : బాసర ట్రిపుల్ ఐటి విశ్వవిద్యాలయానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చేలా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. సోమవారం ఉదయం బాసర ట్రిపుల్ ఐటి విశ్వవిద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. కళాశాల వైస్ ఛాన్స్‌లర్ డా. అశోక్ కుమార్‌తో కలిసి కళాశాలలో కలియదిరిగారు. వసతి గృహాలు,మెస్సులు, ఇంజనీరింగ్ విభాగాలు, ఆసుపత్రిని పరిశీలించారు. ఈసందర్బంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ బాసర ట్రిపుల్ ఐటిని ప్రపంచస్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చేలా ఇద్దరు విశ్రాంత ఉప కులపతులతో కమిటీని ఏర్పాటుచేసినట్లు ఆయన చెప్పారు. ట్రిపుల్ ఐటి నిర్మాణం త్వరతగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. బాలికలకు ఐరన్ టాబ్లెట్స్ ఇవ్వాలని, ఆహార పదార్థాల తయారీలో జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. త్వరలో అధ్యాపకులను నియమించేవిధంగా చర్యలు తీసుకుంటానని, ఫిజికల్ విద్యను మరింత పటిష్ఠం చేసి విద్యతోపాటు కళాశాలలో విద్యార్థులకు క్రీడా నైపుణ్యం కల్పించే విధంగా వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, విద్యార్థుల కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచాలని అధికారులను అదేశించారు. పరిపాలనాధికారి వెంకటస్వామి, అసోసియేట్ అకాడమిక్ డీన్ రణధీర్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీ : సింగరేణి కార్మికుడి మృతి



మన తెలంగాణ/మణుగూరు : టిప్పర్ ఢీకొని సింగరేణి కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణ పరిధిలోని రాజుపేట సరిహద్దుల్లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చెల్లగాని రామకృష్ణరాజు (45) మణుగూరు ఒసికి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలు కాగా ఏరియా అసుపత్రికి తరలించారు. మణుగూరు పోలీసులు కేసు దర్యాపు చేస్తున్నారు.

ఎంఎల్‌ఎ దాసరి ఘెరావ్



మన తెలంగాణ / పెద్దపల్లి : పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరిమనోహర్ రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. సోమవారం మండలంలోని అప్పన్నపేట గ్రామంలో పలు అబివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు రైతులు చుక్కలు చూపించారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి నీళ్ల అందక వరి నార్లు వట్టిపోతున్నాయని ఆగ్రహించిన రైతాంగం నడి రోడ్డుపై అడ్డుకొని నిలదీశారు.డి83 కాలువ కింద వరినార్లు పోసుకొని 50 రోజులు దాటినా నీళ్లు అందక నాట్లు కాలేదని, వరినారు ముదిరి పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం చెప్పలేక పోలీసుల రక్షణలో ఎమ్మెల్యే వెనుదిరిగేందుకు ప్రయత్నించడంతో రైతులు శాపనార్థాలు పెడుతూ వాహనాన్ని వెంబడించి కొంతదూరంలో రాజీవ్ రహదారిపై అడ్డుకొని ఘోరావ్ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎమ్మెల్యేకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎస్‌ఆర్‌ఎస్‌పి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పినా రైతు వినకుండా వాహనానికి అడ్డుపడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంతకూ రైతులు శాంతించక పోవడంతో ఎమ్మెల్యే పోలీసుల రక్షణలో వెనుదిరిగారు.

స్వచ్ఛభారత్ మిషన్ అవగాహన ఫోటో ఎగ్జిబిషన్



మన తెలంగాణ/హైదరాబాద్: స్వచ్ఛభారత్ మిషన్ పట్ల అవగాహన కల్పించేందుకు మొదటి దశ అవగాహన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) అడిషనల్ డైరక్టర్ జనరల్ (రీజియన్) ఇ. మారియప్పన్ ప్రారంభించారు. పరిసరాల పరిశ్రుభత పాటించడంలో ప్రజలు శ్రద్ధ కనబర్చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ పబ్లిసిటీ డైరక్టరేట్ డైరక్టర్ దేవేంద్ర జిత్, ఎగ్జిబిషన్ అధికారి సురేష్ డి హర్మపూరి పాల్గొన్నారు. మొదటి దశ అవగాహన కార్యక్రమం ఈ నెల 24 వరకు, రెండవ విడత 29 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు.

భారీగా గుట్కా పట్టివేత

రూ.3.50 లక్షల గుట్కా సంచుల సీజ్



మన తెలంగాణ/మానకొండూర్ : గుట్కాలను మానకొండూర్ పోలీసులు భారీ ఎత్తున పట్టుకుని సీజ్ చేశారు. మూడున్నర లక్షల రూపాయల విలువ చేసే గుట్కాను పట్టుకుని,ఇద్దరిని అరెస్టు చేసి, ఒక కారును సీజ్ చేశారు. మానకొండూర్ పోలీసు స్టేషన్‌లో సోమవారం మీడియా సమావేశంలో కరీంనగర్ రూరల్ ఏసిపి టి.ఉషావిశ్వనాథ్ గుట్కా ప్యాకెట్‌లు సరఫరా చేస్తున్న వారి వివరాలు వెల్లడించారు. కేశవపట్నంకు చెందిన గాజుల శ్రీనివాస్, జమ్మికుంటకు చెందిన యాద సురేష్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మొర్రిమడుగుకు చెందిన బొర్లకుంట రాజవెంకట్, లక్ష్మీ పూర్ తండాకు చెందిన బోడ మోహన్‌లను పట్టుకుని వారి నుంచి సుమారు మూడున్నరల లక్షల రూపాయల విలువ చేసే అంబర్ ప్యాకెట్‌లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మీడియా సమావేశంలో స్థానిక సిఐ బి.కోటేశ్వర్, ఏఎస్‌ఐ మొగిలి మల్లేశం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆ మోటర్ కనెక్షన్లను తొలగించాలి

అధికారులను ఆదేశించిన మంత్రి ఈటెల రాజేందర్



మన తెలంగాణ/కరీంనగర్ ప్రతినిధి : ఎస్సారెస్పీ కాలువలపై ఉన్న అక్రమ విద్యుత్ మోటర్ కనెక్షన్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఈటెల రాజేందర్ ఆదేశించారు. ఈ నెల 25న మూడవ విడుత నీటిని విడుదల చేస్తామని సంబంధిత జిల్లాల కలెక్టర్లు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించి నీటిని చివరి వరకు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ ఇంజనీర్లు, ట్రాన్స్కో అధికారులతో ఎస్సారెస్పీ నీటి వినియోగంపై సమీక్ష సమావేశం అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నీటిని దుర్వినియోగం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తుల ఉమ, కరీంనగర్, పెద్దపల్లి కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, దేవసేన, రసమయి బాలకిషన్ పాల్గొన్నారు.



హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా



యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ముందు ధర్నా

కలెక్టరేట్ల ఎదుట టిమాస్ ధర్నాలు

మన తెలంగాణ /హైదరాబాద్ సిటీ బ్యూరో : అర్హులైన పేదలందరికీ వెంటనే డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మించి ఇవ్వడంతో పాటు బస్తీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టి–మాస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. మహిళలు భారీగా తరలి రావడంతో పోలీసులు భారీ భద్రత చేపట్టారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి టిమాస్ నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ఇళ్లు కట్టుకోవడానికి నగరం నడి బోడ్డున 10 ఎకరాల స్థలం ఉంది కాని, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించడానికి మాత్రం నగరంలో స్థలం లేదంటూ దాటవేస్తున్నారని విమర్శించారు. హుస్సేన్ సాగర్ ఒడ్డున సచివాలయం ఉండగా, అది సరిపోదు అంటూ 70 ఎకరాల్లో మరో కొత్త సచివాలయాన్ని నిర్మాణానికి యత్నిస్తున్నారన్నారు. ఎన్నికల హా మీ మేరకు నగరంలో ని పేదలందరికీ డబుల్ బెడ్ రే రూంఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు పేదల సమస్యలంటిన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వ కార్యాలయాలన్నింటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ధర్నాకు తరలివచ్చిన మహిళల నుంచి ఇళ్ల దరఖాస్తులను స్వీకరించి టీ మాస్ నేతలు, కలెక్టర్ యోగితా రాణాకు సమర్పించారు. టిమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు, నగర కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు సహాదేవ్, బి.కనకయ్య, దశరథ్, వెంకటేశ్, నరేశ్, సోమయ్య, అరుణజ్యోతి పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరిలో ఉద్రిక్తం

మన తెలంగాణ/యాదాద్రి భువనగిరి : ప్రజాసమస్యల పరిష్కారానికి శాంతియుతంగా ధర్నాచేస్తే అధికారులలో ఏమాత్రం చలనంలేదని సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. టిమాస్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కలెక్టరేట్ ముట్టడిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించడం ఎంతవరకు సమంజసమని ఆయన తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించారు. యాదగిరిగుట్ట మండల పరిధి చిన్నకందుకూరు గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ గుండాలు దళితులపై దాడులు చేసి వారం రోజులు కావస్తున్నప్పటికి ఏ ఒక్కరిని అరెస్ట్ చేయకపోవడంతో పోలీసుల ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. టీమాస్ రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, జిల్లా చెర్మన్ భట్టు రాంచంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో అతిదారుణంగా హత్యకుగురైన అంబోజు నరేష్ స్వాతిల కుటుంబాన్ని ప్రభుత్వం నేటికి ఆదుకోలేదని వారు విమర్శించారు. 50 సం॥ల దాటిన చేతి వృత్తిదారులకు నెలకు ఒక్కంటికి 3వేల రూ॥ల వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని, ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న మేట్లను తొలగించవద్దని వారు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు యాదాద్రిభువనగిరి జిల్లాలోని ప్రజా సంఘాల నాయకులు కార్మికులు భారీ జన ప్రదర్శనతో కలెక్టరేట్ ముట్టడి చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల మధ్యన ప్రజల మధ్యన వాగ్వాదం చోటుచేసుకోవడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. తీవ్ర ఆగ్రహానికి గురైన ప్రజలు పోలీసుల ఆదేశాలను పరిగణలోకి తీసుకోకుండా హన్మకొండ, హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. చివరకు అసెంబ్లీ స్పీకర్ మధుసూదన్‌చారి, జెసి రవినాయక్ మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు రాస్తారోకోను విరమించారు. చివరికి రాస్తారోకో దగ్గరికి దిగివచ్చిన డీఆర్వో రావులమహేందర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. జిల్లా స్టీరింగ్‌కమిటీ సభ్యులు భట్టుపల్లి అనురాధ, బర్రె సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిమాస్ జిల్లా కన్వీనర్ కల్లూరి మల్లేశం, గొల్లకురుమ డోలుదెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బెల్లికృష్ణ పాలొన్నారు.

ప్రజావాణిలో ఇద్దరి ఆత్మహత్య

జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో ఘటనలు





మన తెలంగాణ /జగిత్యాలటౌన్ : ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సమక్షంలోనే ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన చిట్యాల గంగయ్య (40) అనే రైతు 2001లో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద సర్వే నెంబర్ 210లోని 1.20 గుంటల ఎకరాల వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేశాడు. గత 17 సంవత్సరాలుగా తాను కొనుగోలు చేసిన భూమిలో పంటలు సాగు చేస్తున్నాడు. సాదా బైనామాల క్రమబద్దీకరణలో భాగంగా తన భూమిని క్రమబద్దీకరించాలంటూ గంగయ్య రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే భూమి విక్రయించిన వ్యక్తి చనిపోగా అతడి కుటుంబ సభ్యులు సాదా బైనామా క్రమబద్దీకరణకు అభ్యంతరం చెప్పడంతో అధికారులు సదరు భూమిని క్రమబద్దీకరించలేదు. తాను కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన భూమిని తన పేరిట మార్పు చేయాలని గంగయ్య పలుమార్లు అధికారులను కలిసి వేడుకుంటున్నాడు. సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆయన భార్య సుశీలతో కలిసి స్థానిక ఐఎంఎ హాలులో ప్రజావాణికి వచ్చాడు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి పడిపోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందు తూ సోమవారం రాత్రి గంగయ్య మృతి చెందాడు.

మంచిర్యాలలో..

మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రానికి చెందిన రంగు రామగౌడ్(42) అనే టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. రంగు రామగౌడ్ నెన్నెల మండల టిడిపి అధ్యక్షునిగా కొనసాగు తుండగా అన్యాయంగా తనను ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసులో ఇరికిం చారని, తీవ్ర మనస్తాపానికి గురైతన వెంట తెచ్చుకున్న పురుగుల మందు సేవించి అక్కడిక్కడే తీవ్ర అస్వస్థతకు గురికాగా అతన్ని వెంటనే అధికారులు, పోలీసు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆగ్రహానికి గురైన కు టుంబీకులు, గ్రామస్థులు, టిడిపి,బిజెపి నాయ కులు పెద్దఎత్తున రాస్తారోకో నిర్వ హించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ అధికారుల అసమర్థత వల్లనే టిడిపి నాయకుడు రంగు రామగౌడ్ ఆత్మహత్య చేసుకున్నాడని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పోగాకు జయచందర్, బిజెపి రాష్ట్ర నాయకుడు హేమాజీలు ఆరోపించారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడు తూ రామగౌడ్ మృతికి కారకులైన తహసీల్దార్ , పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అట్రాసిటీ కేసు నమోదు చేసిన మూడు రోజుల్లోనే రామగౌడ్‌ను రిమాండ్‌కు పంపడం జరిగిందని, ఇందులో సర్పంచ్ ఆస్మా భర్త మండల కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహింతో పాటు రెవెన్యూ, పోలీసు అధికారుల హస్తం ఉందని ఆరోపించారు.



ప్రపంచ పోలీసింగ్ వ్యవస్థగా మారుస్తాం

డిజిపి మహేందర్‌రెడ్డి

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: తెలంగాణ పోలీస్ వ్యవస్థ మూడున్నర ఏళ్ల కాలంలో దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి ఎదిగిందని, దీనిని ప్రపంచ పోలీసింగ్ స్థాయికి తీర్చిదిద్దుతామని పోలీస్ డైరక్టర్ జనరల్ మహేందర్‌రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా సోమవారం నల్లగొండ పోలీస్ కేంద్రానికి వచ్చిన డిజిపికి పోలీస్ లాంఛనలతో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సాదరస్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఐటిసెల్, సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం నల్లగొండ, సూర్యాపేట పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిజిపి మాట్లాడుతూ నేర రహిత, శాంతిభద్రతలలో దేశంలోనే రాష్ట్ర పోలీస్‌లకు మెదటి స్థానం దక్కిందన్నారు. విదేశాల్లో పటిష్టమైన పోలీస్ వ్యవస్థ వున్నందున చదువుకునేందుకు తమ ఆడపిల్లను ఒంటరిగా పంపేందుకు తల్లిదండ్రులు సిద్ద పడుతున్నారని, మన రాష్ట్రంలో సైతం వరల్డ్‌క్రాస్ పోలీసింగ్ వ్యవస్థను రూపొందింస్తామన్నారు. తెలంగాణ పోలీస్‌ను ప్రపంచంలోనే గొప్ప పటిష్టమైన వ్యవస్థగా రూపుద్దితామన్నారు. తెలంగాణాలో నిర్భయంగా జీవిం చేందుకు కావల్సిన వాతావరణం కల్పిస్తామన్నారు.

‘83’ రద్దుకు అధికారుల అంగీకారం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయుల సెలవులను అనుమతించే అధికారాన్ని ప్రధానోపాధ్యాల నుంచి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంల ద్వారా ఎంఇఒలకు బదలాయిస్తూ ఇచ్చిన మెమో 83 ను రద్దు చేయడంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సానుకూలత వ్యక్తం చేశారని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.భుజంగరావు, జి. సదానందం గౌడ్ లు తెలిపారు. ఆప్షనల్ సెలవులను కూడా పూర్వ పద్ధతిలో అనుమతించాలని కోరగా అధికారులు సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

గ్రిడ్ నిర్వహణపై ఇఆర్‌సి సమీక్ష

మన తెలంగాణ /హైదరాబాద్: విద్యుత్ డిమాండ్, సరఫరాల మధ్య సమతూకం, గ్రిడ్ ఫ్రీక్వెన్సీని సరిగ్గా నిర్వహించాలని డిస్కంలకు విద్యుత్ నియంత్రణ కమిషన్ సూచనలు చేసింది. గ్రిడ్ కోడ్ నిర్వహణతో పాటు పలు సాంకేతిక విషయాల అమలుపై ఇఆర్‌సి సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. ఇఆర్‌సి చైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, సభ్యులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ విచారణలో టిఎస్ ఎస్‌పిడిసిఎల్ చైర్మన్ జి.రఘుమారెడ్డి, టిఎస్ ట్రాన్స్‌కో జెఎండి శ్రీనివాసరావు హాజరై తమ సాంకేతిక విషయాలను వివరించారు.

చౌటుపల్లి ఎత్తిపోతలకు రూ.14.7 కోట్ల నిధులు మంజూరు

మన తెలంగాణ/హైదరాబాద్: చౌటుపల్లి హనుమంతరెడ్డి ఎత్తిపోతల నిర్వహణకు ప్రభుత్వం రూ.14.7 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. రెండేళ్ల కాలానికి ఈ మొత్తం వినియోగించేలా ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి ఉత్తర్వులు జారీచేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి హరీశ్ రావు



మన తెలంగాణ / సిద్దిపేట/అక్కన్నపేట : రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతున్నామని, ప్రతి పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని భారీ నీటి పారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం గౌరవెల్లి, గుడాటిపల్లి ప్రాజెక్ట్ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 1.1 క్యూసెక్కుల నీరు నిల్వ చేసే ప్రాజెక్టు చేపట్టడం వల్ల గుడాటిపల్లి ప్రజలు కుటుంబాలకు లక్ష ఇరవై వేల ఎకరాలకు నీరు అందిస్తానని గత ప్రభుత్వం చెప్పిదని, కాని 1.1 క్యుసెక్కుల నిల్వ నీరు కేవలం పది వేల ఎకరాలు మాత్రమే సాగు అవుతుందన్నారు. సిఎం కెసిఆర్ ఆలోచన మేరకు నియోజకవర్గంలో రైతులు 2 పంటలు సాగు చేసుకునే విధంగా 8.7 క్యూసెక్కుల నీరు నిల్వ చేయడానికి, ప్రతిపక్ష నాయకులు అడ్డు వచ్చినా గౌరవెల్లి, గుడాటిపల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచుతూ పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. నియోజక వర్గంలో లక్ష ఇరవై వేల ఎకరాలకు నీరివ్వాలని ఉద్దేశ్యంతో గోదావరి నీటిని మిడ్ మానేరు ద్వారా 8.7 క్యూసెక్కుల నీరు నింపేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భూ నిర్వాసి తులకు 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. తొలుత భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ కార్యక్రమం వద్ద ధర్నా చేపట్టేందుకు వచ్చిన చాడ వెంకట్‌రెడ్డిని మంత్రి హరీశ్‌రావు తనతో పాటు వేదికపైకి తీసుకెళుతూ మీరు చెప్పిన విధంగానే పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో నియోజకవర్గం ఎంఎల్‌ఎ సతీష్ కుమార్, కలెక్టర్ వెంకట్ రామిరెడ్డి, ఆర్‌డిఓ భూక్య మంగ, టిఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


చేనేత కార్మికుల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం కృషి



మన తెలంగాణ/యాదాద్రి భువనగిరి : చేనేత కార్మికులను ఆర్థికంగా భలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర చేనేత జౌళిశాఖ సంచాలకులు శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని చేనేత సంఘాల ప్రతినిధులు చేనేత కార్మికులతో సమావేశమై చేనేత మగ్గాలకు జియోట్యాగింగ్‌పై సమీక్షించారు. మగ్గాలకు జియోట్యాగింగ్ చేపట్టడంతో త్రిఫ్ట్ పథకం, నూలు సబ్సిడీ, క్యాష్ క్రెడిట్ తదితర పథకాల ద్వారా ప్రభుత్వం చేనేత కార్మికులకు లబ్ధిచేకుర్చనున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటి వరకు పనిలో ఉన్న మగ్గాలను మాత్రమే సర్వే చేసి జియో ట్యాగింగ్ చేపట్టామని, గతంలో వలసవెళ్లిన వారు తిరిగి వచ్చినందున కొత్తకేసుల విషయంలో ప్రభుత్వం పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటుందని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ అనితారామచంద్రన్ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని గ్రామాలకు వెళ్లి ఇంకా జియోట్యాగింగ్ మగ్గాలకు చేపట్టవలసి ఉందన్నారు. జిల్లాకు రెగ్యులర్ సహాయ సంచాలకుని కేటాయించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా చేనేత జౌళిశాఖ ఉపసంచాలకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తుది మెరుగులు దిద్దుకుంటున్న 'కాలా'

ఈ ఏడాది సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. కాలా, 2.0 చిత్రాలు ఈ సంవత్సరం విడుదలకానున్నాయి. అయితే 2.0 సినిమా రిలీజ్ డేట్ విషయంలో ఇప్పటికీ సందిగ్ధత కొనసాగుతుండగా మరోపక్క రంజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కాలా' ఫస్ట్ కాపీ తుది మెరుగులు దిద్దుకుంటోంది. మార్చి రెండో వారంలో విడుదల చేసేందుకు ఈ చిత్రాన్ని సిద్ధం చేస్తానని దర్శకుడు రంజిత్... నిర్మాత ధనుష్‌కు చెప్పేశాడట. దీంతో '2.0'కంటే ముందే 'కాలా' విడుదలవుతుందన్న టాక్ కూడా మొదలైంది. అయితే రజనీకాంత్ రాజకీయ పార్టీని ప్రకటిస్తున్న సమయంలోనే '2.0' వస్తుందని అంతా అనుకున్నారు. కానీ లైకా సంస్థ నుంచి ఇప్పటివరకు సినిమా ఆడియో, ట్రైలర్, ఫస్ట్‌లుక్‌కు సంబంధించి ఎటువంటి ప్రకటన రావడం లేదు. దీంతో ఈ చిత్రం విడుదల ఏప్రిల్ చివరి వారంకు వాయిదా పడే అవకాశముందని సమాచారం. దీంతో ముందుగా 'కాలా' చిత్రాన్ని విడుదల చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక మాఫియా నేపథ్యంలో కొనసాగే చిత్రం 'కాలా'. ఒక మాఫియా డాన్ కథగా దీన్ని దర్శకుడు రంజిత్ తీర్చిదిద్దాడని తెలిసింది. 'భాషా' తర్వాత ఆ స్థాయిలో యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇందులో ఉంటుందట.





అల్లు అరవింద్, అనుష్క, అశోక్, వంశీ, ప్రమోద్, నాని, మారుతి, మేర్లపాక గాంధీ తదితరులు

ఫిలింనగర్ దైవ సన్నిధానం చైర్మన్‌గా డా.ఎం.మోహన్‌బాబు

హైదరాబాద్‌లోని ఫిలింనగర్ దైవ సన్నిధానం ఛైర్మన్‌గా డా.ఎం.మోహన్‌బాబు ప్రమాణ స్వీకారం చేశారు. విశాఖ శ్రీ శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పాలక మండలి కొత్త సభ్యులుగా 12 మంది పదవీ బాధ్యతలు స్వీకరించారు. దైవ సన్నిధానం ఛైర్మన్‌గా డా.మోహన్‌బాబు నియమితులు కాగా కమిటీ సభ్యులలో గిరిబాబు, పరుచూరి గోపాలకృష్ణ, కృష్ణంరాజు సతీమణి శ్యామల, చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ, చాముండేశ్వరినాథ్, వి.రామ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు. కార్యదర్శిగా కాజా సూర్యనారాయణ కొనసాగుతున్నారు. దైవ సన్నిధానం ప్రాంగణంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపి టి.సుబ్బరామిరెడ్డి, రాజమండ్రి ఎంపి మురళీమోహన్ పాల్గొన్నారు. పూర్ణకుంభ స్వాగతానంతరం... సంప్రదాయ, ఆచారాలతో వేద మంత్రోచ్చారణల నడుమ ఛైర్మన్‌గా డా.మోహన్‌బాబు, ఇతర సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వరూపానంద సరస్వతి మాట్లాడుతూ దైవ భక్తి, ఆధ్యాత్మిక చింతన మెండుగా ఉన్న మోహన్‌బాబు దైవ సన్నిధానం ఛైర్మన్‌గా పదవి చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ ''నేను ఎప్పుడూ గుడి ఛైర్మన్ కావాలని అనుకోలేదు. కానీ ఆ మహా శివుడు టి.సుబ్బరామిడ్డి స్వరూపంలో వచ్చి ఫిలింనగర్ దైవ సన్నిధానం ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించమన్నారు. మా సంస్థలు, చిత్రాలతో బిజీగా ఉన్న నేను ఈ అదనపు బాధ్యతను ఆనందంగా స్వీకరించాను. ఆడపడుచులు పూజలు చేస్తే మంచిందంటారు. సురేఖ, శ్యామలతో పాటు ఎంపికైన ఆడపడుచులకు నా అభినందనలు. దైవ సన్నిధానంలో ఉన్న 18 దేవాలయాల్లో కొలువైన దేవుళ్ల ఆశీస్సులతో మంచి కార్యక్రమాలను చేపడతాను. దేవుడి డబ్బు పైసా ముట్టుకోకుండా అవసరమైతే నా సొంత డబ్బులు ఖర్చుపెట్టయినా సరే దైవ సన్నిధానంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సంకల్పిస్తున్నాను'' అని చెప్పారు.

'అరుంధతి'లాగే భాగమతి పెద్ద హిట్ కావాలి

యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌లో అనుష్క టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఈనెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో అనుష్క మాట్లాడుతూ ''2012లో ఈ సినిమా కథ వినగానే నచ్చిందని చెప్పాను. అయితే డేట్స్ లేకపోవడంతో చేయలేనని చెప్పినా నా కోసం ఇప్పటివరకు ఎదురు చూశారు. నా హృదయానికి దగ్గరైన సినిమా ఇది. ఇది అనుష్క సినిమా మాత్రమేనని చెప్పను. ఉన్ని ముకుందన్, జయరాం, ఆశా శరత్, ప్రభాస్ శ్రీను, ధనరాజ్, విద్యుల్లేఖ, రవీందర్, తమన్ సహా అందరి సినిమా ఇది. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది''అని అన్నారు. చిత్ర దర్శకుడు అశోక్ మాట్లాడుతూ ''గెలవాలనుకున్నప్పుడు కష్టం మొదలవుతుంది. ఎలాగైనా గెలవాలనుకున్నప్పుడు మోసం మొదలవుతుంది. ఈ రెండు సమాంతరంగా నడుస్తుంటాయి. తను గెలుస్తూ తన చుట్టూ ఉన్న వారిని గెలిపిద్దామని ఎవరైనా ఆలోచిస్తే అతనితో దైవత్వం మొదలైనట్లే. ఆ దేవుడు ప్రభాస్. ఆయన ఈ కథ విని ఇక్కడి దాకా నడిపించారు. వంశీ, ప్రమోద్, విక్కీ త్రిమూర్తులు. వీళ్లలో ఒకరు నిర్ణయించడం, ఒకరు నడిపించడం, మరో వ్యక్తి సరిగ్గా నడపించడం చేశారు. చిన్న చిన్న విషయాలను కూడా పట్టించుకొని సినిమాను బిడ్డలా చూసుకున్నారు. వీరితో కలిసి ఐదేళ్లుగా ప్రయాణిస్తున్నాను. స్వీటీ అంటే అనుభూతి. తను ఒక శక్తి. అరుంధతిగా, రుద్రమదేవిలా కనిపించిన అనుష్క ఇప్పుడు భాగమతిగా వస్తున్నారు. ఈ సినిమా కోసం ఆమె ఎంతగానో కష్టపడ్డారు''అని చెప్పారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ ''ఈ సినిమా ట్రైలర్‌ను ఫుల్ స్క్రీన్‌పై చూస్తే కాస్త భయమేసింది. అనుష్కకు ఉన్న మంచి లక్షణం ఏమిటంటే చాలా ఓపికగా సినిమా చేస్తారు. అరుంధతి సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ఈ సినిమా కూడా అంతే పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాని, మారుతి, మేర్లపాక గాంధీ, రాధాకృష్ణ, ప్రభాస్ శ్రీను, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్వరూపానందేంద్ర సరస్వతి, డా.ఎం.మోహన్‌బాబు, టి.సుబ్బరామిరెడ్డి, మురళీమోహన్, పరుచూరి గోపాలకృష్ణ, గిరిబాబు, కృష్ణంరాజు సతీమణి శ్యామల, చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ తదితరులు

మరచిపోలేని, మాటల్లో చెప్పలేని అనుభవం



జయం రవి

జయం రవి, నివేదా పేతురాజ్ హీరోహీరోయిన్లుగా శక్తి సౌందర్ రాజన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'టిక్ టిక్ టిక్'. ఇండియన్ సినిమా చరిత్రలో తొలి అంతరిక్ష సినిమాగా ఈ చిత్రం తెరకెక్కడం విశేషం. త్వరలోనే ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు జయం రవి హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటిస్తూ చెప్పిన విశేషాలు...

తొలి స్పేస్ ఫిల్మ్...

ఇండియాలో తొలి స్పేస్ ఫిల్మ్ 'టిక్ టిక్ టిక్'. తప్పకుండా భారతదేశ సినిమా చరిత్రలో ఇదొక మరచిపోలేని చిత్రంగా నిలిచిపోతుంది. ఇక దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ ఓ రోజు నా దగ్గరకు వచ్చి తనవద్ద ఒక కొత్త కథ ఉందని అన్నారు. అదొక స్పేస్ ఫిల్మ్ అని చెప్పేదాకా నేను ఊహించలేకపోయాను. దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు.

విజువల్ వండర్‌గా...

సినిమా కథ విషయానికొస్తే... ఇండియాకు ఒక ప్రమాదం వస్తుంది. దాన్ని తప్పించడానికి ఒక డిఫెన్స్ స్పేస్ డివిజన్ ప్రయత్నిస్తుంది. ఆ ప్రమాదం ఏమిటి? దాని నుండి దేశాన్ని ఎలా కాపాడారు? అనేదే ఈ సినిమా. స్క్రీన్‌పైన ఈ సినిమా చూస్తే విజువల్ వండర్‌గా ఉంటుంది.

మైలురాయిగా నిలిచే...

డిఫెన్స్ స్పేస్ డివిజన్‌లో పనిచేసే ముఖ్యమైన వ్యక్తిగా సినిమాలో కనిపిస్తాను. ఎలాంటి క్లిష్టమైన పరిస్థితి నుండి అయినా బయటపడగలిగే క్యారెక్టర్ నాది. నా కెరీర్‌లో మైలురాయిగా నిలిచే పాత్ర ఇది.

వాటి కన్నా గొప్పగా...

ఈ సినిమా హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోదు. కొన్ని సన్నివేశాలు అయితే హాలీవుడ్ సీన్ల కన్నా గొప్పగా ఉంటాయని చెప్పగలను. ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతిని కలిగించే చిత్రమిది. ఇక ఇంటర్వెల్‌కు 20 నిముషాల ముందే స్పేస్ ఎపిసోడ్స్ మొదలవుతాయి. 80 శాతం సినిమా స్పేస్‌లోనే ఉంటుంది.

వెంటనే ఒప్పేసుకున్నాడు...

ఈ సినిమాలో మా అబ్బాయి ఒక క్యారెక్టర్ చేశాడు. నటిస్తావా అని అడగగానే వెంటనే ఒప్పేసుకున్నాడు. నా కొడుకుతో కలిసి నటించడం మరచిపోలేని, మాటల్లో చెప్పలేని అనుభవం.

200 మంది ఐదు నెలల పాటు...

ఈ సినిమా కోసం దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ ఎక్కువ కష్టపడ్డారు. ఆయన విజన్‌ను బట్టే సినిమా ఉంటుంది. ఇక గ్రాఫిక్స్ విషయానికొస్తే అజాక్స్ మీడియా ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దింది. దాదాపు 200 మంది ఐదు నెలల పాటు పనిచేశారు. షూటింగ్‌లో స్పేస్ షాట్స్ తీయడానికి బాగా కష్టపడాల్సి వచ్చింది.

కామెడీ లేని సినిమా లేదు

విష్ణు మంచు హీరోగా జి.నాగేశ్వర రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆచారి అమెరికా యాత్ర'. పద్మజ పిక్చర్స్ బ్యానర్‌పై కీర్తి చౌదరి, కిట్టు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జి.నాగేశ్వర రెడ్డితో ఇంటర్వ్యూ...



జి.నాగేశ్వరరెడ్డి

నవ్వుల యాత్ర...

'ఆచారి అమెరికా యాత్ర' పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రం ఒక నవ్వుల యాత్ర. ఒక మంచి కథను వినోదాత్మకంగా తెరకెక్కించాము. తాత సెంటిమెంట్‌తో సాగుతుంది. తాత క్యారెక్టర్‌లో కోట శ్రీనివాసరావు, మనవరాలిగా ప్రజ్ఞ జైస్వాల్ నటించారు. ప్రమాదంలో ఉన్న వాళ్లను ఒక బ్రాహ్మణుల బృందం అమెరికా వెళ్లి ఎలా కాపాడిందనేది ఈ చిత్రం. వాళ్లను రక్షించేందుకు బ్రాహ్మణులు ఎన్ని తిప్పలు పడ్డారనేదే ఈ సినిమా.

సినిమా కోసమే రాసిన కథ...

మల్లాది వెంకటకృష్ణమూర్తి నవల కాదు ఇది. ఆయన ప్రత్యేకంగా సినిమా కోసం రాసిన కథ ఇది. ఈ కథ నచ్చి సినిమా తీశాం. బ్రాహ్మణులు అమ్మాయిని కాపాడడమనే కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. విష్ణుకు కూడా కథ నచ్చింది. మల్లాది కృష్ణమూర్తి ఈ టైటిల్‌తోనే కథ రాశారు. 3, 4 సంవత్సరాల క్రితం ఆయన ఈ కథ రాయడం జరిగింది.

చాలా జాగ్రత్తగా చేశాం...

'దేనికైనా రెడీ' సినిమా విషయంలో అనుకోకుండా వివాదం జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని చాలా జాగ్రత్తగా ఈ సినిమా చేశాం. సినిమా చూసి బ్రాహ్మణులు కూడా సంతోషపడతారు.

దానికంటే బెస్ట్...

ముందుగా వేరే కథతో సినిమా చేద్దామని అనుకున్నాను. కానీ నిర్మాతలు ఈ కథతో సినిమా చేద్దామని అన్నారు. ఈ కథ ఓకే అయిన తర్వాత విష్ణు, బ్రహ్మానందంతోనే ఈ సినిమా చేద్దామని నేను, నిర్మాతలు అనుకున్నాం. పృథ్వీ, గీతాసింగ్ సహా అందరినీ పాత్రలకు అనుగుణంగా తీసుకున్నాం. ఇక మొదటి నుంచి విష్ణుతో నా కామెడీ కెమిస్ట్రీ బాగుంటుంది. 'దేనికైనా రెడీ' కంటే ఇది మంచి కామెడీ ఎంటర్‌టైనర్.

రెండు నెలలు ఆలస్యం...

విష్ణుకు యాక్సిడెంట్ కావడం వల్ల రెండు నెలలు సినిమా ఆలస్యమైంది. ఇక ఈ సినిమాకు భారీగా ఖర్చుపెట్టారు నిర్మాతలు. అలాగే మంచి బిజినెస్ కూడా జరిగింది.

ఏ జోనర్ సినిమాలోనైనా...

సినిమా పుట్టిన దగ్గరి నుంచి కామెడీ లేని సినిమా లేదు. యాక్షన్, హారర్, లవ్‌స్టోరీ... ఇలా ఏ జోనర్ సినిమాలోనైనా కామెడీ ఉంటుంది. ఇక రాజేంద్ర ప్రసాద్ వచ్చిన తర్వాత కామెడీ ఓరియెంటెడ్ సినిమాలు వచ్చాయి. ఆతర్వాత అల్లరి నరేష్ ఆ పరంపరను కొనసాగిస్తున్నాడు.

గొప్పగా భావిస్తున్నా...

కామెడీ సినిమాల్లో జంధ్యాల స్టైల్ వేరు, ఈవివి స్టైల్ వేరు. ఒక్కొక్కరు తమదైన శైలిలో కామెడీ ఎంటర్‌టైనర్‌లను రూపొందించి ప్రేక్షకులను అలరించారు. ఇక కామెడీ సినిమాల డైరెక్టర్‌గా నాకు పేరు రావడం గొప్పగా భావిస్తున్నాను.

తదుపరి చిత్రం విష్ణుతోనే...

నా నెక్స్ట్ మూవీ కూడా విష్ణుతోనే ఉంటుంది. విష్ణుకు ఈ సినిమా కథ చెప్పగానే నచ్చింది. ఇందులో కూడా కామెడీ ఉంటుంది. కామెడీ లేనిదే నేను సినిమా చేయను. ఇక అవకాశం వస్తే స్టార్ హీరోలతో కూడా సినిమా చేస్తా.

నాకు పెద్దగా లక్ష్యాలేమీ లేవు



రకుల్‌ప్రీత్ సింగ్

నేటి తరం హీరోయిన్లు గ్లామర్ షోను మినహాయించి నటనకు పెద్దగా ప్రాధాన్యతనివ్వడం లేదు. రెమ్యునరేషన్‌లో బంపర్ ఆఫర్ ఇస్తే హీరో ఎవరన్నది కూడా పట్టించుకోకుండా స్టార్ హీరోయిన్లు కూడా ఐటమ్‌సాంగ్స్‌లో మెరుపులు మెరిపిస్తున్నారు. కానీ వీళ్లు చెప్పే మాటలు మాత్రం మరోలా ఉంటాయి. చిరకాలం నిలిచిపోయే పాత్రలు చేసేసి... తమలోని నటిని బయటకు తీసుకురావాలని ఉన్నా... అలాంటి గొప్ప ఆఫర్లు రావడం లేదని అంటూ ఉంటారు భామలు. పంజాబీ బ్యూటీ రకుల్‌ప్రీత్ సింగ్ మాత్రం తను అందరిలాంటిదాన్ని కాదని అంటోంది. ''నాకు కుంటి సాకులు చెప్పడం రాదు. నేనో పెద్ద నటినని నిరూపించుకునేందుకు ఇండస్ట్రీలోకి రాలేదు. నాకంటే హేమాహేమీలు బోలెడు మంది ఇక్కడ ఉన్నారు. ఇక్కడ ఉన్నంతసేపు అందంగా కనిపించాలి. ఈ రోల్‌ను రకుల్ చెడగొట్టలేదు అనిపించుకుంటే చాలు''అని చెప్పింది రకుల్. తనకు పెద్దగా లక్ష్యాలేం లేవని... పాత్రను చెడగొట్టదు అన్న పేరువస్తే చాలని అంటోంది ఈ భామ.

సినిమా, సమాజం ఎప్పుడూ వేర్వేరు కాదు



శివాజీ రాజా

టిఎస్‌ఆర్ కాకతీయ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'కాకతీయ కళా వైభవ మహోత్సవం'లో భాగంగా మోహన్‌బాబుకు 'విశ్వ నట సార్వభౌమ' బిరుదును ప్రధానం చేసి టి.సుబ్బరామిరెడ్డి ఆయనను ఘనంగా సత్కరించిన విషయం తెలిసిందే. అయితే సినిమా నటీనటులను సత్కరించకూడదని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ పాపారావు తాజాగా హెచ్చరిస్తూ మాట్లాడటం విచారకరమని 'మా' అధ్యక్షుడు శివాజీరాజా తెలిపారు. శివాజీరాజా మాట్లాడుతూ ''టి.సుబ్బరామిరెడ్డి 40 సంవత్సరాలుగా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలను జరుపుతూ కళలను ప్రోత్సహిస్తూ, కళాకారులను సన్మానిస్తూ కళల పట్ల, సంస్కృతి పట్ల తనదైన గౌరవాన్ని చాటుకుంటూ వస్తున్నారు. ఆయన నిర్వహించిన 'కాకతీయ కళా వైభవ మహోత్సవం'లో మోహన్‌బాబును సన్మానించడంతో సినిమా నటీనటులను సత్కరించకూడదని పాపారావు మాట్లాడటం బాధాకరం. సినిమా, సమాజం ఎప్పుడూ వేరువేరు కాదు. ప్రజలతో మమేకమైన కళ సినిమా. సినిమా కళాకారులు మొదటి నుండి ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ సహాయమందించడం తెలియని విషయం కాదు. టి.సుబ్బరామిరెడ్డి రాబోయే రోజుల్లో ఎన్నో వైవిధ్యమైన కార్యక్రమాలను చేయనున్నారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తెలుగు భాషకు మరింత గౌరవాన్ని తెచ్చే విధంగా 'ప్రపంచ తెలుగు మహాసభలు' జరిపించారు. కళకు సరిహద్దులు, భాషా బేధం లేదు అన్న రీతిలో ఈ మహా సభలకు తెలుగు సినీ నటీనటులను ఆహ్వానించి ఎంతో ఘనంగా సన్మానించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చిత్ర పరిశ్రమ పట్ల, నటీనటుల పట్ల తనదైన స్నేహభావాన్ని ప్రదర్శిస్తూ ఏ సహాయానికైనా వెనుకాడకుండా ఆదరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పాపారావు 'సినిమా నటీనటులను సన్మానించకూడదు' అని హెచ్చరించడం ఎంత వరకు సబబు అన్నది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. ఇలాంటి వ్యాఖ్యలను ప్రభుత్వం కూడా సమర్థించదని అనుకుంటున్నాం''అని అన్నారు.

ఒక్కటైన భావన, నవీన్



హీరోయిన్ భావన్, నిర్మాత నవీన్‌ల వివాహం సోమవారం ఉదయం కేరళలోని త్రిసూర్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కొద్దిమంది సన్నిహితులు, బంధుమిత్రులు హాజరయ్యారు. భావన హీరోయిన్ గా నటించిన ఓ సినిమాను నవీన్ నిర్మించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డ ఈ జంట పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. భావన తెలుగులో మహాత్మా, ఒంటరి లాంటి సినిమాలతో అలరించింది.

'ఇంటిలిజెంట్' ఫస్ట్‌లుక్

వి.వి.వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదలకానుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇక వినాయక్ అంటేనే ఫక్తు కమర్షియల్ సినిమాలకు పెట్టింది పేరు. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో కొత్తగా వస్తున్నాడు సాయిధరమ్‌తేజ్. ఈ చిత్రానికి తమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. గత ఏడాది వచ్చిన సాయిధరమ్‌తేజ్ చిత్రాలు విన్నర్, జవాన్‌లకు కూడా తమనే మ్యూజిక్ ఇచ్చాడు. లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా చేస్తున్న ఈ చిత్రంలో నాజర్, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే, రాహుల్ దేవ్, దేవ్ గిల్, పృథ్వీ, తనికెళ్ల భరణి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సి.కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ఎస్.వి.విశ్వేశ్వర్, ఎడిటింగ్ః గౌతమ్ రాజు, ఆర్ట్ః బ్రహ్మ కడలి, ఫైట్స్ః వెంకట్, డ్యాన్స్ః శేఖర్, జాని.



సాయిధరమ్‌తేజ్



స్పైస్‌జెట్ 'రిపబ్లిక్ డే' ఆఫర్

న్యూఢిల్లీ: ప్రైవేటు విమానయాన సంస్థ స్పైస్‌జెట్ రిపబ్లిక్ డే ఆఫర్ ప్రకటించింది. ఎంపిక చేసిన మార్గాల్లో ప్రారంభ టికెట్ ధర రూ.769 పరిమితికాలానికి ఈ ఆఫర్‌ను అందిస్తోంది. 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్' పేరుతో దేశీయ, అంతర్జాతీయ ప్ర యాణాలకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. దేశీయ ప్రయాణాల్లో టికెట్ ప్రారంభ ధర రూ.769 ఉండగా, అంతర్జాతీయ ప్రయాణాల్లో టికెట్ ప్రారంభ ధర రూ. 2.469 ఉంది. ఈ ఆఫర్ కింద టికెట్ బుకింగ్స్ ఈనెల 22 నుంచి 25 వరకు వుంటాయి. ఈ ఆఫర్ ద్వారా టికెట్లు పొందిన వారు ఈ ఏడాది డిసెంబరు 12 వరకు ప్రయాణం చేయవచ్చు. జమ్ము–శ్రీనగర్, సిల్చార్– గువహటి, డెహ్రాడూన్– ఢిల్లీ, ఢిల్లీ–జైపూర్, అగర్తల–గువహటి, కోయంబత్తూర్–బెంగళూరు, కొచ్చి–బెంగళూరు, ఢిల్లీ–డెహ్రాడూన్ తదితర మార్గాల్లో టికెట్ ప్రారంభ ధర రూ.769 ఉందని స్పైస్‌జెట్ వెల్లడించింది. అలాగే అంతర్జాతీయ నెట్‌వర్క్‌లో చెన్నై కొలం బో మార్గానికి టికెట్ ప్రారంభ ధర రూ.2,249 ఉందని కంపెనీ వెల్లడించింది.

మన తెలంగాణ
9
హైదరాబాద్
మంగళవారం
23, జనవరి 2018
www.manatelangana.news

కొత్త యాప్ 'పేటీఎం ఫర్ బిజినెస్'

న్యూఢిల్లీ: ప్రముఖ డిజిటల్ పేమెంట్స్ సంస్థ పేటీఎం సరికొత్త యాప్ 'పే టీఎం ఫర్ బిజినెస్'ను లాంచ్ చేసింది. చిన్న, మధ్య తరహా వ్యాపారస్థుల కోసం ఈ యాప్‌ను రూపొందించినట్టు వెల్లడించింది. అండ్రాయిడ్ డివైజ్‌ల కోసం రూపొందించిన ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంటుందని, దీనిని డౌన్‌లోడ్ చేసు కొని వ్యాపారస్థులు లాగిన్ అవ్వాలని, వారికి పేటీఎం క్యూఆర్ కోడ్ వస్తుందని కంపెనీ వెల్లడించింది. దీని ద్వారా వారు డిజిటల్ పేమెంట్లను స్వీకరించవచ్చని పేటిఎం వివరించింది. తమ 'పేటీఎం ఫర్ బిజినెస్' యాప్ మరో ముందడుగు, దీని ద్వారా రోజు వారీ వ్యాపార కార్యకలా పాలను మరింత సులభంగా నిర్వహించుకోవచ్చని కంపెనీ సిఇఒ కిరణ్ వాసిరెడి అన్నారు. పది ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉండే ఈ యాప్ ద్వారా వ్యాపారస్థులు అపరిమిత పేమెంట్లను ఎలాంటి రుసు ములు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా నిర్వహించుకోవచ్చు. ఇంకా అనేక సదుపాయాలను యాప్ ద్వారా పేటిఎం కల్పిస్తోంది. ఇంకా వ్యాపారులకు శిక్షణ, జాగృతి కార్యక్రమాల కోసం పేటిఎం సుమారు రూ.500 కోట్లు పెట్టుబడులు పెడుతోంది.

రూ.30 వేలు దాటిన బంగారం ధర



ముంబై: అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, దేశీయంగా కొనుగోళ్లు పెరగడంతో బంగారం ధర పైపైకి ఎగబాకుతోంది. సోమవారం పది గ్రాముల పసిడి ధర రూ.225 పెరిగి రూ. 31,075కు చేరింది. పెళ్లిళ్ల సీజన్ దగ్గర పడుతుండటంతో స్థానిక నగల వ్యాపారుల నుంచి బంగారానికి డిమాండ్ పెరిగి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో 10 గ్రాముల పసిడి ధర రూ.31వేల మార్క్‌ను దాటింది. మరోవైపు వెండి స్థిరంగా కొనసాగుతోంది. పారిశ్రామిక వర్గాల నుంచి కొత్తగా కొనుగోళ్లు లేకపోవడంతో బులియన్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.39,900గా నమోదైంది. అంతర్జాతీయంగానూ 0.06 శాతం పెరిగి సింగపూర్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1,331.40 అమెరికన్ డాలర్లుగా ఉంది. దేశ రాజధానిలో 9.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కల్గిన బంగారం(10 గ్రాములు) ధర రూ.225 పెరిగి వరుసగా రూ.31,075, రూ.30,925కు చేరింది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	35798.01	286.43	0.81%
నిఫ్టీ	10966.20	71.50	0.66%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28780	30780.75	–0.21%
ముంబై	29510	31561.50	0%
ఢిల్లీ	29100	31122.99	0.52%
కోల్‌కతా	29490	31540.11	0%
కేరళ	27850	29786.10	0%
బెంగళూరు	28230	30192.51	0%
హైదరాబాద్	28780	30780.75	0.21%
గల్ఫ్	1416.53	1515.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	42000.00	42000.00	0.00
ముంబై	42000.00	42000.00	0.00
ఢిల్లీ	42000.00	42000.00	0.00
కోల్‌కతా	42000.00	42000.00	0.00
హైదరాబాద్	42000.00	42000.00	0.00



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	412
వరంగల్	404	చిత్తూరు	403
విజయవాడ	412	చెన్నై	410
గోదావరి	412	బెంగళూరు	408

2018లో భారత్ జిడిపి 7.4%

- జిఎస్‌టి, డీమానిటైజేషన్‌తో 2017లో మందగింపు
- చైనా వృద్ధి రేటు 6.8 శాతం : ఐఎంఎఫ్ అంచనా

వాషింగ్టన్/ దావోస్ : 2018 సంవత్సరంలో భారత్ జిడిపి వృద్ధి రేటు 7.4 శాతం ఉంటుందని ఐఎంఎఫ్(అంతర్జాతీయ ద్రవ్య నిధి) అంచనా వేసింది. డీమానిటైజేషన్(నోట్ల రద్దు), జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) కారణంగా గత ఏడాదిలో వృద్ధి మందగించినప్పటికీ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ముందుందని వెల్లడించింది. దావోస్‌లో డబ్ల్యుఇఎఫ్(వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్) సదస్సుకు ముందు ప్రపంచ ఆర్థిక దృక్పథంపై సోమవారం ఐఎంఎఫ్ నివేదిక విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదల చేసిన నివేదికలో భారత్ జిడిపి వృద్ధి రేటు 2018లో 7.4 శాతం, 2019 7.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇదే సమయంలో చైనా వృద్ధి రేటు 2018లో 6.8 శాతం, 2019లో 6.4 శాతంగా ఉంటుందని పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న ఆసియా వృద్ధి 2018–19లో 6.5 శాతంగా ఉండనుందని, 2017లో ఇదే రీతిలో వృద్ధి ఉందని ఐఎంఎఫ్ వెల్లడించింది. చైనాలో వృద్ధి రేటు స్వల్పంగా ఉండనుందని, అదే సమయంలో భారత్ వేగంగా పుంజుకోనుందని, మిగతా దేశాలు నిలకడగా వృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఐఎంఎఫ్ నివేదిక వివరించింది. 2017లో చైనా జిడిపి వృద్ధి రేటు 6.8 శాతంగా ఉండగా, భారత్ 6.7 జిడిపితో ఉందని, భారత్ వేగంగా పుంజుకుంటోందని నివేదిక తెలిపింది. 2016లో భారత్ జిడిపి వృద్ధి రేటు 7.1 శాతం ఉండగా, 2017లో మందగించిందని, దీనికి కారణం.. నోట్ల రద్దు, జిఎస్‌టి చట్టాలను అమలు చేయడమేనని ఐఎంఎఫ్ వివరించింది. ఐఎంఎఫ్ ఎకనమిక్ కౌన్సిలర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ మారిస్ అబ్స్‌ఫెల్డ్ ప్రకారం, భారత్, చైనా దేశాలు నెమ్మదిగా వృద్ధి బాటన పయనిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం భారత్‌లో మందగమనం తాత్కాలికమేనని, ఆ తర్వాత వృద్ధిలో భారత్ అగ్రస్థానంలో ఉండనుందని ఐఎంఎఫ్ ప్రతినిధి అన్నారు.



భారత్ విక్రేతగానే కాదు.. రాజనీతిజ్ఞుడిగా

కోటక్ మహీంద్రా బ్యాంక్ సిఎండి ఉదయ్ కోటక్



భారత ప్రధాని నరేంద్ర మోడీ విజన్ గురించి విని తెలుసుకునేందుకు ప్రపంచ నేలతలు వేచిచూస్తున్నారని, తద్వారా భారత్‌తో అంతర్జాతీయంగా సత్సంబంధాలను పెంపొందించుకోగలదని కోటక్ మహీంద్రా బ్యాంక్ సిఎండి ఉదయ్ కోటక్ పేర్కొన్నారు. ఇక్కడ దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌కు హాజరైన ఆయన భారత్‌ను విక్రేతగానే కాదు.. రాజనీతిజ్ఞుడిగా చూపాలని అన్నారు. భారత్ గురించి తెలియజేయడం ద్వారా అంతర్జాతీయంగా ప్రాధాన్యత పెరగనుందని అన్నారు. దావోస్‌లో భారత్ గొప్ప స్టోరీని చేప్పనుందని, ఇది చెప్పడానికి ప్రధాని నరేంద్ర మోడీ కంటే గొప్పవాళ్లెవరు ఉంటారని అన్నారు.

ద్వితీయార్థంలో 7 శాతానికి జిడిపి

ఐసిఐసిఐ బ్యాంక్ సిఇఒ చందా కొచ్చర్



భారత్ ఆర్థిక వ్యవస్థ అన్నింటా అభివృద్ధిని సాధిస్తోందని దావోస్ ఐసిఐసిఐ బ్యాంక్ సిఇఒ చందా కొచ్చర్ అన్నారు. అన్ని రంగాల్లో వృద్ధి పథాన భారత్ ముందుకు సాగుతోందని, 2018 ద్వితీయార్థంలో భారత్ 7 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2017–18 ఆర్థిక సంవత్సరానికి మొత్తంగా భారత్ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండనుందని దావోస్‌లో డబ్ల్యుఇఎఫ్ (వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్) సదస్సుకు హాజరైన ఆమె ఓ ఇంటర్వ్యూలో అన్నారు. భారత్ విశాలమైన వృద్ధి నమోదవుతోందని, అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని చూస్తున్నామని అన్నారు. వృద్ధి రేటు మందగిస్తోందనే ఆందోళనలను ఆమె కొట్టిపారేశారు. సిఎస్‌ఒ అంచనా ప్రకారం, మార్చి 31 ముగింపు నాటి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ జిడిపి 6.5 శాతంగా ఉందని, జివిఎ(గ్రాస్ వాల్యూ యాడ్) వృద్ధి 6.1 శాతంగా ఉందని అన్నారు.

ఈ ఏడాది మెరుగవుతుంది..

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



2018 సంవత్సరం భారత్ మరింత వృద్ధిని అందివ్వనుందని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. ఈ సంవత్సరం పునర్నిర్మాణ, వృద్ధి దిశగా భారత్ కలిసొస్తుందని అన్నారు. 2017లో భారత్‌లో ఎన్నో సంస్కరణలు చేపట్టారని, వాటి ఫలితాలు రానున్న రోజుల్లో కనిపించనుందని అన్నా రు. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సుకు హాజరైన ఆయన ఈవిధంగా వ్యాఖ్యానించారు.

యాక్సిస్ బ్యాంక్ లాభం 25% వృద్ధి

నికర లాభం రూ.726 కోట్లు నమోదు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాల్లో యాక్సిస్ బ్యాంక్ రాణించింది. బ్యాంక్ నికర లాభం 25 శాతం పెరిగింది. గతేడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.579 కోట్లతో పోల్చితే.. నికర రూ.726 కోట్లుగా నమోదయినట్లు బ్యాంక్ వెల్లడించింది. మొత్తం ఆదాయం రూ. 14, 501. 21 కోట్ల నుంచి రూ.14,314.6 కోట్లతో క్షీణించింది. నికర వడ్డీ ఆదా యం 9 శాతం పెరిగి రూ.4730 కోట్లకు చేరుకుంది. ఏడాది–ఏడాది ఆధారం గా చూస్తే రూ.4,20,923 కోట్లతో 21 శాతం పెరిగింది. అలాగే రిటైల్ రుణాలు రూ.1, 93,296 కోట్లతో 29 శాతం పెరిగాయి. బ్యాంక్ స్థూల ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) గతేడాదిలో 5.22 శాతం నుంచి 5.28 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పిఎ 2.18 శాతం పోలిస్తే 2.56 శాతానికి చేరింది. 2017 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ (ఏడాది–ఏడాది) రూ.6,43,938 కోట్లతో 11 శాతం వృద్ధిని సాధించింది. ఆర్థిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండడంతో ట్రేడింగ్‌లో యాక్సిస్ బ్యాంక్ షేర్ ధర 3.57 శాతం పెరిగి రూ. 611.30 కు చేరింది.

కొనసాగుతున్న బుల్ పరుగు..



ముంబై: సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు రోజుకో సరి కొత్త రికార్డులతో దూసుకెళ్తున్నా యి. విదేశీ నిధుల ప్రవా హం స్థిరంగా కొనసాగడం, దేశీయ ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్లు వెరసి వరుసగా నాలుగో సెషన్‌లో స్టాక్‌మార్కెట్ భారీ లాభాలను నమోదు చేసింది. బ్యాం కింగ్ షేర్ల అండతో గతవారం భారీ లాభాలను ఆర్జించిన దేశీయ మార్కెట్లు ఈ వారం కూడా అదే ఉత్సాహాన్ని కొనసాగించాయి. కొనుగోళ్ల మద్దతుతో ట్రేడింగ్ ఆద్యంతం జోరుగా సాగిన సూచీలు కొత్త శిఖరాలను చేరుకున్నాయి. సెన్సెక్స్ జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరగా, నిఫ్టీ 11వేల మైలు రాయికి 34 పాయింట్ల దూరంలో నిలిచిపోయింది. వచ్చే 1నప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై సానుకూలంగా ఉన్న మదుపర్లు కొనుగోళ్ల వైపు మొగ్గు చూపారు. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 286 పాయింట్లు ఎగబాకి 35,798 వద్ద ముగిసింది. నిఫ్టీ 71 పాయింట్లు లాభపడి 10,966 వద్ద స్థిరపడ్డాయి. ఎన్‌ఎస్‌ఇలో టిసిఎస్, రిలయన్స్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, ఒఎన్‌జిసి, యాక్సిస్ బ్యాంకు షేర్లు లాభపడ్డాయి. హిందుస్థాన్ పెట్రోలియం, గెయిల్, విప్రో, హెచ్‌డిఎఫ్‌సి, భారత్ పెట్రోలియం షేర్లు నష్టపోయాయి.

బ్యాంకుల మొండి బకాయిలు 9.5 లక్షల కోట్లు

- 2018 మార్చినాటికి పెరగనున్న ఎన్‌పిఎ
- అసోచామ్–క్రిసిల్ సంయుక్త సర్వే



న్యూఢిల్లీ : మార్చి నాటికి భారతీయ బ్యాంకుల్లో స్థూల ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) రూ.9.5 లక్షల కోట్లకు పెరగనున్నాయని సర్వేలో వెల్లడైంది. బ్యాంకుల మొండి బకాయిలు మరింతగా పెరగనున్నాయని అసోచామ్–క్రిసిల్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం తెలిపింది. 2016 మార్చి నాటికి బ్యాంకుల మొండి బకాయిలు రూ.8 లక్షల కోట్లుగా ఉండగా, ఇప్పుడు అగి రూ.1.5 లక్షల కోట్లు పెరిగి రూ.9.5 కోట్లకు పెరగనుందని నివేదిక వివరించింది. రుణాలు ఎగవేసిన సదరు కంపెనీ యాజమాన్య హక్కులను బదాలయించుకునే అవకాశం బ్యాంకులకు లభిస్తోంది. అయితే రుణాల్లో చాలా వరకు ఎన్‌పిఎ రూపంలో ఉంటే బ్యాంకుల మూలధనంపై ఒత్తిడి పెరుగుతోంది. మార్చి 2018 నాటికి మొత్తం రుణాల్లో 10.5 శాతం ఎన్‌పిఎలు ఉన్నాయి. వీటికి ఎన్‌పిఎలుగా మారడానికి సిద్ధంగా ఉన్న ఆస్తులను కూడా కలిపితే రూ.11.5 లక్షల కోట్లకు చేరతాయి. ఒత్తిడిలో ఉన్న ఆస్తులను వేలంలో విక్రయిస్తే తక్కువ మొత్తానికి అమ్ముడు పోతాయనే భయం బ్యాంకుల్లో ఉంది. అలా జరిగితే ఆ నష్టం బ్యాంకులపై పడుతుంది. ఫలితంగా మూలధన అవసరాలు మరింత పెరిగిపోతాయి. ఈ నేపథ్యంలో ఆ సంస్థల్లోకి కొత్త పెట్టుబడిదారుల్ని తీసుకురావడం, మరిన్ని నిధులను వెచ్చించి వ్యాపారాలను అభివృద్ధి చేయాలి. అలా చేస్తేనే తప్ప తప్ప బ్యాంకులకు రుణ నిధులు తిరిగి వచ్చే పరిస్థితి లేదు. రుణాలు ఎగ్గొట్టిన కంపెనీలను బ్యాంకులు గాడినపెట్టి వ్యాపారం చేసుకొని లాభాలు పొంది రుణాలు చెల్లు వేసుకోవాలి. ప్రస్తుతం మొత్తం మొండి బకాయిలలో 40శాతం వాటా ఉన్న 50 కంపెనీలు కేవలం మూడు ప్రధాన రంగాలకు చెందినవి. మొత్తం మొండి బకాయిల్లో లోహ రంగంలోని కంపెనీలు 30శాతం, నిర్మాణ రంగంలోనివి 25శాతం, విద్యుత్ రంగంలోనివి 15శాతం ఉన్నాయి. మిగిలిన రంగాల నుంచి 30శాతం ఉన్నాయి. దివాల చట్టం సంస్కరణలను సమర్థంగా వినియోగించుకుంటేనే బ్యాంకులకు రుణ రాబడి పెరుగుతుంది. ఒత్తిడిలో ఉన్న ఆస్తుల నుంచి రుణాలు రాబట్టుకోవడానికి 2018 బడ్జెట్‌లో బ్యాంకులకు మరిన్ని అధికారాలు ఇస్తారని నిపుణులు భావిస్తున్నారు. మూలధన విలువ తగ్గిపోవడంతో స్టేట్ బ్యాంక్ గ్రూప్‌లోని 19 బ్యాంకుల్లో ఎస్‌బిఐ మినహా 10 బ్యాంకులు ఆర్‌బిఐ ప్రొగ్రెసివ్ కరెక్టివ్ యాక్షన్‌ను (పిసిఎ)ను ఎదుర్కొంటున్నాయి. నిర్దేశించిన మూలధన విలువ కన్నా తక్కువ ఉన్న బ్యాంకుకు ఆర్‌బిఐ విధించే అపరాధ రుసుమును పిసిఎ అంటారు. 2018 బడ్జెట్‌లో దివాల చట్టానికి మరింత పదును పెట్టాలని బ్యాంకింగ్ రంగ నిపుణులు కోరుకుంటున్నారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్ఠం	కనిష్ఠం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
టిసిఎస్	3,134.70	2,922.00	3,116.40	2,959.30	157.10	5.31
రిలయన్స్	974.30	940.00	971.50	931.30	40.20	4.32
ఇండియాబుల్స్	1,363.70	1,300.00	1,355.15	1,301.80	53.35	4.10
ఒఎన్‌జిసి	205.95	198.00	200.70	193.70	7.00	3.61
యాక్సిస్ బ్యాంక్	621.75	583.15	611.55	590.25	21.30	3.61
టెక్ మహీంద్రా	572.40	549.70	569.50	552.90	16.60	3.00
బజాజ్ ఆటో	3,283.00	3,200.00	3,274.50	3,210.40	64.10	2.00
లార్సెన్	1,403.65	1,289.20	1,398.85	1,371.45	27.40	2.00
ఎస్ బ్యాంక్	358.25	348.75	355.35	349.35	6.00	1.72
జీ ఎంటర్‌టై	616.70	598.00	608.85	600.35	8.50	1.42

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్ఠం	కనిష్ఠం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
హెచ్‌పిసిఎల్	414.65	398.35	401.80	416.20	14.40	3.46
గెయిల్	471.65	451.10	457.40	468.75	11.35	2.42
విప్రో	328.95	317.00	321.55	328.95	7.40	2.25
బిపిసిఎల్	480.05	465.25	469.15	477.30	8.15	1.71
హెచ్‌డిఎఫ్‌సి	1,924.35	1,863.95	1,872.00	1,901.25	29.25	1.54
భారతి ఎయిర్‌టెల్	498.50	488.00	490.70	497.90	7.20	1.45
వేదాంత	332.70	324.50	326.95	331.65	4.70	1.42
ఐచర్ మోటార్స్	28,097.75	27,590.00	27,649.80	28,009.45	359.65	1.28
ఏసియన్ పెయింట్స్	1,193.70	1,164.10	1,176.00	1,189.90	13.90	1.17
హిందాల్కో	258.80	251.10	255.10	258.00	2.90	1.12

మన తెలంగాణ
10 హైదరాబాద్ మంగళవారం 23, జనవరి 2018
www.manatelangana.news

లోక్‌సభ బరిలో అఖిలేశ్ యాదవ్



లక్నో : వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికల్లో కనౌజ్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయనున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్ సోమవారం ప్రకటించారు. ప్రస్తుతం ఆ స్థానం నుంచి అఖిలేశ్ భార్య డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సీనియర్ సామాజిక నాయకుడు జనేశ్వర్ మిశ్రా వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రం పటం వద్ద అఖిలేశ్ పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాను కనౌజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు చెప్పారు. ములాయంసింగ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, నేతాజీ మెయిన్‌పురి నుంచి బరిలోకి దిగనున్నట్లు ఆయన వెల్లడించారు. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా 78 ఏళ్ల ఎస్‌పి వ్యవస్థాపకులు ఆజాంఘడ్, మెయిన్‌పురి నుంచి పోటీ చేసి రెండింటిలోనూ విజయం సాధించారు. అయితే పశ్చిమ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు గానూ ఆయన ఆజాంఘడ్‌ను ఎంపిక చేసుకొని మెయిన్‌పురి ఎంపి స్థానానికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో వారసత్వ రాజకీయాలను పెంచి పోషిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వాటి నుంచి బయట పడేందుకు వచ్చే సాధారణ ఎన్నికల్లో కనౌజ్ నుంచి పోటీ చేయాలని అఖిలేశ్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అనర్హత ఎంఎల్‌ఎల పిటిషన్ వెనక్కి

న్యూఢిల్లీ: అనర్హత వేటుపై స్టే విధించాలని హైకోర్టులో వేసిన పిటిషన్‌ను అనర్హతకు గురైన ఆప్ ఎంఎల్‌ఎలు ఉపసంహరించుకున్నారు. లాభదాయక పదవుల వ్యవహారంలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలన్న ఎన్నికల సంఘం సిఫార్సుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. హైకోర్టులో వేసిన పిటిషన్‌తో ఫలితం ఏమీ లేదని, అందువల్లే పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నామని ఆప్ తరపు న్యాయవాది తెలిపారు. అయితే రాష్ట్రపతి నిర్ణయాన్ని పూర్తిగా పరిశీలించిన తర్వాత హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఒకవేళ హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరిస్తే సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు సమాచారం.


మహిళ బ్యాగులో 20బుల్లెట్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ నుంచి 20 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె బ్యాగ్‌లో ఆ బుల్లెట్లను సిఐఎస్‌ఎఫ్ దళాలు గుర్తించాయి. రిపబ్లిక్ డే సమీపిస్తున్న సందర్భంగా ఢిల్లీ అంతటా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తనిఖీలు జరుపుతుండగా ఆ మహిళ బ్యాగ్‌లో బుల్లెట్లు దొరికాయి. యుపిలోని మొరాదాబాద్‌కు చెందిన మహిళ ఆదర్శ నగర్ స్టేషన్‌లో పోలీసులకు చిక్కింది. ఆమెతో పాటు ఆమె తండ్రి, కుటుంబసభ్యులు ఉన్నారు. అయితే తన తండ్రి దగ్గర ఉన్న ఆరమ్స్ లైసెన్స్‌ను ఆమె చూపించింది. 20 రౌండ్ల అమ్యునిషన్ తన తండ్రికి చెందినట్లు ఆమె చెప్పింది. కేసు విచారణ కోసం సిఐఎస్‌ఎఫ్ దళాలు ఆమెను ఢిల్లీ పోలీసులకు అప్పగించారు.

శంభాజీ భిండేను కాపాడుతున్నారు

న్యూఢిల్లీ: భీమా– కోరెగావ్ హింసాకాండను రెచ్చగొట్టాడన్న ఆరోపణపై హిందూ మతవాద కార్యకర్త శంభాజీ భిండేపై కేసు నమోదు చేసినప్పటికీ ఆయనని మహారాష్ట్ర పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ మనుమడు, దళిత నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్ ప్రశ్నించారు. 'శంభాజీ భిండే, మిలింద్ ఎక్‌బోటేలను అరెస్టు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. కానీ అలా జరగడంలేదు' అని ఆయన ఇక్కడ పత్రికా విలేకరుల సమావేశంలో అన్నారు. భిండేను అరెస్టు చేస్తామని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సైతం హామీ ఇచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'అయితే భిండేను అరెస్టు చేయరాదని మహారాష్ట్ర పోలీసులకు ప్రధాని కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయన్న విషయం మాకు ఉన్నత వర్గాల నుంచి తెలిసింది'అని ప్రకాశ్ అంబేద్కర్ ఆరోపించారు.

విమర్శలకు దారితీసిన కేరళ గవర్నర్ ప్రసంగం



తిరువనంతపురం : అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ పి.సదాశివం సోమవారం చేసిన ప్రసంగం విమర్శలకు దారి తీసింది. తన ప్రసంగంలో ఆయన బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న కొన్ని అంశాలను విడిచిపెట్టి ప్రసంగాన్ని పూర్తి చేశారు. ఆయన ప్రసంగం కాపీని ప్రభుత్వం రూపొందించింది. దీన్ని శాసనసభ్యులు, మీడియాకు పంపిణీ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ కొన్ని వాక్యాలున్నాయి. అయితే, గవర్నర్ ప్రసంగ పాఠంలో ఈ వాక్యాలను చదువలేదు. 'సహకార స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా జిల్లా యంత్రాంగం, స్థానిక పాలకవర్గాలతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోవడం బాధ కలిగించింది' అని గవర్నర్ చేతికి ఇచ్చిన ప్రసంగ పాఠంలో ఉంది. అయితే ఈ వాక్యాలను గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొనలేదు. 'శాంతి భద్రతల పరిరక్షణలో కేరళ దేశంలో మళ్లీ ప్రథమ స్థానంలో గుర్తింపు పొందింది. అలాగే, ప్రజల జీవన ప్రమాణాల స్థాయిలోనూ అగ్రస్థానంలో ఉంది. మత సంబంధమైన కొన్ని సమస్యలున్నా మత విద్వేషాలు చోటు చేసుకున్న ఘటనలు జరగలేదు' అని ప్రసంగం కాపీలో ఉంది. కాగా, ఈ విషయమై ముఖ్యమంత్రి కార్యాలయాన్ని పిటిఐ సంప్రదించగా దీనిపై వారు స్పందించలేదు. సాధారణంగా తాము గవర్నర్ ప్రసంగంపై ఎలాంటి కామెంట్ చేయబోమని అధికార వర్గాలు చెప్పాయి.

సుప్రీం జడ్జీలుగా ఇందు, జోసెఫ్

న్యూఢిల్లీ : సీనియర్ న్యాయమూర్తి ఇందు మల్హోత్రా, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కెఎం జోసెఫ్‌లను సర్వోన్నత న్యాయస్థానం జడ్జీలుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. నలుగురు సీనియన్ జడ్జీలు మీడియా సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) దీపక్ మిశ్రాపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయన నేతృత్వంలోని ఈ కొలీజియం ఈ మేరకు ప్రతిపాదించడం గమనార్హం. కొలీజియంలో దీపక్ మిశ్రాతో పాటు నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జె.చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మందన్ బి.లోకుర్, కురియన్ జోసెఫ్‌లు కూడా ఉన్నారు. ఈ నలుగురు జనవరి 12 మీడియా సమావేశం ఏర్పాటు చేసి సిజెఐపై ఆరోపణలు చేసిన విషయం విదితమే. అయితే, ఈ కొలీజియం జనవరి 11న ఇందు మల్హోత్రా, కెఎం జోసెఫ్‌లను జడ్జీలుగా నియమించాల కోరుతూ కేంద్రానికి సిఫార్సు చేయాలని నిర్ణయించింది. ఇప్పుడు లాంఛనంగా ఈ రెండు పేర్లను కేంద్రానికి సిఫార్సు చేసినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందు మల్హోత్రా సుప్రీంకోర్టు జడ్జిగా నేరుగా నియమితులైన ప్రథమ మహిళ న్యాయమూర్తి కానున్నారు. కెఎం జోసెఫ్ 2004లో కేరళ హైకోర్టు శాశ్వత జడ్జిగా నియమితులయ్యారు. అనంతరం 2014లో ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

రష్యాతో భారత్ భారీ ఒప్పందం!

న్యూఢిల్లీ : ట్రంఫ్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్స్ కొనుగోలు ఒప్పందంపై రష్యాతో భారత్ చర్చలు ప్రారంభించింది. భారత్ రష్యా నుంచి దాదాపు రూ.39,000 కోట్ల (5.5 బిలియన్లు) విలువైన 400 కిలోమీటర్ల దూరం, 30 కిలోమీటర్ల ఎత్తులో లక్ష్యాన్ని గురి చూసి కొట్టే మిస్సైల్స్ కొనుగోలు చేయాలని యోచిస్తోంది. బాంబర్లు, స్టెల్త్ ఫైటర్లు, స్పై విమానాలు, మిస్సైల్స్, డ్రోన్ తదితరాలను గుర్తించడం, ట్రాక్ చేయడం, అవసరమైతే వాటిని విధ్వంసం చేయడం వంటి పనులను ఈ ఎస్–400 మిస్సైల్స్ అత్యంత సామర్థ్యంతో నిర్వర్తిస్తాయి. ప్రస్తుతం ఇప్పుడు భారత్ ఒప్పందం కోసం చివరి విడత చర్చలను ప్రారంభించింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవాలని చూస్తున్నది. ఇందులో మొదటగా ఎస్–400 మిస్సైల్స్ సిస్టమ్‌ను కొనుగోలు చేయాలనేది భారత్ ఉద్దేశ్యం.







ఫొటో : భాషా

సోమవారంనాడు వెలుగు జిలుగుల నడుమ కనువిందు చేస్తున్న హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ బుక్ ఫెయిర్, మన తెలంగాణ స్టాల్‌ను సందర్శించిన బిసి కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు

నేడు దావోస్‌లో మోడీ కీలక ప్రసంగం



దావోస్/జురిచ్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దావోస్ చేరుకున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సదస్సులో పాల్గొనేందుకు వెళ్తూ సోమవారం నాడు మార్గమధ్యంలోని జురిచ్‌లో కాసేపు ఆగారు. అనంతరం ఆయన దావోస్ పయనమయ్యారు. దావోస్‌లో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న డబ్ల్యుఇఎఫ్ సదస్సులో మోడీ ప్రారంభ కీలకోపన్యాసం చేయనున్నారు. అలాగే, స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలెన్ బెర్‌సెట్, స్వీడిష్ ప్రధాని స్టీఫన్ లాఫ్వెన్‌లతో ప్రత్యేకంగా ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొననున్నారు. సదస్సులో పాల్గొనే అతిథులకు మోడీ డిన్నర్ ఇవ్వనున్నారు. మంగళవారం ప్రపంచ పారిశ్రామికవేత్తలతో ముచ్చటిస్తారు. 'ప్రపంచ దేశాలతో భారత్ భవిష్యత్ విజన్‌ను ఈ సందర్భంగా దావోస్‌లో పంచుకుంటాను' అని మోడీ తెలిపారు.

గొప్పగా మోడీ ప్రసంగం ఉండబోతోంది..

స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరగబోయే ప్రపంచ ఆర్థిక సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగం గొప్పగా ఉండబోతోందని ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్ జెట్ సిఇఒ అజయ్ సింగ్ అన్నారు. దేశంలో ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న ముఖ్యమైన సంస్కరణలు, కోట్లాది భారతీయుల కలల గురించి ఆయన గొప్పగా మాట్లాడతారని ప్రశంసించారు. దావోస్ సదస్సుకు తాను కూడా హాజరవుతున్న సందర్భంగా సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'దాదాపు 20ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని ఈ సదస్సుకు హాజరవుతున్నారు. దేశ ప్రజలకు ఇది చాలా ముఖ్యమైన సందర్భం. గతేడాది చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరై ప్రసంగం చేశారు. ఆ తర్వాత చైనా అభివృద్ధిపై ప్రపంచం దృష్టిపెట్టింది. ఇప్పుడు భారత్‌పై కూడా అలాంటి సానుకూల ప్రభావం పడే అవకాశం ఉంది. డిజిటలైజేషన్, ఆర్థిక వ్యవస్థ పురోగతి తదితర మార్పులు వచ్చాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో భారత ర్యాంకు మెరుగుపడింది. వీటన్నింటి గురించి ప్రధాని చాలా బాగా వివరించగలరు. ప్రధాని మోడీ కంటే మెరుగ్గా ఇంకెవరూ ప్రసంగం చేస్తారు' అని సింగ్ చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్‌తో పొత్తుపై నిర్ణయం తీసుకోలేదు : సురవరం



న్యూఢిల్లీ : రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తుపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి వెల్లడించారు. ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమై విశాల వేదికపైకి రావాలని పార్టీ కోరుకుంటున్న్నదని, అయితే ఎన్నికల పొత్తు అనేది ఇందుకు భిన్నమైనదని అన్నారు. కాంగ్రెస్‌తో ఎన్నికల భాగస్వామ్యంపై ఆ పార్టీతో చేరాలా, వద్దా అనే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ విషయమై పార్టీ నేతలతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామని సోమవారం ఆయన పిటిఐతో మాట్లాడుతూ చెప్పారు. కాంగ్రెస్‌తో జతకట్టకూడదని సిపిఐ(ఎం) ఆదివారం తీర్మానం చేసిన నేపథ్యంలో ఈ విషయమై తాము పార్టీలో చర్చించుకుంటామని, అలాగే సిపిఐ(ఎం)తో కూడా మాట్లాడతామని వివరించారు. కాంగ్రెస్‌తో దేశవ్యాప్తంగా భాగస్వామ్యం ఆలోచన లేదని, అయితే కొన్ని రాష్ట్రాల్లో పోటీ చేయక పోవడం లాంటి అంశాలు కీలకంగా మారుతాయని అన్నారు. వామపక్షాల ఐక్యత అనేది తమకు చాలా ప్రాధాన్యతతో కూడిన అంశమని, అందుకే తాము పార్టీలో చర్చించి, అలాగే సిపిఐ(ఎం)తో కూడా మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని చేతులు కాల్చుకోం

వామపక్షాలతో కలిసి వెళతాం : దేవెగౌడ



మంగళూరు: కర్నాటకలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్‌తో ఎలాంటి అవగాహన ఉండబోదని జనతాదళ్ సెక్యులర్ (జెడిఎస్) అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డి దేవేగౌడ స్పష్టంచేశారు. ఇప్పటికే ఒకసారి అలా చేసి తప్పు చేశామని, మరోసారి చేతులు కాల్చుకోబోమని పేర్కొన్నారు. ఒకవేళ కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వచ్చినా సరే అందుకు పార్టీ సిద్ధంగా లేదని మీడియాతో పేర్కొన్నారు. కాంగ్రెస్, బిజెపిలు ఎప్పుడూ మత పరమైన అంశాలకే ప్రాధాన్యం ఇస్తాయని, ప్రజా సమస్యలను అవి పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ మొత్తం 224 అసెంబ్లీ స్థానాలకూ పోటీ చేస్తుందని చెప్పారు. అందులో కొన్ని స్థానాలను వామపక్షాలకు కేటాయిస్తామని తెలిపారు. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు అంశంపై ఇంకా పార్టీ ఏ నిర్ణయమూ తీసుకోలేదన్నారు. రాజ్యాంగంపైనా, దళితులపైనా రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి అనంత్‌కుమార్ హెగ్డే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలనూ దేవేగౌడ తప్పుబట్టారు. ప్రధాని మోడీ తన మంత్రులను అదుపులో ఉంచుకోవాలని సూచించారు.

గుజరాత్ పేలుళ్ల సూత్రధారి అరెస్ట్



- అబ్దుల్ ఖురేషీకి 14 రోజుల కస్టడీ
- బాంబుల తయారీలో దిట్ట

న్యూఢిల్లీ : 2008 గుజరాత్ పేలుళ్ల సూత్రధారి, ఇండియన్ ముజాహిద్దీన్ (ఐఎం) సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ సుభాన్ ఖురేషిని ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అనేక సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్న ఖురేషి ఘాజీపూర్‌లోని పాత మిత్రుడిని కలుసుకునేందుకు భారత్‌కు రాగా అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు డిసిపి ప్రమోద్ కుష్వాహ వెల్లడించారు. నకిలీ డాక్యుమెంట్లతో నేపాల్‌లో నివసిస్తున్న ఖురేషి ఇండియన్ ముజాహిద్దీన్‌ను బలోపేతం చేసేందుకు భారత్‌కు వచ్చినట్లు సోమవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో డిసిపి పేర్కొన్నారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ప్రత్యేక బృందాలు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఖురేషిని వెంటాడి ఎట్టకేలకు అతన్ని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య స్వల్ప కాల్పులు చోటు చేసుకున్నాయన్నారు. అరెస్టు తరువాత అతన్ని కోర్టు ప్రవేశపెట్టగా, ఖురేషికి 14 రోజుల పోలీస్ కస్టడీని కోర్టు విధించినట్లు డిసిపి చెప్పారు. ఇదిలా ఉండగా, 2008, జులై 26న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 26 బాంబు పేలుళ్లకు పాల్పడిన మరుసటి రోజు నుంచి ఖురేషి కోసం కాలిస్తున్నారు. ఈ పేలుళ్లకు పాల్పడింది తామేనని ఐఎంకు చెందిన ఆర్–అరబి సంతకంతో కూడిన లేఖ ఇమెయిల్ ద్వారా టివి చానెళ్లకు పంపారు. దీంతో ఈ ఘటనలకు సూత్రధారి ఖురేషేనని గుజరాత్ పోలీసులు తొలత అతని పేరునే ప్రకటించారు. అదే విధంగా ఢిల్లీ, బెంగళూరులో జరిగిన ఉగ్రదాడులు, 2006లో ముంబయిలోని లోకల్ ట్రైన్‌లో జరిగిన బాంబు పేలుళ్లతో సంబంధాలున్న ఖురేషి అలియాస్ తౌకీర్ కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కూడా గాలిస్తోంది. భారత బిన్‌లాడెన్‌గా చెప్పుకునే ఖురేషి పలు రూపాలు మార్చుకోవడంలో నిపుణుడు. అదే అతుడు పోలీసులు, సీనియర్ నిఘా అధికారుల నుంచి తప్పించుకునేందుకు దోహదం చేసింది. ఖురేషిని టెకీ బాంబర్ అని కూడా పిలుస్తారు. హైదరాబాద్, బెంగళూరులో ఉన్న పేరొందిన భారత ఐటి కంపెనీల్లో పని చేసిన ఖురేషి బాంబుల తయారీలో ఆరితేరాడు. అయితే 1998లో సిమి ఉగ్రవాద అతన్ని రిక్రూట్ చేసుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత ఇండియన్ ముజాబిద్దీన్‌లోకి వెళ్లినట్లు సమాచారం.

బిజెపిపై కాంగ్రెస్ మరో విడియో విమర్శల దాడి



న్యూఢిల్లీ : బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తాజాగా కాంగ్రెస్ మరో విడియో విడుదల చేసి విమర్శల దాడికి దిగింది. భారత రాజ్యాంగాన్ని ఎట్టి పరిస్థితుల్లో నూ మార్చేయాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కంకణం కంటుకున్నాయని ఆక్షేపించింది. అందుకు ఆధారాలుగా పలు సందర్భాల్లో బిజెపి, ఆర్ ఎస్ ఎస్ నేతలు రాజ్యాంగంపై వెల్లడించిన అభిప్రా యాలను అందులో నిక్షిప్తం చేసింది. కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే వ్యాఖ్యలతో ఈ వీడియో ప్రారంభమైంది. రాజ్యాం గాన్ని సవరించడానికే తాము అధికారంలోకి వచ్చినట్లు హెగ్డే చెప్తున్నట్లు కనిపిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ వారసత్వాన్ని హెగ్డే అనుసరిస్తున్నారని ఆరోపిం చింది. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త గోళ్వాల్కర్‌ను చిత్రాన్ని చూపెడుతూ భారత రాజ్యాంగంలో భారతీయ భావనలు, రాజనీతి సిద్ధాంతాలులేనే లేవని అభిప్రాయపడినట్లు పేర్కొంది. రాజ్యాంగంలో 'లౌకికవాదం' అనే పదాన్ని చేర్చడంపై జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని కూడా దీనిలో ఉంచారు. భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించడం ద్వారా భారతదేశ ఆత్మపై దాడి జరిగిందని, లౌకికవాద రాజ్యమంటే పూర్తిగా కష్టాలే ఉంటాయని దీన్‌దయాళ్ అన్నారని పేర్కొంది. ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగాన్ని సమీక్షించేందుకు 2000వ సంవత్సరంలో వెంకటాచలయ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైన సంగతిని గుర్తు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'ఏ వ్యవస్థా లౌకికం కాబోదు, ఆ మాటను సృష్టించి,వాడుతున్నవాళ్ళు క్షమాపణ చెప్పాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో అతి పెద్ద అబద్ధం లౌకికవాదమే' అని అన్నారని వీడియోలో ఉంది.

వ్యవసాయ పరపతి లక్ష్యం రూ.11 లక్షల కోటు?



న్యూఢిల్లీ: 2018–19 బడ్జెట్‌లో వ్యవసాయ పరపతి లక్ష్యాన్ని రూ.1 లక్ష కోట్లు పెంచి రికార్డు స్థాయిలో రూ. 11 లక్షల కోట్లకు చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ రంగంలో పరపతి ప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం పరిపతి లక్ష్యాన్ని రూ. 10 లక్షల కోట్లుగా ఉంచింది. అందులో 2017 సెప్టెంబర్ వరకు తొలి ఆరు నెలల్లోనే రూ. 6.25 కోట్లు పంపిణీ చేశారు. 'వ్యవసాయానికే ప్రభుత్వ ప్రాధాన్యత. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి పరపతి పంపిణీ లక్ష్యాన్ని రూ. 11 లక్షల కోట్లకు పెంచాలని కూడా ప్రభుత్వ నిర్ణయించుకుంది' అని ఆ వర్గాలు తెలిపాయి. వ్యవసాయ అధికోత్పత్తిని సాధించడానికి పరపతియే కీలకమైనందున రైతులు అధిక వడ్డీ రేట్లకు సంస్థేతర వర్గాల నుంచి అప్పులు తేవడాన్ని నిరోధించడానికి ఈ పరపతి లక్ష్యం దోహదపడుతుంది అని కూడా ఆ వర్గాలు చెప్పాయి. సాధారణంగా వ్యవసాయ రుణంపై వడ్డీ రేటు 9 శాతం ఉంటుంది. కానీ ప్రభుత్వం అందుబాటు వడ్డీరేటుకే రైతులకు స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు ఇస్తోంది. రైతులు రూ. 3 లక్షల వరకు 2 శాతం సబ్సిడీతో సంవత్సరానికి 7 శాతం వడ్డీ రేటుకే రుణం పొందేలా చూ స్తోంది. రుణాలను సక్రమంగా చెల్లించే రైతులకు అదనంగా 3 శాతం ప్రోత్సహకాన్ని కూడా ఇస్తోంది. దీంతో వడ్డీ రేటు రైతుకు 4 శాతమే అవుతుంది. స్వంత నిధులను ఉపయోగించే ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకు లు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, అలాగే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు, సహకార బ్యాంకులకు రీఫైనాన్స్ చేసే నాబార్డ్‌కు రుణ రాయితీలు(ఇంటరెస్ట్ సబ్‌వెన్షన్) కూడా ప్రభుత్వం ఇస్తోంది. ఈ ఏడాది నుంచి అన్ని స్వల్ప కాలిక పంట రుణాలకు 'ఆధార్'ను అనుసంధానించనున్నారు. ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనా(పిఎంఎఫ్‌బివై) కింద పంట రుణాలు పొందడానికి కూడా 'ఆధార్'ను అనుసంధానించనున్నారు.

ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం

పూరి: ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పూరి జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోరిక్షా, ఓ ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు క్షతగాత్రులైనట్లు పోలీసులు చెప్పారు. పూరిలోని స్వర్గద్వార్ వద్ద జరిగిన అంత్యక్రియలకు హాజరై ఆటో రిక్షాలో 8 మంది తమ గ్రామానికి తిరిగి వెళ్తుండగా ఆదివారం రాత్రి సత్యబాడి ప్రాంతంలోని జగన్నాథ్ సదక్‌లో ఈ దుర్ఘటన జరిగినట్లు వారు తెలిపారు. ఇద్దరు వ్యక్తులు ఘటనాస్థలిలోనే మృతి చెందగా, ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారన్నారు. మృతులు, బాధితులను కనాస్ పరిధిలోని అందాలసింఘా గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. క్షతగాత్రులైన వారి పరిస్థితి విషమంగా ఉండగా, వారిని చుట్టక్‌లోని ఎస్‌సిబి మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో చేర్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

లోయా మృతి కేసు చాలా తీవ్రమైంది

రెండు కేసులు సుప్రీంకు బదిలీ

న్యూఢిల్లీ : సిబిఐ ప్రత్యేక జడ్జి జస్టిస్ బిహెచ్ లోయా మృతి కేసు చాలా తీవ్రమైన అంశమని, ఈ కేసుకు సంబంధించి అన్ని పత్రాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. లోయా మృతికి సంబంధించి కోర్టుకు ఇంతవరకు సమర్పించిన పత్రాలను వెంటనే అందించాలని వాదిప్రతివాదులకు సూచించింది. బిహెచ్ లోయ 2014లో సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసు విచారిస్తున్న నేపథ్యంలో అనుమానాస్పద రీతిలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన హత్యకు గురయ్యారంటూ లోయా సోదరి, ఇతర కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఈ కేసులో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇది చాలా తీవ్రమైన అంశమని.. దీనికి సంబంధించిన పూర్తి పత్రాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా జస్టిస్ ఎఎం ఖన్విల్కర్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. సదరు పత్రాలను కోర్టుకు సమర్పించాలని సూచించింది. అదేవిధంగా జస్టిస్ లోయ మృతికి సంబంధించి బాంబే హైకోర్టులో ఉన్న రెండు పెండింగ్ పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. దేశంలోని ఏ హైకోర్టు కూడా లోయా మృతికి సంబంధించిన కేసులను విచారించకూడదని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది.



ఆన్‌లైన్, ఒఇసిడి విత్తన ధ్రువీకరణ భేష్ : ఈజిప్టు బృందం

మన తెలంగాణ/హైదరాబాద్ : గత సంవత్సరం 550 మెట్రిక్ టన్నుల అంతర్జాతీయ ధ్రువీకరణ విత్తనాలను ఎగుమతి చేసినందుకు ఈజిప్ట్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణ నుండి దిగుమతి చేసుకున్న జొన్న, గడ్డి జొన్న విత్తనాలు బాగున్నాయని, రానున్న కాలంలో పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవాలనుకుంటున్నట్లు తెలిపింది. రాష్ట్రంలోని వ్యవసాయ పద్దతులు, నాణ్యమైన విత్తనోత్పత్తి క్రమాలను ఈజిప్టు బృందం అధ్యయనం చేస్తోంది. రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థసారథి, విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ కె. కేశవులుతో ఈజిప్టు ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణలో అతి తక్కువ సమయంలో తొమ్మిది రాష్ట్రాలకు లీడింగ్ నోడల్ ధృవీకరణ సంస్థగా మన రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ ఆవతరించిందన్నారు. హైదరాబాద్‌లో 400 లకు పైగా విత్తన కంపెనీలున్నాయని, దేశ విత్తన అవసరాల్లో 60 శాతం మన రాష్ట్రంనుంచే సరఫరా అవుతోందన్నారు. తెలంగాణలో ఆన్‌లైన్ విత్తన ధ్రువీకరణ క్రమం, అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ, సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణలపై సంస్థ చేస్తున్న కార్యకలాపాలు అభినందనీయమని ఈజిప్టు ప్రతినిధి గమల్ అలజబ్ వ్యాఖ్యానించారు.

మన తెలంగాణ
11
హైదరాబాద్
మంగళవారం
23, జనవరి 2018
www.manatelangana.news

అమెరికాలో కొనసాగుతున్న షట్ డౌన్

చర్చలు విఫలం : వాయిదాపడ్డ తాజా ఓటింగ్



వాషింగ్టన్ : తాత్కాలిక బడ్జెట్‌ను సెనెట్ తిరస్కరించడంతో అమలులోకి వచ్చిన 'షట్ డౌన్' అంతానికి ఒక అంగీకారానికి చట్టసభ సభ్యులు రాలేకపోయారు. సుదీర్ఘ చర్చల అనంతరం సెనెట్‌లో ఓటింగ్ ఇందువల్ల వాయిదా పడింది. మరోపక్క తాజాగా పని వారం మొదలయిపోయింది. అధ్యక్షుడు ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ, ప్రతిపక్ష డెమొక్రాట్ల నాయకులు చర్చలలో కొంత పురోగతి చోటు చేసుకున్నట్లు చెప్పారు. దీనితో ఓటింగ్‌ను కొద్ది సేపు వాయిదా వేశారు. తర్వాత అంగీకారం కుదరకపోవడంతో మరి కొన్ని గంటలు ఓటింగ్ వాయిదా పడింది. ట్రంప్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన తొలి రోజున షట్ డౌన్ నీలినీడలు తప్పవని దీనితో తేలిపోయింది. శనివారం రోజున వేలాది మంది ఫెడరల్ సిబ్బంది వేతనాలు లేకుండా ఇంటి వద్ద నిలిచిపోతారు. వారు సోమవారం ఉదయంగాని సాధారణంగా పనులలోకి రారు. అయితే ఇప్పుడు అత్యవసర సర్వీసుల వారు తప్ప తక్కిన ఎవరూ ఉద్యోగాల్లో చేరే పరిస్థితి లేదు. అత్యవసర సేవలకు కూడా విధిగా పని చేయాలి తప్ప, వేతనాలు ఉండవు.

అసాంజె తల నొప్పిగా మారాడు

క్విటో: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజీ తనకు న్యూసెన్స్‌గా తయారయినట్లు ఈక్వెడార్ అధ్యక్షుడు లెనిన్ మోరెనో సోమవారం నాడు పేర్కొన్నారు. ఈ విషయంలో సానుకూల ఫలితం కోసం ఆశతో ఎదురు చూస్తున్నామని ఒక టివి ఇంటర్వ్యూలో తెలిపారు.ఈ నెల మొదట్లో అసాంజీకి పౌరసత్వాన్ని మంజూరు చేసినట్లు ఈక్వెడార్ ప్రకటించింది. దీనివల్ల అతనికి ఆంక్షల నుంచి దౌత్యపరమైన రక్షణ చేకూరుతుంది. బ్రిటన్ అరెస్టుకు వీలులేకుండా లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయం నుంచి అతడికి విముక్తి లభిస్తుంది. 2012లో అసాంజీ ఆ యంబసీకి పారిపోయి వచ్చాడు. స్వీడన్‌కు అతడిని తిరిగి అప్పగించే యత్నాల నుంచి అలా తప్పించుకున్నాడు.

కోడిపందేలపై హైకోర్టు ఆగ్రహం



మన తెలంగాణ/హైదరాబాద్: కోడి పందేల్ని నిర్వహించకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినా ఎందుకు అడ్డుకోలేక పోయారని హైకోర్టు ఏపీ సర్కార్‌ను నిలదీసింది. కోర్టుకు హామీ ఇవ్వ డమే కాకుండా కోడిపందేల్ని నిర్వహించ డానికి వీల్లేదని తాము ఉత్తర్వులు ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని ప్రశ్నించింది. కోడి పందేలపై కౌంటర్ పిటిషన్ వేయాలని ఈ నెల 4న ఆదేశాలు ఇస్తే ఇప్పుడు కేసు విచారణకు వచ్చినప్పుడు తమకు సమయం కావాలని సీఎస్,డీజీపీల తరపు లాయర్లు కోరడాన్ని సోమవారం హైకోర్టు తీవ్రంగా తప్పు పట్టింది. కోడి పందేలు జరగబోవని చెప్పిన తర్వాత కూడా యథాప్రకారం జరిగాయని, తరుచుగా టీవీ చూసే తమకే పదేపదే కోడి పందేలు జరిగి నట్లుగా చూశామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయ మూర్తి జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. రెండేళ్ల క్రితం కోడి పందేలపై హైకోర్టు ఇచ్చి న ఆదేశాల్ని అమలు చేయకపోవడమే కాకుండా తాజాగా హైకోర్టుకు సీఎ స్, డీజీపీలు హామీ ఇచ్చి కూడా అమలు చేయడంలో వైఫ ల్యం చెందడానికి కారణాలు ఏమిటని బెంచ్ నిలదీసింది. విచారణ 29కి వాయిదా పడింది.

గవర్నర్‌పై పొంగులేటి విమర్శలు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణలో గవర్నర్ నరసింహన్ రాజకీయాలకు అవకాశాలిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన పలు విషయాలపై మాట్లాడారు. గవర్నర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు ను సందర్శించడానికి వెళ్ళినందుకు అభ్యంతరం లేదన్నారు. నేరెళ్ళ ఘటన,నయీం ఎన్ కౌంటర్ ,మియాపూర్ భూ దందా,ఇసుక స్కాం,కార్పొరేట్ ఆసుపత్రులలో ఫీజుల పెంపు వంటి అంశాల ను గవర్నర్ పట్టిచుకో లేదన్నారు.రాజ్యాంగ ప్రతినిధి అయిన గవర్నర్ రాజ్యాంగ పరిరక్షకుడుగా ఉండాలని సూచించారు.గవర్నర్ అన్ని అంశాలపై దృష్టి సారించాలన్నారు.గవర్నర్ గురించి రాజకీయంగా మాట్లాడుకునే అవకాశం కల్పించడం దురదృష్టకరం అన్నారు. కొన్ని అంశాలను ఎంచుకుంటున్న గవర్నర్ ఆ కార్యక్రమాలలో పాల్గొంటున్నారని తెలిపారు .

టిజిటి అభ్యర్థులకు మరోసారి అవకాశం

మన తెలంగాణ/హైదరాబాద్ : గురుకులాల్లో టిజిటి పోస్టుల ధృవపత్రాల పరిశీలనకు హాజరై సొసైటీల ఎంపిక, జోనల్ ప్రాధాన్యతలను ఎంపిక చేసుకోని అభ్యర్థులు, సరిగ్గా ఎంపిక చేసుకోని అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 25 వరకు మరోసారి వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సరిగ్గా ఆప్షన్లు ఎంపిక చేసుకున్నవారు మరోసారి ఆప్షన్లు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.


ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గ సమావేశాలు



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్(ఇయు) రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో కార్యవర్గ సభ్యులకు శిక్షణ తరగతుల్లో భాగంగా ఆర్‌టిసి చరిత్ర, ఇయు, ఎఐటియుసి చరిత్ర, కార్మిక రెగ్యులేషన్ చట్టాలు, సంక్షేమ పథకాలు, ముఖ్యమైన సర్క్యులర్లు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై శిక్షణనిస్తారు. ఇయు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు పతాకావిష్కరణ చేయగా, ఇయు గౌరవ అధ్యక్షులు, ఎఐటియుసి అధ్యక్షులు టి.నరసింహన్ కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణ తరగతులలో ఫ్యాకల్టీ సభ్యులుగా ప్రొఫెసర్ మధుకర్, ఎఐటియుసి కార్యదర్శి యూసుఫ్, జి.డి. ప్రసాద్‌రెడ్డి, ఎస్.కె. బాబు, ఇయు ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి కార్యవర్గ సభ్యులకు శిక్షణనిచ్చారు.

అభివృద్ధి సూచీలో మనం 62

చైనా, పాక్‌లతో పోల్చితే భారత్ వెనుకంజ



దావోస్: అభివృద్ధి చెందుతున్న దేశాల సమ్మిళిత అభివృద్ధి సూచీ(ఐడిఐ)లోనూ భారత్ వెనుకంజలో నిలిచింది. పొరుగుదేశాలైన చైనా, పాక్‌లతో పోల్చి చూస్తే కిందిస్థాయికి దిగజారింది. ఐడిఐ సూచీలో 62వ స్థానానికి పరిమితమైంది. చైనా 26 స్థానంలో ఉండగా, పాకిస్థాన్ 47తో మెరుగైన స్థానంలో నిలిచింది. అత్యంత సమ్మిళిత ఆధునిక ఆర్థిక వ్యవస్థల జాబితాలో నార్వే మొదటి స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది. గత ఏడాది భారత్ 60వ స్థానంలో ఉంది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల జాబితాలో లిథువేనియా తొలి స్థానంలో ఉంది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేత్తల సదస్సు ప్రారంభానికి కొద్ది గంటల ముందు అంటే సోమవారంనాడు ఈ అభివృద్ధి సూచీని విడుదల చేశారు. జీవన ప్రమాణాలు, పర్యావరణ స్థిరత్వం, భవిష్యత్తు రుణాల నుంచి ముందు తరాలను రక్షించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ జాబితాను సిద్ధం చేసినట్లు వరల్డ్ ఎకనమిక్ ఫోరం తెలిపింది. గత ఏడాది 79 అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చైనా 15వ స్థానంలో, పాకిస్థాన్ 52వ స్థానంలో ఉన్నాయి. 2018 సూచీలో 103 అభివృద్ధి చెందుతున్న దేశాలను పరిగణలోకి తీసుకున్నారు. ఎదుగుదల, అభివృద్ధి, సమ్మిళితం, తరాలలో సమానత్వం ఆధారంగా ఈ దేశాలను రెండు భాగాలుగా విడదీశారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థల జాబితాలో 29, అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో 74దేశాలు చేర్చారు. అడ్వాన్సింగ్ ట్రెండ్‌లో ఉన్న అభివృద్ధి చెందుతున్న 10 దేశాల జాబితాలో భారత్‌కు చోటు దక్కింది. కేవలం రెండు అభివృద్ధి చెందుతున్న దేశాలు మాత్రమే అడ్వాన్సింగ్ ట్రెండ్‌లో ఉన్నాయి.ఆధునిక ఆర్థిక వ్యవస్థల్లో నార్వే తొలి స్థానంలో ఉంది. తర్వాత ఐర్లాండ్, లగ్జెంబర్గ్, స్విట్జర్లాండ్, డెన్మార్క్ ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లిథువేనియా, హంగేరీ, అజర్‌బైజాన్, లాట్వియా, పోలాండ్ దేశాలు ఉన్నాయి. శ్రీలంక 40, బంగ్లాదేశ్ 34, నేపాల్ 22 స్థానాలతో భారత్ కన్నా మెరుగైన స్థానంలో నిలిచాయి.

తల్లీకొడుకుల దారుణ హత్య

● అక్కను వేధిస్తున్నాడని బావమరిది హత్య ● పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

మన తెలంగాణ/పుల్‌కల్ : పాత కక్షల కారణంగా తల్లి, కొడుకులను దారుణంగా హత్య చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలోని శివ్వంపేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల పోలీసుల వివరాల ప్రకారం....గ్రామానికి చెందిన మిరియాల పెంటమ్మ (58), మల్లేశం (38) దారుణ హత్యకు గురయ్యారు. పెంటమ్మ సోదరుడైన మిరియాల కిష్టయ్య కుమారులైన మల్లేశం, శ్రీశైలంలు హత్య చేసినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కిష్టయ్య స్వయాన అక్క అయిన పెంటమ్మ కుమారుడు మల్లేశంకు తన కూతురు పద్మను ఇచ్చి పదేళ్ళ క్రితం వివాహం జరిపించారు. పద్మ, మల్లేశం దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. కొన్నేళ్ళ పాటు వీరి సం సారం సంతోషంగానే కొనసాగింది. కొంత కాలంగా తన కూతురైన పద్మను వేధింపులకు గురి చేస్తున్నాడని పలుమార్లు నచ్చజెప్పారు. సంసారానికి తీసుకువెళ్లాలని గ్రామంలో పంచాయతీలు నిర్వహించారు. ఎంతగా





నచ్చజెప్పినా మల్లేశం భార్యను కాపురానికి తీసుకువెళ్లకపోవడంతో పుల్‌కల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పద్మను కాపురానికి తీసుకువెళ్ళాలని చెప్పారు. మల్లేశం ఎంత చెప్పినా అంగీకరించలేదు. భార్యకు భూమిని పంచి ఇవ్వాలని గ్రామ పెద్దలు సూచించగా అందుకు అంగీకరించాడు. తన సోదరి పద్మను కాపురాని తీసుకెళ్ళకపోవడంతో మల్లేశం, శ్రీశైలం తరుచూగా గొడవ పడుతుండేవారు. దీంతో ఆదివారం రాత్రి మల్లేశం గ్రామంలోని కల్లు దుకాణం సమీపంలో ఉండగా శ్రీశైలం ఇనుప రాడ్డుతో దాడిచేసి తలపై బలంగా కొట్టడంతో మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మల్లేశం తల్లి అయిన పెంటమ్మ ఇంటి వద్ద వాకిట్లో ఉండగా ఆమెపై దాడి చేసి హతమార్చాడు. తల్లీ,కొడుకులు హత్యకు గురి కావడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఎల్ఆర్ఎస్ అక్రమాలకు పాతర

4 వేల ధరఖాస్తుల తిరస్కరణ



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : ఒకటి కాదు... వందకాదు... వేయికాదు... ఏకంగా నాలుగువేల బినామీ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు హెచ్ఎండిఎ కమిషనర్ చిరంజీవులు చెక్ పెట్టారు. అథారిటీని మభ్యపెట్టి దొడ్డిదారిన ఎల్ఆర్ఎస్‌ను కావించుకోవాలని చూసిన పలువురు ఆర్కిటెక్చర్లు, ప్లానర్ల కుటిల యత్నానికి కమిషనర్ చరమగీతంపాడారు. ప్రణాళికా విభాగాన్ని ప్రభావితం చేస్తున్న వారి వ్యవహారంపై కొరడా ఝులిపించేందుకు ఆయన మరో అడుగు ముందుకేసి నోటీసులు జారీచేశారు. లైసెన్స్ లేకున్నా ధరఖాస్తుదారులను కన్సల్టెన్సీల పేరుతో తప్పుదోవపట్టిస్తున్నట్టు వచ్చిన మౌఖిక ఫిర్యాదులపై ఆయన ఘాటుగా స్పందించారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవడం తప్పదని సున్నితంగా హెచ్చరించారు. గత కొన్నేళ్ళుగా ఈ తతంగం నడుస్తున్న నేపథ్యంలోనే అథారిటీ ఆర్థిక పరిస్థితి కుంటుపడుతున్నదని గ్రహించిన కమిషనర్ ముందుగా వీరి ఆగడాలకు చెక్‌పెట్టాలని భావిస్తున్నారు. 2015లో వచ్చిన ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని ఆర్కిటెక్చర్లు, ప్లానర్లు, స్ట్రక్చరల్ ఇంజనీర్లు అందినకాడికి దండుకునేందుకు ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగానే వారు ఒక ప్రణాళికా ప్రకారంగా కేవలం ధరఖాస్తును, రూ. 10 వేలు రుసుంగా చెల్లించి హెచ్ఎండిఎకు అందజేసి ఎల్ఆర్ఎస్ నెంబర్‌ను పొందడం చేశారు. వారు సమర్పించిన రూ. 10 వేల డిడి, ఎల్ఆర్ఎస్ ధరఖాస్తును జతపరిచి సమర్పించగా వచ్చిన ఎల్ఆర్ఎస్ నెంబర్‌ను ఇతరులకు విక్రయించి అధికమొత్తంలో అర్జించాలని భావించారు. కొనుగోలు చేసినవారు తమ దరఖాస్తులో పేరు, ఫోన్ నెంబర్ తప్పుబడిందని, మార్చాలని కోరుతూ విన్నవించి తమపేరు మీదకు మార్చుకోవడం చేస్తున్నారు. ఎవరైతే ఎల్ఆర్ఎస్ ధరఖాస్తును సమర్పించరో వారు వేల రూపాయలు అధికంగా చెల్లించి ఆర్కిటెక్చర్లు, ప్లానర్ల నుండి కొనుగోలు చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ నెంబర్ కొనుగోలు చేసిన వారు సుమారు 50 మంది వరకు కమిషనర్ చిరంజీవులు వద్దకు పేరుమార్పిడికి వచ్చారు. అప్పుడు ఆరాతీయగా ఈ తతంగం తెలియవచ్చింది. దీంతో కమిషనర్ ఆగ్రహించి, ఎవ్వరి పేర్లు మార్చేది లేదని సంబంధిత విభాగానికి హెచ్చరికలు జారీచేశారు. ఇలా చేస్తున్నారని తెలిసిన కొంతమంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లో నుండి తొలగించారు. దీంతో మిగతా ఐటి విభాగంలో పని చేసే సిబ్బంది సమర్థవంతంగా పనిచేయడం మొదలుపెట్టారు. 4వేల ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులు విక్రయం కాకుండా నిలిచిపోయాయి. ఫలితంగా ఎల్ఆర్ఎస్‌లో అక్రమాలకు తావులేకుండా సుమారు 85 వేల ధరఖాస్తులను పరిష్కరించడం జరిగింది. కమిషనర్ తీసుకున్న నిర్ణయంపై అధికార యంత్రాంగం పూర్తిగా మద్దతుగా నిలిచింది.

'ఉమ్ర' వెళ్లిన 145మంది యాత్రికులు



మన తెలంగాణ/శంషాబాద్ : ముస్లిం సోదరులకు పవిత్రమైన ప్రార్థన స్థలం ఉమ్రను దర్శించుకోవడానికి సోమవారం ఉదయం 145 మంది యాత్రికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి సౌదీ ఎయిర్‌లైన్స్‌లో బయలుదేరారు. ఈ సందర్భంగా ఆల్ మీజాన్ డైరెక్టర్ హాఫీజ్ మహ్మద్ ఫాయాజ్ ఆలీ మీడియాతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఉమ్ర వెళ్లడానికి మొదటి బ్యాచ్‌లో145మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లిం సోదరులకు పవిత్రమైన ఉమ్రను దర్శించుకోవడానికి ఉమ్రలో అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పూర్తి ఏర్పాట్లు చేయడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, తాండూరు, వికారాబాద్, వరంగల్, పరిగి, అనంతపూర్, కరీంనగర్, నిజామాబాద్, గుల్బర్గ ప్రాంతాల నుంచి 145మంది వెళ్తునట్లు తెలిపారు. వీరందరూ వచ్చే నెల 7వ తేదీన తిరిగి వస్తారని తెలిపారు. రెండవ బ్యాచ్‌ను ఫిబ్రవరి 24వ తేదీన వెళ్తునట్లు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి

మన తెంగాణ/హైదరాబాద్/ మాదన్నపేట్ : తెలంగాణ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేయాలని, భారత రాజ్యాంగం ప్రకా రం నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంద ని రిటైర్డ్ హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. చంచల్‌గూడ జైలులో ఉన్న మంద కృష్ణమాదిగను, టిడిపి నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డిలను సోమవారం చంద్రకుమార్, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి,ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ మాజీ మంత్రి పురుషోత్తం రావు,టిడిపి మాజీ ఎమ్మెల్యే టివి రామారావులు పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం శాంతియుతంగా దీక్షలు చేసే వారిని అరెస్ట్ చేసి జైలులో పెట్ట డం సరైన చర్య కాదన్నారు. ఒంటేరు ప్రతాప్‌రెడ్డి అరెస్ట్ ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. తెలంగాణలో దళితుల ఉద్యమాన్ని అణిచివేస్తున్నారన్నారు. హక్కుల సాధన కోసం అందరిని ఐక్యం చేసి పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మంద కృష్ణమాదిగను అక్రమంగా అరెస్ట్ చేసి జైలులో పెట్టడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. కాంగ్రెస్ అక్రమ అరెస్టులపై పోరాటం చేస్తుందన్నారు. ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితులను భయపెడుతుందని,దీన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందన్నారు. పురుషోత్తం రావు మాట్లాడుతూ మంద కృష్ణ అరెస్ట్ అక్రమం అని దీన్ని కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. టివి రామారావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, ప్రజా హక్కులను ఖూనీ చేస్తుందన్నారు.ఈ నెల 29న మంద కృష్ణ మాదిగ కూతురి వివాహం నిశ్చయమైందన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి జైలు పెట్టి బెయిల్ రాకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తుంది. కూతురి పెళ్లి దృష్టిలో పెట్టుకొనైనా ప్రభుత్వం బెయిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.





విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరగాలి

మన తెలంగాణ/ హైదరాబాద్: ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లోని ఐఐటీలు, కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరపాలని, సంబంధిత కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతూ రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ప్రకాశం జిల్లాలోని లోక్‌సత్తా ఉద్యమ సొసైటీ జిల్లా కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయల్ హైకోర్టుకు లేఖ రాశారు. కాలేజీల్లో విద్యార్థులఆత్మహత్యలపై కమిటీలు వేసినా నివేదికలు ఇవ్వలేదని, ఇటీవల పది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, కాలేజీ యాజమాన్యాలు ఒత్తిళ్లకు గురిచేయడం,ఆత్మహత్య చేసుకున్న ఘటనల తర్వాత కూడా వారిలోమార్పు రాకపోవడం గురించి ఆయన లేఖలో ప్రస్తావించారు. ఈ లేఖను పిల్‌గా తీసుకున్న హై కోర్టు తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, విద్యా శాఖ, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు,శ్రీచైతన్య, నారాయణ కాలేజీల యాజమాన్యాలు తదితరుల ను ప్రతివాదులు చేసింది.ఆత్మహత్యలకు పాల్పడే కాలేజీల్లో ఒకటి ఎపికి చెందిన మం త్రిదని లేఖలో దాసరి పేర్కొన్నారు. కాలేజీల కు, దానికి అనుబంధంగా ఉన్న హాస్టల్స్‌కు అనుమతులు కూడా లేవన్నారు.ఈ పిల్‌ను మంగళవారం హైకోర్టు విచారణజరపనుంది.

జురిచ్, ఎపి ప్రభుత్వాల మధ్య ఒప్పందం

దావోస్: దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం జురిచ్ చేరుకుంది. పర్యటనలో భాగంగా జురిచ్‌లో చంద్రబాబును పయనీరింగ్ వెంచర్స్ చైర్మన్ రాన్‌పాల్ కలిశారు. కుప్పం, నాందేడ్‌లో పయనీరింగ్ సంస్థ కార్యకలాపాలు, కుప్పం లో చిన్నపాటి విమానాశ్రయం ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఎపిలో ఉద్యానపంటలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని, ఆహార శుద్ధిరంగంలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని పరిశీలించాలని పయనీరింగ్ సంస్థకు సీఎం సూచించారు. అలాగే జురిచ్, ఎపి ప్రభుత్వాల మధ్య సిస్టర్ స్టేట్ ఒప్పందం జరిగింది. ఒప్పంద పత్రాలను జురిచ్,ఎపి అధికారులు మార్చుకున్నారు.ఐటి, ఎన్విరాన్మెంటల్ టెక్నాలజీ, లైఫ్ సైన్స్, గ్రామీణ, పట్టణాభివృద్ధిలో పరస్పర సహకారానికి ఒప్పందం కుదిరింది. ఎపిలో వ్యవసాయ రంగం వృద్ధికి అనేక చర్యలు తీసుకున్నామని,పెద్దఎత్తున టెక్నాలజీ వినియోగిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఆక్వా రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని చెప్పారు. హార్టీ కల్చర్‌లో వివిధ పంటలను ప్రోత్సహించేందుకు పంటల వారీగా క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామనిబాబు తెలిపారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
మంగళవారం
23, జనవరి 2018
www.manatelangana.news

కివీస్ జైత్రయాత్ర

వెల్లింగ్టన్: పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లో న్యూజిలాండ్ జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలుత ఐదు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన న్యూజిలాండ్.. అదే జోరును ట్వంటీ 20ల్లో కూడా కొనసాగిస్తోంది. మూడు ట్వంటీ 20ల సిరీస్‌లో భాగంగా సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కివీస్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి శుభారంభం చేసింది. పాకిస్తాన్ విసిరిన 106 పరుగుల లక్ష్యాన్ని కివీస్ ఇంకా 25 బంతులుండగానే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది.

క్వార్టర్‌ఫైనల్స్‌లోకి రోజర్ ఫెదరర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సోమవారం హంగేరికి చెందిన మార్టన్ ఫాక్సో విక్స్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ ఓడించి 14వ సారి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. 31 నిమిషాల పాటు సాగిన పోరులో 80వ ర్యాంకరైన మార్టన్‌పై 6–4, 7–6(3), 6–2తో సునాయాసంగా గెలిచాడు. 1977లో కెన్ రోస్వాల్ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన అత్యధిక వయస్కుడు ఇతడే కావడం విశేషం. తదుపరి ఫెదరర్ బెల్‌బోర్న్ పార్క్‌లో చెకస్లోవేకియాకు చెందిన 19వ సీడెడ్ థామస్ బెర్డిచ్‌తో తలపడనున్నాడు. ఈ విజయంతో రోజర్ ఫెదరర్ తన కెరీర్‌లో 52వ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించాడు.





ఈ గేమ్‌లో ఇరువురు ఆటగాళ్లు చేసిన తప్పిదాలు

57 — నోవాక్ డి జకోవిచ్

37 — హెయాన్ చుంగ్

- దక్షిణ కొరియా ఆటగాడు హెయాన్ చుంగ్ చేతిలో ప్రపంచ మాజీ నెం.1 జకోవిచ్ ఓటమి
- 21 ఏళ్ల చుంగ్ క్వార్టర్ ఫైనల్స్‌లో టెన్నిస్ సాండ్‌గ్రెన్‌ను ఎదుర్కొంటాడు
- నోవాక్ గతంలో ఆరుసార్లు ఛాంపియన్

జకోవిచ్‌కు భంగపాటు



ఇంతవరకు ఈ టోర్నమెంటులో సాధరణంగా ఆడటానికి ప్రయత్నించాను. అతను నోవాక్ చాలా అనుభవం కలిగిన ఆటగాడు. అంతేకాదు ప్రపంచ నెం. 1 ఆటగాడు. అతనిపై గెలవడం చాలా ఆనందంగా ఉంది. నేను ప్రతి రౌండ్లో అతనికి పదునైన షాట్లతో జవాబిచ్చాను. ఇక ముందు కూడా ఇలాగే ఆడి టైటిల్ గెలవడానికి ప్రయత్నిస్తాను.
–హెయాన్ చుంగ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సోమవారం ఆరుసార్లు టెన్నిస్ ఛాంపియన్ అయిన సెర్బియా టెన్నిస్ క్రీడాకారుడు నోవాక్ జొకోవిచ్ ప్రపంచ నెం. 58వ ర్యాంకరైన దక్షిణ కొరియాకు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు హెయాన్ చుంగ్ చేతిలో ఓటమి చవిచూశాడు. నాలుగో రౌండ్‌లో వరుస మూడు సెట్లలో చుంగ్ 7–6(7/4), 7–5, 7–6(7/3) తేడాతో జొకోవిచ్‌ను మట్టి కరిపించాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌ను ఓడించి సంచలన విజయాన్ని సాధించాడు. దీంతో దక్షిణ కొరియా నుంచి ఓ గ్రాండ్‌స్లామ్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 16వ రౌండ్‌కు చేరిన తొలి దక్షిణ కొరియా ఆటగాడిగా నిలిచాడు. రెండేళ్ల క్రితం జకోవిచ్ ఇదే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో చుంగ్‌ను ఓపెనింగ్ రౌండ్ వరుస సెట్లలో ఓడించాడు. చుంగ్ నాలుగో రౌండ్‌లో గాయపడిన జకోవిచ్‌ను ఓడించి అంతకు ముందు ఆడిన మూడు సెట్ల ఫలితాన్ని తలక్రిందులు చేశాడు.

బంతిని అందుకోడానికి సాగినప్పుడు తుంటికి గాయమవ్వగా, అలాగే కుడి మోచేతి నొప్పికి కూడా జొకోవిచ్ చికిత్స తీసుకున్నాడు. తర్వాత ఆటను అసౌఖ్యంగానే ఆడాడు. అయితే చుంగ్ మాత్రం నిబ్బరంగా ఆటను కొనసాగించి విజయాన్ని సొంత చేసుకున్నాడు. గెలిచాక చుంగ్ మాట్లాడుతూ 'నేను ఈ రోజు రాత్రి ఈ మ్యాచ్‌ను గెలుస్తానని కూడా అనుకోలేదు. అయితే జొకోవిచ్‌తో ఆడడమే గొప్పగా భావించాను' అన్నాడు. 'నేను యువకుడిగా ఉన్నప్పుడు నోవాక్ జొకోవిచ్‌నే అనుకరించేవాడిని. ఆయన నాకు ఆదర్శం. నా విజయాన్ని నేను నమ్మలేకున్నాను. అయితే నా స్వప్నం ఈ రోజు రాత్రి నెరవేరింది' అని అన్నాడు. వింబుల్డన్‌లో మోచేతి గాయం కారణంగా ఆరు నెలలు ఆటకు దూరంగా ఉన్న జొకోవిచ్ నాలుగు రౌండ్ల వరకు బాగానే ఆడాడు. కానీ నాలుగో రౌండ్లో అనూహ్యంగా ఓటమిని చవిచూశాడు. మ్యాచ్‌లో 19 అనవసర తప్పులు చేసి జకోవిచ్ మూల్యం చెల్లించుకున్నాడు. జకోవిచ్ సర్వీసులను చుంగ్ రెండుసార్లు బ్రేక్ చేయగా, ఒకసారి మాత్రమే చుంగ్ సర్వీసును జకోవిచ్ బ్రేక్ చేశాడు. జొకోవిచ్ ఎంత బాగా ఆడినప్పటికీ చుంగ్ కొన్ని విశిష్ట పాయింట్లను గెలిచాడు. చివరికి మ్యాచ్‌ను మూడు పాయింట్లతో కైవసం చేసుకున్నాడు. ఈ ఓటమితో సెర్బియా స్టార్ జకోవిచ్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఇక చుంగ్ బుధవారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో అమెరికా ఆటగాడు టెన్నిస్ సాండ్‌గ్రేన్‌ను ఎదుర్కోనున్నాడు.

మ్యాచ్ గణాంకాలు

జకోవిచ్		హెయాన్
2 <	Aces	1
9	Double faults	> 2
62	First serve % in	> 67
65 <	Win % in 1st serve	> 65
39 (19/49)	Win % in 2nd serve	> 47 (21/45)
26 (5/19)	Break points won %	> 60 (6/10)
36	Winners	> 47
128	Total points won	> 138
196 km/h <	Fastest serve	193 km/h

నవోమి ఒసాకాపై సిమోనా హాలెప్ విజయం

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సోమవారం రొమానియాకు చెందిన ప్రపంచ నెం. 1 టెన్నిస్ క్రీడాకారిణి సిమోనా హాలెప్ జపాన్‌కు చెందిన అన్‌సీడెడ్ నవోమి ఒసాకాపై సునాయాస విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. 81 నిమిషాలపాటు సాగిన ఆటలో 6–3, 6–2 తేడాతో విజయాన్ని సాధించింది. లారెన్ డేవిస్‌తో ఆడిన గత మ్యాచ్ కన్నా 143 నిమిషాల తక్కువ వ్యవధిలోనే మ్యాచ్‌ను గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఒసాకా 31క తప్పిదాలు చేయడంతో మూల్యం చెల్లించుకుంది. సిమోనా హాలెప్ తదుపరి సెమీఫైనల్స్‌లో జెకొస్లోవేకియా ప్రత్యర్థితో తలపడనున్నది. అది ఆరో సీడ్ క్రీడాకారిణి కరోలినా ప్లిస్కోవా లేక 20వ సీడెడ్ క్రీడాకారిణి బార్బోర స్ట్రికోవాతో తలపడనున్నది.



ఏప్రిల్ 7 నుంచి ఐపిఎల్–2018

ముంబయిలో అట్టహాసంగా ప్రారంభ వేడుకలు

ప్రత్యక్ష ప్రసారం రాత్రి 8 నుంచి 7కు మార్పు: శుక్లా



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీ గ్(ఐపిఎల్) 11 వ ఎడిషన్ ఏప్రిల్ 7 నుంచి మే 27 వరకూ జరగనున్నాయ ని ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సోమవారం ప్రకటించింది. ఐపిఎల్ గేమ్ ప్రారంభోత్సవ వేడుకలు ముంబయిలో ఏప్రిల్ 6, 7 తేదీల్లో, ముగింపు వేడుక మే 27న జరగనున్నాయి. మ్యాచ్ ఆరంభ సమయాన్ని కూడా మార్చేందుకు ఐపిఎల్ గవర్నింగ్ కౌ న్సిల్ నిర్ణయించింది. ఇదివరలో దీని ని రాత్రి 8 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ముందే ఆరంభించాలని నిర్ణయించారు. అయితే ప్రసారకులు సమయాన్ని మార్చాలని ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌ను కోరడంతో సూచనప్రాయంగా ఆమోదించినట్లు ఐపిఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా తెలిపారు. 'ప్రత్యక్ష ప్రసారం రాత్రి 8 గంటల నుంచి రాత్రి 7 గంటలకు, కాగా సాయంత్రం 4 గంటలకు ఆడేది సాయంత్రం 5.30 గంటలకు ఆరంభించనున్నాం' అని కూడా ఆయన తెలిపారు. కింగ్స్ 11 పంజాబ్ జట్టు తమ నాలుగు గేమ్‌లు స్వంత గడ్డపై మొహాలిలో, మూడు గేమ్‌లు ఇండోర్‌లో ఆడనుంది. కాగా రెండేళ్ల నిషేధం తర్వాత ఐపిఎల్ బరిలోకి దిగుతున్న రాజస్థాన్ రాయల్స్ హోం మ్యాచ్‌లు ఎప్పుడాడేది జనవరి 24న రాజస్థాన్ హైకోర్టు విచారణ తర్వాత నిర్ణయించనున్నారు. బెంగళూరులో జనవరి 27, 28 తేదీల్లో జరిగే ఐపిఎల్ వేలంలో 360 మంది భారతీయ క్రికెటర్లు సహా మొత్తం 578 మంది క్రికెటర్లకు వేలం జరగనుంది.

9వ జాతీయ డిఎడి బ్యాట్‌మింటన్ టోర్నీ షురూ!



మన తెలంగాణ/ బేగంపేట్ : 9వ జాతీయ డిఎడి బ్యాట్‌మింటన్ పోటీలను అడిషనల్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ న్యూ ఢిల్లీ పిఎల్ సుకుల్ సోమవారం సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సి ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీలను జాతీయ డిఫెన్స్ అకౌంట్స్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు న్యూఢిల్లీ, (డిఎఎస్‌సిబి) ఆధ్వర్యంలో సిడిఎ 25వ తేది వరకూ నాలుగు రోజులపాటు నిర్వహిస్తుంది. దేశంలోని 36 కంట్రోల్ కార్యాలయాల నుంచి మొత్తం 145 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వీరిలో 106మంది పురుషులు, 39 మంది స్త్రీలు తమ సత్తా చాటనున్నారు. విశిష్ట అతిథి డాక్టర్. ఎమ్. ఆంజనేయులు మాట్లాడుతూ ఆటల మూలంగా దేహదారుఢ్యానికి, ఆరోగ్యానికి ఎంతో దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ సిడిఎ కంట్రో లర్ టి. రాంబాబు, కంట్రోలర్ వై.రాజారెడ్డి, కె. వెంకట్రావ్, ఎం. శ్రీనివాస్, కె. బాలకృష్ణ, డాక్టర్ జె. సిరీష్ చౌతరా, మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు, (టిఎస్‌ఎ) డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది ఆటల ప్రారంభోత్స కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

టి20 ట్రైసిరీస్‌కు ఆసీస్ కెప్టెన్‌గా డేవిడ్ వార్నర్

మెల్‌బోర్న్: త్వరలో ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లతో పాల్గొనబోయే ముక్కోణపు టి20 సిరీస్‌కు ఆస్ట్రేలియా కెప్టెన్‌గా డేవిడ్ వార్నర్‌ను ఎంపిక చేశారు. ఆసీస్ రెగ్యులర్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ విశ్రాంతి కోరిన నేపథ్యంలో వార్నర్‌ను సారథిగా ఎంపిక చేస్తూ క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముక్కోణపు సిరీస్‌తో పాటు దక్షిణాఫ్రికా సిరీస్‌లకు ఆసీస్ జట్టును తాజాగా ప్రకటించింది. గమనించాల్సిన అంశం ఏమిటంటే వార్నర్ మినహా దాదాపు ఆస్ట్రేలియా టెస్టు జట్టంతా ట్రైసిరీస్‌కు దూరం కానుండటం గమనార్హం. తనకు చిన్నపాటి విరామం కావాలంటూ స్మిత్ విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో విశ్రాంతి ఇచ్చినట్లు సిఎ తెలిపింది. కాగా, దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా నాలుగు టెస్టుల సిరీస్‌కు స్మిత్ సారథిగా వ్యవహరించనున్నాడు.

ట్వంటి 20 జట్టు: డేవిడ్ వార్నర్(కెప్టెన్), అరోన్ ఫించ్, ఆస్టన్ ఆగర్, అలెక్స్ కారే, బెన్ ద్వార్షూయిస్, ట్రావిస్ హెడ్, క్రిస్ లిన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, కేన్ రిచర్డ్‌సన్, డీ ఆర్సీ షార్ట్, బిల్లీ స్టాన్‌లేక్, స్టోనిస్, ఆండ్రూ టై, ఆడమ్ జంపా.

దక్షిణాఫ్రికా పర్యటనకు ఆసీస్ జట్టు: స్టీవ్ స్మిత్(కెప్టెన్), డేవిడ్ వార్నర్, కామెరూన్ బాన్‌క్రాఫ్ట్, జాక్సన్ బర్డ్, ప్యాట్ కమిన్స్, పీటర్ హ్యాండ్‌స్కాంబ్, హజల్‌వుడ్, ఉస్మాన్ ఖాజా, నాథన్ లయన్, మిచెల్ మార్ష్, షాన్ మార్ష్, టిమ్ పైనీ, జై రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్.

కోహ్లి గొప్ప బ్యాట్స్‌మన్ కానే కాదు

- మైకెల్ హోల్డింగ్



ట్రినిడాడ్, టొబాగో(వెస్టిండీస్): టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిపై వెస్టిండీస్ దిగ్గజం మైకెల్ హోల్డింగ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న మేటి ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లలో కోహ్లి ఒకరని, మిగతా ఇద్దరు ఇంగ్లాండ్‌కు చెందిన జోరూట్, ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్‌స్మిత్ అన్నారు. గొప్ప బ్యాట్స్‌మన్ ఎక్కడైనా పరుగుల స్కోర్ చేస్తాడు. కోహ్లి ఇంకా అలాంటిది చేయాల్సి ఉందన్నారు. కోహ్లి మంచి బ్యాట్స్‌మనే తప్ప గొప్ప బ్యాట్స్‌మన్ కానే కాదని.. ఒకవేళ అది నిరూపించుకోవాలంటే తన ముందున్న ఛాలెంజ్‌ను కోహ్లి అధిగమించాలని హోల్డింగ్ సూచించాడు. 'ముంబయి మిర్రర్'కు హోల్డింగ్ ఆసక్తికర విషయాలు చెప్పాడు. 'మూడు ఫార్మట్‌లలో కోహ్లి అద్భుతమైన ఆటగాడని అంతా ప్రశంసిస్తుంటారు. కానీ, అది నిరూపించుకోవాలంటే ఇంగ్లాండ్ గడ్డపై అతను పరుగులు సాధించాల్సి ఉంటుంది. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ కోల్పోయినప్పటికీ.. సెంచూరియన్‌లో 153 పరుగులు ఇన్నింగ్స్‌తో కోహ్లి ఆకట్టుకున్నాడు. అయితే గతంలో 2014 ఇంగ్లాండ్ సిరీస్ సందర్భంగా కోహ్లి మొత్తంగా విఫలం అయ్యాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో మొత్తంగా అతను సాధించిన సగటు కేవలం కేవలం 13.4 మాత్రమే. ఇన్నేళ్లకు కోహ్లికి మళ్లీ అవకాశం దక్కింది. తానేంటో నిరూపించుకోవాలి'' అని హోల్డింగ్ తెలిపాడు.

ప్రతిష్టాత్మక సర్ గార్ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీని ఇటీవల గెలుచుకున్న నాలుగో భారతీయుడు కోహ్లి. 2010లో సచిన్ టెండూల్కర్, 2004లో రాహుల్ ద్రావిడ్, 2016లో రవిచంద్రన్ అశ్విన్ గెలుచుకున్నారు. 2012 నుంచి ప్రపంచ అత్యుత్తమ వన్డే బ్యాట్స్‌మన్‌గా కోహ్లి రెండోసారి నిలిచాడు. వన్డే ఫార్మట్‌లో ఏడు శతకాలు సహా 1818 పరుగులు చేశాడు. 2016 సెప్టెంబర్ 21 నుంచి 2017 చివరి వరకు కోహ్లి 2,203 టెస్టు పరుగులు, ఎనిమిది శతకాలు సహా 77.80 సగటు సాధించాడు. అయితే కోహ్లి పయనం నల్లేరుపై నడకలా కొనసాగలేదు. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఆడినప్పుడు కోహ్లి సేన 2–0తో ఓటమిని చవిచూసింది. దాంతో కోహ్లి జట్టు ఎంపిక విమర్శల పాలైంది. విదేశాల్లో టీమిండియా టెస్ట్ రికార్డు చాలా చెత్తగా ఉందన్న ముద్ర పడింది.

కోహ్లి మంచి ఆటగాడని మాత్రమే తానూ ఒప్పుకుంటానని.. ఇంగ్లాండ్‌పై రాణిస్తే అతన్ని గొప్ప బ్యాట్స్‌మన్‌గా అంగీకరిస్తానని హోల్డింగ్ తేల్చి చెప్పాడు. జూలైలో ఇంగ్లాండ్ పర్యటనకి వెళ్లనున్న టీమిండియా జట్టు అక్కడ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది.

ఆత్మరక్షణలో విరాట్ కోహ్లి

- వరుస పరాజయాలతో సతమతమవుతున్న టీమిండియా
- ప్రధాన కోచ్ రవిశాస్త్రికీ తప్పని విమర్శల తాకిడి

మన తెలంగాణ/ క్రీడా విభాగం : కిందటి సీజన్‌లో వరుస విజయాలతో ప్రపంచ క్రికెట్‌లో ఎదురులేని శక్తిగా కొనసాగిన టీమిండియాకు దక్షిణాఫ్రికా చుక్కలు చూపించింది. బౌన్సీ పిచ్‌లపై భారత్ బలహీనతను సఫారీ బౌలర్లు తమకు అనుకూలంగా మార్చుకుని జట్టుకు చిరస్మరణీయ విజయాలు అందించారు. వరుసగా రెండు టెస్టుల్లో ఓటమి పాలైన భారత జట్టు ఇంటాబయట విమర్శలతో సతమతమవుతోంది. జట్టులో చాలా మంది స్టార్ బ్యాట్స్‌మెన్ ఉన్నా స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించలేక ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఈ ఓటమిల ప్రభావం టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రిలపై అధికంగానే కనిపిస్తోంది. ఇప్పటి వరకూ ఎదురులేని శక్తిగా కొనసాగిన కోహ్లి సౌతాఫ్రికా చేతిలో సిరీస్ కోల్పోవడంతో ఆత్మరక్షణలో పడ్డాడు. అతనిపై రోజురోజుకు విమర్శలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జట్టును ముందుండి నడిపించడం కోహ్లికి సవాలుగా మారింది. నలువైపులా నుంచి ఎదురవుతున్న విమర్శలకు సమాధానం చెప్పాలంటే చివరి టెస్టులో జట్టును గెలిపించడం ఒక్కటే అతని ముందున్న ఏకైక మార్గం. ఇందులో అతను సఫలమైతే తన పట్టును కాపాడుకోవడం ఖాయం. ఒకవేళ మూడో టెస్టులోనూ ఓటమి పాలైతే మాత్రం కోహ్లికి ఇబ్బందికర పరిస్థితి ఎదురు కావడం ఖాయం. రెండు టెస్టుల్లో జట్టు ఓటమికి కోహ్లి తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలే కారణమనే విమర్శలు ఉన్నాయి. బౌన్సీ పిచ్‌లపై మంచి రికార్డు కలిగిన అజింక్య రహానెకు తుది జట్టులో చోటు కల్పించక పోవడం, రెండో మ్యాచ్‌లో ఫాంలో ఉన్న స్పీడ్‌స్టర్ భువనేశ్వర్‌ను పక్కన బెట్టడంపై పెను దుమారమే లేచింది. ముఖ్యంగా తొలి టెస్టులో అసాధారణ రీతిలో రాణించిన భువనేశ్వర్‌ను తప్పించడంపై కోహ్లి పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొవాల్సి వచ్చింది. ఈ నిర్ణయాన్ని గవాస్కర్, సెహ్వాగ్‌తో సహా చాలా మంది తీవ్రంగా తప్పుపట్టారు. కోహ్లి నియంతల వ్యవహరిస్తూ జట్టు ప్రయోజనాలను దె బ్బతీస్తున్నాడనే విమర్శలు పెరిగి పోయాయి. అతన్ని ఎలాగైన కట్టడి చేయాలని బిసిసిఐపై ఒత్తిడి పెరుగుతోంది. అ యితే ఇప్పట్లో కోహ్లికి వ్యతిరేకంగా వెళ్లే సాహసం బిసిసిఐ చేసే పరిస్థితులు కనిపించడం లేదు. కానీ, కోహ్లి జోరుకు మాత్రం కాస్త బ్రేక్ పడిందనే వాస్తవం మాత్రం స్పష్టంగా క నిపిస్తోంది. కెప్టెన్సీ చేపట్టిన తర్వాత వరుస విజయాలతో దూసుకుపోతున్న కోహ్లికి దక్షిణాఫ్రికా సిరీస్‌లో అసలైన పరీక్షగా ఎదురైంది. ఈ పరీక్షలో అతను విఫమయ్యాడనే చెప్పాలి. జట్టును గెలిపించడంలో కెప్టెన్‌గా కోహ్లి వైఫల్యం స్పష్టంగా కనిపించింది. అతను తీసుకున్న చాలా నిర్ణయా లు జట్టుకు ప్రతికూలంగా పరిణమించాయి. దీంతో జట్టు ఓటమికి అందరు అతన్నే బాధ్యుడ్ని చేశారు. ఇలా ఇంటాబయట విమర్శలతో సతమతమవుతున్న కోహ్లికి బుధవా రం నుంచి ప్రారంభమయ్యే మూడో, ఆఖరి టెస్టు పెను స వాలు వంటిదేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కోహ్లికి ఒక పరీక్షలాంటిదేనని వారు అభిప్రాయపడుతున్నారు. ఇందులో కోహ్లి ఏ మేరకు సఫలమవుతాడో వేచి చూడాలి..



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.